ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 05.05.2025 | సంపుటి :11 సంచిక : 286 | పేజీలు :12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## పాక్‌కు మరో దెబ్బ

### బాగ్‌లిహార్ డ్యామ్ నుంచి దాయాదికి నీరు నిలిపివేసిన భారత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి భారత్ దిగ్బంధిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన న్యూదిల్లీ.. తాజాగా బాగ్‌లిహార్ ఆనకట్ట నుంచి పాక్‌కు నీటి సరఫరాను నిలిపివేసింది. దాయాదిని ఎండగట్టే చర్యల్లో ఇది రెండోదిగా భావిస్తున్నారు. పాకిస్థాన్ శనివారం ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణిని పరీక్షించిన నేపథ్యంలో ఈ విషయం బయటకు రావడం గమనార్హం.నీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఈ డ్యామ్ స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు దించేశారు. దీంతో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇది స్వల్పకాల చర్యగా మిగతా 2లో..

## యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ..

# ప్రధానితో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ



**పహల్గాం దాడి తర్వాత భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అంతకు ముందు రోజే నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు.పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని నాడు సీసీఎస్ వెల్లడించింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ మిగతా 2లో..



## దక్షిణ తెలంగాణకు భారాస అన్యాయం

### కృష్ణా జలాలపై రాజీపడే ప్రసక్తే లేదు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- వాటిని గతపాలకులు ఏపీకి ధారాదత్తం చేశారు
- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేస్తాం
- టన్నెల్ నిర్మాణం పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి పూర్తిచేస్తాం
- ధాన్యం దిగుబడిలో ఖరీఫ్‌లో సృష్టించిన రికార్డును పునరావృతం చేస్తాం
- నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుంది

**నల్గొండ(జనంసాక్షి):**ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని, ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని, దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేయలేదని.. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అధిక మిగతా 2లో..



## ఆగని ‘అణు’ బెదిరింపులు

### పాక్‌పై దాడి చేస్తే అణ్వాయుధాలను ప్రయోగిస్తాం • పాక్ దౌత్యవేత్త ప్రేలాపనలు



ఆదివారం పాక్ తీరానికి చేరుకున్న తుర్కియే యుద్ధనౌక

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** తమ బెదిరింపులను ఏమాత్రం పట్టించుకోకుండా.. భారత్ తన ‘ప్రతిస్పందన’ ఏర్పాట్లలో మునిగిపోవడం.. పాక్‌ను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో కవ్వింపు చర్యలను ఆపడం లేదు. తాజాగా రష్యాలోని పాక్ దౌత్యవేత్త మహమ్మద్ ఖలీద్ జమాలీ మరోసారి అణు బూచిని భారత్‌కు చూపించి బెదిరించే యత్నం చేశారు. ఒక వేళ న్యూదిల్లీ తమపై దాడి చేస్తే.. అణ్వాయుధాలు సహా పూర్తి శక్తిని వినియోగిస్తామని పేర్కొన్నారు. రష్యా ఛానల్ ఆర్‌టీకి ఇంటర్వ్యూ ఇస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.“భారత్‌కు చెందిన బాధ్యతారాహిత్య మీడియా నుంచి వస్తున్న ప్రకటనలు మమ్మల్ని మిగతా 2లో..

- ఎగుమతులపై నిషేధానికి ప్రతిగా భారత నౌకలపై పాకిస్తాన్ నిషేధం
- నియంత్రణ రేఖ వద్ద పదోరోజు కొనసాగిన కాల్పులు
- యుద్ధభయంతో కొనసాగుతున్న పాక్ సంప్రదింపులు
- మద్దతుగా కరాచీ తీరానికి తుర్కియే అత్యాధునిక యుద్ధనౌక
- భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు
- పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ అనుమానం

## మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు

**వాళ్లు తుపాకీ వీడాల్సిందే.. లొంగిపోవాల్సిందే..**

**చర్చలు జరపాలని పోటీపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**



వార్త 2లో

## చర్చలకు సిద్ధం

### ఆర్టీసీ నేతలతో సమావేశమవుతాం : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దని విజ్ఞప్తి**



**హుస్నాబాద్(జనంసాక్షి):**ఈనెల 5,6 తేదీల్లో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులతో చర్చలకు సిద్ధమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్‌లో మంత్రి ఆకస్మికంగా పర్యటించారు. ప్రయాణికులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. “ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక నేతలతో చర్చలకు సిద్ధంగా ఉన్నాం. ఆర్టీసీ మన కుటుంబం. సమస్యలపై మాట్లాడి పరిష్కరించుకుంటాం. చర్చలకు సిద్ధమని ఆర్టీసీ ఉద్యోగులు కూడా అన్నారు. రవాణా వ్యవస్థ బాగుండాలని కొత్త బస్సులు కొనుగోలు చేశాం. ఆర్టీసీ మనందరిది, మన సంస్థను మనమే కాపాడుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు,ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 10 సంవత్సరాలుగా ఆర్టీసీ నిర్వీర్యం అయిపోయి ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇబ్బందికర పరిస్థితులు కలిగే విధంగా చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

## భారత్ సైనిక రహస్య సమాచారం పాక్‌కు లీక్

**పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇద్దరు వ్యక్తుల అరెస్టు**

**పహల్గాం ఉగ్రదాడి దర్యాప్తునకు ఆటంకంగా తప్పుడు సమాచారం..!**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత సైనిక దళాల కదలికలకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం, ఫొటోలను పాకిస్థాన్‌కు చేర వేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని మిగతా 2లో..

## విద్యార్థుల సమస్యలు పట్టవా?

### ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం: హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):**విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు మిగతా 2లో..



## రహదారులు రక్తసిక్తం

- ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదాలు.. ఐదుగురి మృతి
- ఓఆర్‌ఆర్‌పై కంటైనర్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి
- సిద్ధిపేటలో రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరు మృతి
- రాజస్తాన్‌లోని జైపుర్ ఘోర రోడ్డు ప్రమాదం..
- ‘నీట్’ రాసేందుకు వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు మృతి






**జైపుర్/ఒంగోలు/మేడ్చల్/ సిద్ధిపేట (జనంసాక్షి):** ప్రకాశం జిల్లాలో దాదాపు ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. ఒంగోలు మండలం కొప్పోలు సమీపంలో కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడి ముగ్గురు మృతి చెందారు. మృతులను నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన రమణయ్య (60), బాబు (45), నాగేంద్ర (25)గా గుర్తించారు. బోల్తాపడిన లారీని మరో లారీ ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.ఆ ట్రాఫిక్‌లో ఆగి ఉన్న కారును వెనక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా.. అందులో ప్రయాణిస్తున్న పావని (25), కౌశిక్(14) మృతి చెందారు. వీరు గుంటూరు జిల్లా నుంచి తిరుమలకు వెళ్తున్నట్లుగా గుర్తించారు.

**ఓఆర్‌ఆర్‌పై కంటైనర్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి**

**కీసర:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధిలోని ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనక నుంచి మిగతా 2లో..

## ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించే అవసరంరాదు

### ఆ పరిస్థితి ఏర్పడదని ఆశిస్తున్నా: పుతిన్



**మాస్కో(జనంసాక్షి):**ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే అవసరం తలెత్తదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ పరిస్థితి ఏర్పడదని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు.రష్యా అధికారిక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి తార్కిక ముగింపు తీసుకురావడానికి రష్యా వద్ద బలం ఉందని ఆయన పేర్కొన్నారు .రష్యన్ భూభాగంపై ఉక్రెయిన్ దాడుల గురించి అడిగిన ప్రశ్నకు పుతిన్ సమాధానమిస్తూ “ఆ దేశంపై అణ్వాయుధాలను ఉపయోగించాల్సిన అవస రం రష్యాకు లేదు. 2022లో ప్రారంభించిన యుద్ధాన్ని రష్యా కోరుకునే విధంగా ముగించడానికి మా వద్ద తగిన బలం, వనరులు ఉన్నాయి” అని చెప్పారు.2024 నవంబర్‌లో రష్యా అణు సిద్ధాంతం పునరుద్ధరణ పత్రాలపై పుతిన్ సంతకం చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద అణు ఆయుధాగారాన్ని ఉపయోగించుకోవడానికి వీలు కల్పించే పరిస్థితులను ఆయన వివరించారు. అయితే.. ఉక్రెయిన్‌పై ఆ అవసరం రాదని తాజాగా స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్న విషయం మిగతా 2లో..

## ఇజ్రాయిల్‌పై హౌతీల క్షిపణి దాడి

**ప్రధాన విమానాశ్రయం బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్‌కు అత్యంత సమీపంలో భారీ పేలుడు**

- విఫలమైన నాలుగు అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ
- ఘటనలో ఎనిమిది మందికి గాయాలు
- తీవ్ర భయాందోళనలకు గురై పరుగులు తీసిన ప్రజలు





**టెల్అవీవ్(జనంసాక్షి):**హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ మిస్సైల్‌తో విరుచుకుపడ్డారు. ఆదివారం. ఇజ్రాయిల్‌లో అతిపెద్ద విమానాశ్రయమైన టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్‌పైకి క్షిపణితో ఎటాక్ చేశారు. దీంతో ఒక్కసారిగా ఇజ్రాయిల్ ప్రజల్లో భయాందోళనలకు గురయ్యారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 నుంచి కేవలం 75 మీటర్ల దూరంలోనే క్షిపణి పడింది. మిస్సైల్ ధాటికి 25 మీటర్ల లోతైన భారీ గొయ్యి ఏర్పడింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇజ్రాయిల్‌కి ఉన్న శక్తివంతమైన నాలుగు అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను దాటుకుని క్షిపణి దాడి జరగడం సంచలనం కలిగిస్తోంది. క్షిపణి విమానాశ్రయం సమీపంలో పడకుండా అడ్డగించిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయని ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) తెలిపింది. ఒక్కసారిగా మిస్సైల్ దాడి జరగడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. ఈ దాడిలో 8 మంది గాయపడినట్లు మిగతా 2లో..

## లోయలోపడ్డ ఆర్మీ ట్రక్కు

### ప్రమాదంలో ముగ్గురు జవాన్ల దుర్మరణం

**జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ వద్ద చోటుచేసుకున్న ఘటన**



**శ్రీనగర్(జనంసాక్షి):**భారత సైన్యానికి చెందిన ఓ ట్రక్కు జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ వద్ద లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళుతున్న ఆర్మీ వాహనం.. ‘బ్యాటరీ చెష్మా’ అనే ప్రదేశం వద్ద 600 అడుగుల లోయలోకి దొర్లిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న జవాన్లు చనిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.మృతి చెందిన సైనికులను అమిత్ కుమార్, సుజిత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీస్, ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, సివిల్ క్యూఆర్టీ బృందాలు రాంబన్‌కు బయల్దేరినట్లు అధికారులు వెల్లడించారు. మిగతా 2లో..

**భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి**

## తగిన సమాధానం చెబుతాం

**రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం రక్షణ మంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పని తీరు, పట్టుదల గురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్.. మిగతా 2లో..

## యూరప్ దేశాలది ద్వంద్వవైఖరి

**భారత్‌తో వారు సంబంధాలు నెలకొల్పాలంటే స్నేహ స్వభావం, పరస్పర ఆసక్తి కలిగి ఉండాలి : జైశంకర్**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ యూరప్ దేశాధినేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో యూరప్ సన్నిహిత సంబంధాలు నెలకొల్పాలంటే స్నేహస్వభావం, పరస్పర ఆసక్తి కలిగి ఉండాలని మిగతా 2లో..

## రహదారులు రక్తసిక్తం

కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు వెనక సీట్లో కూర్చున్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బీదర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఒకరి తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు నగరంలోని మేడిపల్లి, బోడుప్పల్‌కు చెందిన యశ్వంత్(25), చార్లెస్(25)గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి**

సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మార్కుక్ మండలం కావేరి కంపెనీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

**జైపుర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 'నీట్' రాసేందుకు వెళ్తున్న ముగ్గురి విద్యార్థులు మృతి**

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ) పరీక్ష రాసేందుకు వెళ్తుండగా విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. వీరిలో ఇద్దరు నీట్ అభ్యర్థులు ఉండగా.. వారితో పాటు ఉన్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. రాజస్థాన్‌లోని జైపుర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన పెను విషాదం రేపింది. ఇద్దరు విద్యార్థినులు మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై నీట్ పరీక్ష రాసేందుకు ఆదివారం మధ్యాహ్నం పరీక్ష కేంద్రానికి వెళ్తుండగా ఓ వంతెన వద్ద వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. మృతులను ఖుషి శర్మ (21), ప్రియా శర్మ(22)గా గుర్తించారు. వీరిద్దరూ బస్సీ పట్టణం సమీపంలోని ఓ గ్రామానికి చెందినవారని తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల సమస్యలు పట్టవా?

రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## యూరప్ దేశాలది ద్వంద్వవైఖరి

అన్నారు. ప్రపంచం ఎలా పని చేస్తుందో గమనించాలని సూచించారు. న్యూదిల్లీ ప్రపంచ దేశాల వైపు చూసినప్పుడు బోధకుల కోసం కాకుండా..భాగస్వాముల కోసం ఎదురు చూస్తోందని వ్యాఖ్యానించారు. బోధకులు బయటి వారికి చెప్పే విషయాలను తమ సొంతం దేశంలో పాటించరని జైశంకర్ అన్నారు. యూరప్‌లోని చాలా ప్రాంతాలు ఇప్పుడు అటువంటి సమస్యనే ఎదుర్కొంటున్నాయని తెలిపారు. భారత్‌కు యూరప్‌తో దాదాపు 40ఏళ్ల స్నేహబంధం ఉందని..కొన్నేళ్లక్రితం దానితో పలు ఒప్పందాలు చేసుకున్నామని జైశంకర్ పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధ నివారణకు మాస్కో ప్రమేయం లేకుండా పశ్చిమ దేశాలు చేసిన పలు ప్రయత్నాలను విదేశాంగ మంత్రి విమర్శించారు. భారత్ ఎల్లప్పుడూ వాస్తవికతను సమర్థిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించే అవసరంరాదు

తెలిసిందే. వివాదాన్ని దౌత్య మార్గాల్లో ముగించాలని ట్రంప్ చెప్పగా.. శాంతి పరిష్కారం కోసం చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే.మరోవైపు రష్యా నిర్వహిస్తున్న 'విక్టరీ డే' కవాతుకు హాజరయ్యే విదేశీ ప్రముఖుల ప్రాణాలకు తాను హామీ ఇవ్వలేనంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిక జారీ చేశారు. 'విక్టరీ డే' 80వ వార్షికోత్సవాలను ఈ నెల 9న భారీగా నిర్వహించడానికి మాస్కో సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఉక్రెయిన్ ముందు మాస్కో ఉంచింది. దీన్ని జెలెన్‌స్కీ శనివారం తిరస్కరించారు.

## ఇజ్రాయిల్‌పై హౌతీల క్షిపణి దాడి

ఇజ్రాయిల్ అధికారులు వెల్లడించారు. మరోవైపు, ఇజ్రాయెల్‌పై హౌతీ ఎటాక్‌తో భారత్ అప్రమత్తమైంది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీన్‌కు ఎయిరిండియా విమానాలను రద్దు చేసింది. టెల్ అవీవ్‌కు వెళ్లే విమాన సర్వీసులను అబుదాబికి మళ్లించింది. రెండు రోజుల పాటు టెల్ అవీవ్‌కు సర్వీసులను రద్దు చేసింది.

## భారత్ సైనిక రహస్య సమాచారం
# పాక్‌కు లీక్

అమృత్‌సర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పాలక్ షేర్ మసిహ్, సూర్ మసిహ్‌లుగా వీరిని గుర్తించారు.వీరు పాక్‌లోని ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు సమాచారం ప్రకారం హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు అలియాస్ హ్యాపీ సూచనల మేరకు వీరు పని చేస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం హర్‌ప్రీత్ సింగ్ అమృత్‌సర్ జైల్లో ఉన్నాడు.వీరి వద్ద అత్యంత సున్నితమైన విజువల్స్‌తోపాటు, డేటా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అధికార రహస్యాల చట్టం కింద వీరిపై కేసులు పెట్టారు. దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ మరిన్ని అరెస్టులు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.కాగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలు పహల్గాం ఉగ్రదాడి దర్యాప్తునకు ఆటంకాలు సృష్టిస్తున్నాయి. ఇప్పటి వరకు జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు దాదాపు 200కు పైగా ఇలాంటివి ఎదురయ్యాయి. ముఖ్యంగా ఇన్‌ఫ్లూయెన్సర్లు, పాక్ కేంద్రంగా పుట్టుకొస్తున్న తప్పుడు సమాచారాలు వీటిల్లో అధికంగా ఉంటున్నాయి. వీటి కారణంగా దర్యాప్తులో జాప్యం చోటు చేసుకుంటోందని ఓ అధికారి వెల్లడించారు. ముఖ్యంగా 3డీ క్రైమ్ సీన్ మ్యాపింగ్‌కు ఇవి అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.ఇటీవల ఇద్దరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు వ్యూయర్ షిప్‌ను పెంచుకునేందుకు శ్రీనగర్‌కు వచ్చి తప్పుడు ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరు ట్యాక్సీ డ్రైవర్ ఇంటర్వ్యూను ఉద్దేశపూర్వకంగా ట్యాంపరింగ్ చేసినట్లు సమాచారం. ఇక బిహార్‌కు చెందిన మరో ఇన్‌ఫ్లూయెన్సర్ శ్రీనగర్ లాల్‌చౌక్ వద్ద ఉద్దేశపూర్వకంగా ఓ వర్గాన్ని రెచ్చగొట్టాడు. మరో సోషల్ మీడియా నిర్వాహకుడు సోన్‌మార్గ్ ప్రాంతాన్నే పహల్గాంగా చూపించాడు.ఇక పాక్ నిర్వహిస్తున్న ఫేక్ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ కూడా బలంగా పనిచేస్తోంది. దర్యాప్తు అధికారులకు తప్పుడు లీడ్‌లు ఇవ్వడం వంటివి జరుగుతన్నాయి. తప్పుడు కాల్స్ రావడం.. ఎవరిని పడితే వారిని అనుమానితులుగా పేర్కొనడం, డీప్ ఫేక్ వీడియోలు, బాధితులను కించపర్చేలా క్లిప్‌లు పెట్టడం, మతాల మధ్య చిచ్చుపెట్టడం వంటివి దర్యాప్తు బృందాలకు చాలా ఆటంకాలను సృష్టిస్తున్నాయి.భారత్ సైన్యం ఆపరేషనల్ లోపాలు అంటూ పాక్ సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు పత్రాలను ప్రచారంలోకి తీసుకొచ్చాయి. వీటిని పీఐబీ ఫ్యాక్ట్ చెకింగ్‌తో అడ్డుకొంది. పహల్గాం దాడికి చర్యలుగా.. లెఫ్టినెంట్ జనరల్ సుచింద్ర కుమార్‌ను డిస్మిస్ చేసినట్లు ప్రచారం జరిగింది. ఇక ఆర్మీ ఆధునికీకరణకు రోజుకు రూపాయి చొప్పున కోరుతూ ఓ వాట్సాప్ మెసేజ్ వైరల్‌గా మారింది. సరిహద్దుల్లో షెల్లింగ్, కార్చిచ్చుకు సంబంధించిన పాత వీడియోలను కూడా ఇప్పుడు ప్రచారంలోకి తెస్తున్నారు. పాక్‌కు చెందిన డాన్ న్యూస్, ఏఆర్‌వై న్యూస్ వంటివి పహల్గాం దాడిని భారతే చేయించిందనే ప్రచారం మొదలుపెట్టాయి.




# దక్షిణ తెలంగాణకు భారాస అన్యాయం

ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. కృష్ణా జలాశయాలపై రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. బి.ఆర్.ఎస్ పాలకులు దశాబ్దా కాలంగా తెలంగాణాకు చేరాల్సిన కృష్ణా జలాశయాలను ఆంధ్రప్రదేశ్ కు ధారదత్తం చేశారని ఆయన ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖాపై ఉమ్మడి నల్లగొండ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్,నెల్లికంటి భిక్షం, లోకసభ సభ్యులు రఘువీర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి,శాసనసభ్యులు బి.లక్ష్మారెడ్డి,కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,జయదిర్ రెడ్డి, బాలు నాయక్,నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్,ఆర్ ఆర్ కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి,నీటిపారుదల శాఖా ఇ.ఎన్. సి లు శ్రీనివాస్ నల్గొండ, యాదాద్రి,సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి,హనుమంతరావు, తేజస్ నందాలాల్ పవార్ ఇతర అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కృష్ణా జలాశయాల పంపకాల పట్ల బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పడిన కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ –2 పునఃప్రారంభించి 811 టి.యం.సి ల నీటిపంపకంపై తిరిగి పరిశీలన మొదలు పెట్టారన్నారు. బి.ఆర్.ఎస్ పాలనలో అప్పటి పాలకులు కృష్ణా జలాశయాలను అక్రమంగా తరలించుకుని పోతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోటే ఆంధ్రప్రదేశ్ పాలకులు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచుకోవడంతో పాటు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. బి.ఆర్.ఎస్ పాలనలో నీటిపారుదల రంగంలో దక్షిణ తెలంగాణాకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. గత పాలకులు 94 వేల కోట్లతో కాళేశ్వరం కట్టడంతో పాటు నీటిపారుదల రంగంపై కోటి 80 లక్షల కోట్లు ఖర్చు చేశారని అయినా కొత్తగా ఆయకట్టు స్థిరీకరణ చెయ్యలేక పోయారని ఆయన దుయ్యబట్టారు. అవే డబ్బులు దక్షిణ తెలంగాణాలో ఖర్చు చేసి ఉంటే ఎస్.ఎల్.బి.సి,పాలమూరు–రంగారెడ్డి, చేవెళ్ల–ప్రాణహిత, ఉదయ సముద్రం, బ్రాహ్మణ వెల్కెంల,భీమా,నెట్టెం పాడు,కల్వకుర్తి, కోయిల సాగర్ లతో పాటు ఉత్తర తెలంగాణా లోని దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తి అయి ఉండేవన్నారు.నాగార్జున సాగర్,శ్రీరాంసాగర్ వంటి మేజర్ ప్రాజెక్టు లలో మట్టి,ఇసుక మేటలు చేరి నీటిసామర్థ్యం తగ్గిందని దానితో టెల్ ఎండ్ భూములకు నీటి లభ్యత కొరవడిన దృష్ట్యా పూడిక తీత పనులకు అంకురార్పణ చుట్టామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల ఆకాంక్ష అయిన ఎస్.ఎల్.బి.సి ని పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాను సశ్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు అయితే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగిన దృష్ట్యా ఎస్.ఎల్.బి.సి పనులు నిలిచి పోయాయని ఇది తాత్కాలిక విరామం మాత్రమే నని ఆయన పేర్కొన్నారు. ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణకు గాను జాతీయ స్థాయిలో సాంకేతిక నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నామని,కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పనులు పునరుద్ధరణ ఉంటుందని ఆయన చెప్పారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ప్రారంభించిన ఎత్తిపోతల పథకాలు తుది దశకు చేరుకున్నాయన్నారు.జూన్ మాసంతానికి కేశవపురం ఎత్తిపోతల పథకం,2025 సంవత్సరం లోపు దున్న పోతుల గండి–చామల తండా ఎత్తిపోతల పథకం, బొత్తల పాలెం–వాడపల్లి ఎత్తిపోతల పథకం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.కొత్త ఆయాకట్టును సేద్యం లోకి తీసుకొచ్చేందుకు ప్రారంభించిన ఎత్తిపోతల పథకాలతో పాటు చెక్ డ్యామ్ ల పూర్తికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

రబీ లోను అదే రికార్డ్

ధాన్యం దిగుబడిలో తెలంగాణా రాష్ట్రం ఖరీఫ్ లో సృష్టించిన రికార్డును పునరావృతం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ లో 66.7 ఎకరాల సేద్యానికి గాను 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయితే తాజాగా యాసంగి సీజన్లో 55 లక్షల ఎకరాల సాగుకు గాను 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాదించిందని ఆయన తెలిపారు. ఇది ఆల్ టైం రికార్డని,యావత్ భారతదేశంలో కాదు కదా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడు కుడా ఇంతటి దిగుబడి సాధించ లేదని ఆయన తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం వ్యవదిలో ఖరీఫ్,రబీ కలిపి 281 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాదించాడం ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ఘనత మాత్రమే నన్నారు. పండిన దాన్యానికి మద్దతు ధర చెల్లించడంతో పాటు యావత్ భారత దేశంలో ముందెన్నడూ లేని రీతిలో సన్నలకు 500 రూపాయల బోనస్ అందించిన ఘనత కుడా కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. అన్నింటికీ మించి నిరుపేదలకు ఆహార భద్రత కల్పించింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పుకోవడానికి గర్వ పడుతున్నామన్నారు. నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు రాష్ట్రంలో 84 శాతం ప్రజలకు అంటే 3.81 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నామన్నారు పేదలకు అందించే సన్న బియ్యం పై 13000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ
# ప్రధానితో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

విన్యాసాలను నిర్వహించింది.2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన పాక్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫెల్ యుద్ధ విమానాలు, ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

## మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు

- వాళ్లు తుపాకీ వీడాల్సిందే.. లొంగిపోవాల్సిందే..
- చర్చలు జరపాలని పోటీపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి):** మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని, వాళ్లు తుపాకీ వీడి పోలీసులకు లొంగిపోవాల్సిందేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మావోయిస్టు సమస్యను సామాజిక కోణంతో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆపరేషన్ కగార్‌ను ఆపాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. అసలు మావోయిస్టులపై నిషేధం విధించిందే కాంగ్రెస్ పాలకులు అని, ఫుడు సామాజిక కోణం, చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? అని సవాల్ విసిరారు.కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ఆదివారం రోజు ఉదయం హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆపరేషన్ కగార్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరమన్నారు. నక్సల్స్ సమస్యను సామాజిక కోణంతో చూస్తున్నామని చెప్పడమేంటని, మరిక్కడ నిషేదం తొలగించే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. నిషేధిత సంస్థతో ప్రభుత్వం ఎట్లా చర్చలు జరుపుతుందన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి పోటీ పడి నక్సల్స్ గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. బాంబులు అమర్చి పోలీసులను తునాతునకలు చేసి నక్సల్స్ చంపుతుంటే రేవంత్ రెడ్డి, కేసీఆర్ సమర్థిస్తారా? గిరిజనులను, అమాయక ప్రజలను ఇన్ ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సమర్దిస్తారా? సమాధానం చెప్పాలన్నారు. మావోయిస్టుల వైఖరి మారాల్సిందేనని, వాళ్లతో చర్చలు జరిపే సందర్భమే రాదన్నారు. పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చిందన్నారు. మతం కోణంతో, రాజకీయ లబ్ది కోణంతో చూస్తే హైదరాబాద్ టెర్రరిస్టులకు అడ్డాగా మారే ప్రమాదముందనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి వారం రోజులైనా చర్యల్లేవన్నారు. కేంద్ర కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

తప్పనిసరిగా స్పందించేలా చేస్తున్నాయి. ఇటీవల లీకైన ట్లు చెబుతున్న పత్రాల్లో భారత్ కొన్ని చోట్ల కచ్చితంగా దాడులు చేయబోతున్నట్లు తెలిసింది. ఆ దేశంతో యుద్ధం విషయానికి వస్తే.. మేం అంకెల బలం మాయలో పడం. ప్రజల మద్దతుతో మా సంప్రదాయ, అణు బలంతో పూర్తిస్థాయిలో స్పందిస్తాం" అని జమాలీ పేర్కొన్నారు.పాక్ ప్రేరిత ఉగ్రవాదులు పహల్గాంలోని బైసరన్ లోయలో దాడి చేసి 26 మంది అమాయకుల ప్రాణాలు తీయడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ టెర్రరిస్టులు పాక్ జాతీయులని తేలింది. వారిలో ఒకరు ఆ దేశ మాజీ పారా కమాండోగా గుర్తించారు. ఇక ఈ ఉగ్రదాడిపై న్యూదిల్లీ తీవ్ర స్థాయిలో ప్రతిస్పందిస్తుందని పాకిస్థాన్ భయపడుతోంది. ఇప్పటికే సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసి ఇస్లామాబాద్‌కు భారత్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. ఉగ్రవాదులు, ఆ మూకలకు మద్దతు ఇచ్చే వారిపై చర్యలు తీసుకొనే విషయంలో భద్రతా దళాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. ఎక్కడ, ఎప్పుడు ఎలా దెబ్బకొట్టాలో వారే నిర్ణయిస్తారన్నారు.ఈ నేపథ్యంలో సైనిక చర్య కూడా ఉంటుందన్న ఆందోళనతో యుద్ధం వస్తే తాము అణ్వాయుధాలు వాడతామంటూ పాక్ ప్రకటనలు గుప్పిస్తోంది. గత వారం ఆ దేశ రైల్వేశాఖ మంత్రి హనీఫ్ అబ్బాసీ మాట్లాడుతూ తమ వద్ద ఉన్న ఘజన్వీ, ఘోరీ, షహీన్ క్షిపణులు, 130 అణ్వాయుధాలు భారత్ కోసమే ఉంచినట్లు ప్రకటించారు.

**భారత నౌకలపై పాక్ నిషేధం**

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకుగాను పాకిస్థాన్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ భారత్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో పాక్ ప్రతీకార చర్యలకు దిగింది. భారత జెండా ఉన్న నౌకలు తమ ఓడరేవులను ఉపయోగించుకోవడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే పలు వస్తువులపైనా బ్యాన్ విధిస్తున్నట్లు వెల్లడించింది. పాక్ నౌకలు కూడా భారత్ లోని రేవులకు వెళ్లడానికి వీల్లేదని ఉన్నతాధికారులు ఆంక్షలు విధించారు. న్యూదిల్లీతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ సముద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.పాక్ నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు భారత వాణిజ్య మంత్రిత్వశాఖ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది.వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. మరో వైపు ఆ దేశం నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్శిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది.2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి చాలావరకు తగ్గిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి సరిహద్దుల్లో కవ్వింపు చర్యల నేపథ్యంలో ఇప్పుడు ఇతర దేశాల మీదుగా పాక్‌నుంచి వచ్చే దిగుమతుల్ని సైతం నిలిపివేసింది. దీంతో భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్న పాక్‌లోని కొన్ని పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడంతో ఆ దేశం ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వద్ద దాయాది సైన్యం వరుసగా పదోరోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడింది. కుప్వారా, బరాముల్లా, పూంఛ్, రాజౌరి సెక్టార్‌లలో పాక్ రేంజర్లు కాల్పులు జరపగా.. భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది.

# ఆగని 'అణు' బెదిరింపులు

**మద్దతుగా కరాచీ తీరానికి తుర్కియే అత్యాధునిక యుద్ధనౌక**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. భారత్‌లోని పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టడమే కాకుండా.. సింధు నదీ జలాల ఒప్పందం రద్దు, పాక్ విమానాలకు భారత్ గగనతలం మూసివేయడం, దిగుమతులను స్తంభింపజేయడం లాంటి చర్యలతో పాక్‌ను అన్నివైపుల నుంచి భారత్ బందిస్తోంది. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి పరిణామాలను చవిచూడాల్సి వస్తుందోనని, పాకిస్థాన్ భయాందోళనలకు గురవుతోంది. మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తోంది. ఈ క్రమంలోనే తన మిత్రదేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత్‌కు సమచారం ఉంది. దానికి మరింత బలం చేకూర్చేలా.. తాజాగా తుర్కియేకు చెందిన ' టీజీసీ బుయుకడా' అనే భారీ యుద్ధ నౌక కరాచీ తీరాన్ని చేరింది. 2013లో జలప్రవేశం చేసిన ఈ నౌక జలాంతర్గాములకు వ్యతిరేకంగా పని చేయగలదు. గస్తీ కాయడంలో దీనిది అందవేసిన చేయి. పలు నౌకాదళ విన్యాసాల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. పాకిస్థాన్‌కు చెందిన నౌకలకు జలమార్గాలను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాల ఉన్నతాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తుండంతో భారత్ ఏ క్షణమైనా ఎదురుదాడి చేయవచ్చని పాకిస్థాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సముద్రమార్గంలోనూ దాడి చేసే అవకాశం ఉన్నందున తుర్కియేను సంప్రదించి.. గస్తీ నౌకను తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించేందుకు ఆర్మీ ఉన్నతాధికారులు, ప్రతిపక్ష పార్టీలతో కలసి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. చేపట్టబోయే కార్యాచరణ గురించి పాక్ ఆర్మీ అధికారులు.. వివిధ పార్టీల నేతలకు వివరించాలని భావించారు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాబోమని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఈ–ఇన్సాఫ్ (పీటీఐ) వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. చాలా కాలంగా ఉగ్రవాదాన్ని పీటీఐ ఖండిస్తోందని, పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ కూడా ఈ విషయంలో తన వైఖరిని పలుమార్లు బహిరంగ సమావేశాల్లోనూ నొక్కి చెప్పారని ప్రకటనలో పేర్కొంది.

**భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు**

**- పాక్ రక్షణ మంత్రి కొత్త పాట**


36 గంటల్లో మా పై భారత్ దాడి చేయడం ఖాయం అంటూ గగ్గోలు పెట్టిన పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ ఇప్పుడు కొత్త పల్లవి అందుకొన్నారు.ఆయన 36 గంటలు అని చెప్పి నాలుగు రోజులు దాటినా.. భారత్ నుంచి ఎటువంటి ప్రతిదాడి లేకపోవడంతో కొత్త కోణం తెరపైకి తెచ్చారు. భారత్ వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనావేశారు. ఆయన పాక్‌కు చెందిన ఏఆర్‌వై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఇదే మంత్రి మరో ఛానెల్‌లో మాట్లాడుతూ.. సింధు నదిపై భారత్ నిర్మించే కట్టడాన్ని అయినా దాడి చేసి కూల్చేస్తామని పేర్కొన్నారు. అసలు భారత్ దీనిపై నిర్మాణాలకు యత్నించడమే దౌర్జన్యంగా భావిస్తామన్నారు. జియో న్యూస్‌లో మాట్లాడుతూ.. 'దౌర్జన్యం అంటే కేవలం తూటాలు కాల్చడమే కాదు.. అది చాలా రూపాల్లో ఉంటుంది. నీటి ఆపటం, మళ్లించడం వంటి కూడా అదే. ఇదే జరిగితే పాక్‌లో ఆకలి చావులను చూస్తాము. వారు ఏదైనా నిర్మాణానికి యత్నిస్తే.. పాక్ దానిని కూల్చేస్తుంది' అంటూ బెదిరింపులకు దిగారు. కాలం గడిచేకొద్దీ భారత్‌తో ఘర్షణలు పెరుగుతాయేకానీ, తగ్గవని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు చాలా దేశాలు యత్నిస్తున్నాయన్నారు. గత నెల చివర్లో ఆసీఫ్ ఓ ప్రకటన చేశారు. భారత్ 24–36 గంటల్లో తమపై సైనిక చర్య చేపడుతుందని సంచలన ప్రకటన చేశారు. భారత్‌లో సీసీఎస్ సమావేశం ముగిసి.. ఉగ్రవాదులపై చర్యకు మిలటరీకి అధికారాలు ఇచ్చిన వేళ.. ఈ ప్రకటన వెలువడటం సంచలనం సృష్టించింది. కానీ, అటువంటిది ఏమీ చోటు చేసుకోలేదు.

# పాక్‌కు మరో దెబ్బ

అక్కడి అధికారి ఒకరు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు వెల్లడించారు. దీంతో అవసరమైతే భారత్ కఠిన చర్యలు తీసుకోగలదని పాక్‌కు తెలియజేసినట్లైందన్నారు.900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం ఈ డ్యామ్‌ను చినాబ్ నదిపై 2008లో నిర్మించారు. ఈ డ్యామ్ పొడవు దాదాపు 145 మీటర్లు. సింధు జలాల ఒప్పందం కింద పాక్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించిన నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పంజాబ్ ప్రావిన్స్‌లో ఎక్కువగా పంటపొలాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి.ఉగ్రదాడి జరిగిన తర్వాత ఏప్రిల్ 26న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. ఆ తర్వాత 29 నాటికే ఈ డ్యామ్ నుంచి పాకిస్థాన్‌కు వెళుతున్న జలాలు నిలిచిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పాక్‌లోని సియాల్ కోట్ వద్దకు వచ్చేసరికి చినాబ్ పూర్తిగా ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి సాగుకు ఈ నీరు చాలా ముఖ్యం.ఇక గత వారం జీలం నది వరద ప్రవాహం పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ సమీపంలో గత వారం జీలం నదిలో నీటి మట్టం ఒక్కసారిగా కొన్ని అడుగులు పెరిగిపోయింది. దీంతో స్థానిక అధికారులు హట్టియాన్ బాలా అనే ప్రాంతంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది. ముజఫరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ప్రజలను నదీ తీరంలోకి వెళ్లొద్దని మసీదుల నుంచి హెచ్చరించారు. ఈ నది అనంతనాగ్ జిల్లా మీదుగా ప్రవహించి చకోథి ప్రాంతంలో పీవోకేలోకి చేరుతుంది.

## భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన సమాధానం చెబుతాం

ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నా నన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్– పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు,



పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న వేళ రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దిల్లీలో జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన వీర సైనికులు ఎల్లప్పుడూ దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే.. రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు. ఒక వైపు మన సైనికులు యుద్ధ భూమిపై పోరాడుతుంటే.. సాధువులు జీవన భూమిపై పోరాడుతున్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడటం నా బాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నా విధి. మీకు మన ప్రధాని గురించి బాగా తెలుసు. ఆయన వర్కింగ్ స్టైలేంటో, పట్టుదల ఏంటో తెలుసు. ఆయన సారథ్యంలో మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నా. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాదు.. దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉంది" అని కేంద్రం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

# ఏప్రిల్‌లో ఎన్ఎండిసి ఉత్పత్తిలో వృద్ధి




హైదరాబాద్, మే4 (జనంసాక్షి) : భారతదేశంలో అతిపెద్ద ఇనుప ధాతువు ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండిసి, ఏప్రిల్ 2025 నెలలో అద్భుతమైన శారీరక పనితీరును అందించింది. కంపెనీ 4.00 ఎంటి ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. 3.63 ఎంటిని విక్రయించింది. ఇది ప్రారంభమైనప్పటి నుండి దాని అత్యధిక ఏప్రిల్ నెల వాల్యూమ్‌లను సూచిస్తుంది. సిపిఎల్ వై కంటే ఉత్పత్తిలో 15%, అమ్మకాల గణాంకాలలో 2.8% వృద్ధితో, జాతీయ మైనర్ ఎఫ్ వై26కి కొత్త గరిష్టాలను, బలమైన ప్రారంభాన్ని నెలకొల్పింది. ఎఫ్ వై26కి అసాధారణమైన ఈ ప్రారంభంలో ఎన్ఎండిసి సీఎండి అమితవ ముఖర్జీ ఇలా అన్నారు, "మా స్థిరమైన పనితీరు శ్రేష్ఠత మరియు వృద్ధికి ఎన్ఎండిసి నిబద్ధత గురించి మాట్లాడుతుంది. మా రికార్డ్-బ్రేకింగ్ ఏప్రిల్ పనితీరు, మా ప్రధాన ఇనుప ఖనిజం గనుల నుండి అత్యుత్తమ డెస్పాచ్ గణాంకాలతో పాటు, కిరండూల్, బచేలి 2% వృద్ధితో, 8% వృద్ధి వరుసగా సిపిఎల్ వై ద్వారా మా నాయకత్వ స్థానాన్ని పటిష్టం చేస్తుంది. 2030 నాటికి 100ఎంటి మైనింగ్ కంపెనీగా మారాలనే మా ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించడానికి బలమైన పునాదిని ఏర్పరుస్తుంది." ఏప్రిల్ 2025లో, ఎన్ఎండిసి దాని అత్యధిక నెలవారీ డెస్పాచ్‌ను సాధించింది, ఇది సిపిఎల్ వై కంటే 23% పెరుగుదలను సూచిస్తుంది. బాచెలి కాంప్లెక్స్ కూడా అత్యుత్తమంగా ఏప్రిల్‌లో 2.22 లక్షల టన్నుల (ఎల్‌టి) రహదారి పంపిణీని నమోదు చేసింది, ఇది 25% పెరుగుదలను నమోదు చేసింది. అంతేకాకుండా, కంపెనీ పెల్లెట్ ఉత్పత్తి 2018లో గతంలో నెలకొల్పిన ఏప్రిల్ రికార్డును అధిగమించి ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 0.23 లక్షల టన్నులకు ఎగబాకింది. ఎన్ఎండిసి విశేషమైన పనితీరు దాని కార్యాచరణ చురుకుదనం, వ్యూహాత్మక దృష్టిని ప్రదర్శిస్తుంది. ముడి పదార్థాలను భద్రపరచడానికి, భారతదేశం పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీ అంకితభావంతో ఉంది.

## కేంద్రం నిధులివ్వడం లేదని ఆరోపించడం అలవాటుగా మారింది

- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్రంలో మోడీ సర్కార్ తెలంగాణకు నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపుతోందని ఆరోపించడం గత సీఎం కేసీఆర్‌కు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయిన ఇప్పటివరకు ఇచ్చిన హామీల ఒకటి అమలు చేయలేదని, తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కోసం వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా లక్షల కోట్ల రూపాయలు తెలంగాణకు మంజూరు చేసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సహకారానికి నిరాకరణ చూపించడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్రం ప్రకటించిన విశ్వవిద్యాలయాలకు భూములు కేటాయించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేసింది. విమానాశ్రయాలు, నవోదయ పాఠశాలల విషయంలో కూడా నిధులు మంజూరు చేసినా, వాటి కోసం భూములు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా జాప్యం చేసిందని తెలిపారు. ఇటీవల ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ కోసం గతంలో మాజీ సీఎం కేసీఆర్‌ను భూమి కేటాయించాలని తాను పలుమార్లు కోరిన భూములు ఇవ్వలేదన్నారు. అవసరమైన సహకారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ నైతిక బాధ్యతని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాల అమలుకు, వివిధ ప్రాజెక్టులకు సహాయనిరాకరణ చేస్తూ, అభివృద్ధి అడ్డంకిగా మారుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

# దళిత యువకునికి మద్దతుగా ఆందోళనలు

- కీలక నాయకులను అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్
- జనంసాక్షి కథనాలకు పెద్దఎత్తున స్పందన
- దళిత సంఘాల ఆధ్వర్యంలో చేర్యాలలో భారీ ర్యాలీ




చేర్యాల (జనంసాక్షి) మే 04 : దళిత జాతికి చెందిన మతిస్థిమితం లేని మతి స్థిమితం లేని యువకులపై ఇటీవల ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ కి చెందిన కొందరు వ్యక్తులు నగ్నంగా ఊరేగించి దాడికి పాల్పడిన సంఘటన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈ విషయాన్ని జనంసాక్షి దినపత్రికలో వరుసగా ప్రత్యేక కథనాలను ప్రచురించింది. దళిత సంఘాల అగ్ర నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, వివిధ పార్టీల నాయకులు ఆ యువకునికి మద్దతుగా నిలిచి భరోసా కల్పించారు. వెంటనే పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేసి రేమండ్ కు పంపించారు. జనంసాక్షి కథనంలో అధికార యంత్రాంగం కదిలి చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే..

### విధ్వంసానికి పాల్పడిన అందరినీ అరెస్టు చేయాలి : దళిత సంఘాలు

మానవత్వం మరచి దళిత యువకునిపై ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ కి చెందిన సుమారు 20 మందికి పైగా దళిత యువకున్ని నగ్నంగా బట్టలు విప్పి కొట్టుకుంటూ ఊరేగింపు చేసి గుడి గోడకు కట్టేసి చిత్రహింసలకు గురి చేసిన మతోన్మాద గుండాలను ఎవరినీ వదిలి పెట్టకుండా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు సామూహిక దాడి సెక్షన్లతో కేసు నమోదు చేసి అందరినీ అరెస్టు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్, టీఎంఎం, డీహెచ్ పీఎస్, టీ ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చేర్యాల పట్టణంలోని గాంధీ సెంటర్ నుంచి అంగడి బజార్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొట్ల శేఖర్, అంబేద్కర్ సంఘం జాతీయ నాయకులు జేరిపోతుల పర్శరాములు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ లు మాట్లాడుతూ.. మతం ముసుగులో బీజేపీ నాయకులు దళితులను చిన్నచూపు చూస్తూ గుడిలోకి రానివ్వకుండా దూషిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యసమాజం తల దించుకునేలా ఈ దుర్మార్గపు చర్యలకు పాల్పడం మతోన్మాదులకు తగదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆ బుడగ జంగాల యువకునికి ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించి భద్రత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బక్కెల్లి బాలకిషన్, తూటి దేవదానం,తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, దర్శనం రమేష్,తాడూరి మల్లేశం, గౌరె శ్రీనివాస్, మల్కని ఎల్లయ్య, ఆరుట్ల దాయనంద్, తాడూరి భరత్, కర్రె బాలరాజు, చింతకింది దానియాల్, తదితరులు పాల్గొన్నారు.



### వికలాంగులకు రక్షణ కరువు



మానసిక వికలాంగుడు అజయ్ తప్పు చేసిన యెడల చట్టాలు ఉన్నాయని, లేదంటే ఆ మానసిక వికలాంగుడిని కుటుంబ సభ్యులకు అప్పగించాలి కానీ ఇలా విచక్షణ రైతంగా దాడి చేసి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఆ యువకుడిని నగ్నంగా ఊరేగిస్తూ జైశ్రీరామ్ భారత్ మాతాకీ జై అనాలని బలవంతంగా హింసించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల పరిస్థితి ఎంత దైనియంగా ఉన్నదో ఈ సంఘటనే నిదర్శనం అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ను అమలుపరచాలని పోలీసులను పలుమార్లు విన్నవించినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇకనైనా వికలాంగులకు రక్షణ కల్పించాలని కోరారు.

-తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దళితునిపై దాడి దారుణం



మతిస్థిమితం కోల్పోయిన అమాయక దళితుడైన అజయ్ ని కులం మతం పేరుతో జైశ్రీరామ్ అనాలని ఆర్ఎస్ఎస్, బజరంగ్దళ్ శక్తులు ఆ యువకుడిపై చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బట్టలు ఊడదీసి ఊరేగించి దాడికి పాల్పడడం సభ్య సమాజం తలదించుకునేలా ఈ ఘటన ఉందన్నారు. అతను తప్పు చేస్తే న్యాయస్థానాలు ఉన్నాయని, చట్టాలను కాదని బిజెపి నాయకులు ఇలా దళితులపై వివక్ష చూపి దాడులు చేయడం తగదన్నారు. సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

- ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు బాలరాజ్

# ఓల్డ్‌సిటీలో మెట్రో పనులకు అదనపు నిధులు విడుదల చేస్తాం

- పనులు వేగవంతం చేయాలి
- పాతనగరంలో మెట్రో రైల్ విస్తరణ పనులను ప్రశంసించిన సిఎస్
- అవరోధాలు అధిగమించి ముందుకు వెళ్తున్నాం : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి




హైదరాబాద్ సిటీ, మే 04(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఆదివారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తో కలిసి హైదరాబాద్ పాత నగరంలో మెట్రో కారిడార్ ను సందర్శించారు. మెట్రో రైల్ మార్గంలో త్వరితగతిన జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. గత దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన పాతనగర మెట్రో రైలు మార్గంలో ఇప్పుడు జరుగుతున్న పనుల తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంజీబీఎస్ నుండి చంద్రాయణ్ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల నిడివిగల ఈ మెట్రో కారిడార్ లో ప్రభావిత ఆస్తుల కూల్చివేతలను మెట్రో ఎండీ సిఎస్‌కు వివరించారు.దారుల్ షిఫా నుంచి ప్రారంభించి మండీ రోడ్, శాలిబండ జంక్షన్ మార్గంలో ప్రభావిత కట్టడాల కూల్చివేత పనులను పరిశీలించారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కుముడులుగా ఉన్న క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్, టీవీ కేబుళ్లను అత్యంత జాగ్రత్తతో తొలగిస్తూ పనులు సాగిస్తున్నామని, ఈ మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఇరుకైన రహదారులు ఉండడం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా కూల్చివేత పనులను చేపట్టినట్టు మెట్రో ఎండీ వెల్లడించారు. ఈ మార్గం లో దాదాపు 105 మత, చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలు ఉన్నాయని,వాటికి ఏమాత్రం హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభావిత కట్టడాల కూల్చివేతలు జరుపు తున్నామని ఆయన చెప్పారు. పగటి పూట వెనుకభాగంలో ఉన్న కట్టడాలను తొలగించి, రాత్రి సమయాల్లో రహదారికి ఆనుకుని ఉన్న ప్రభావిత ఆస్తులను యంత్రాల సాయంతో తొలగిస్తున్నామని వివరించారు. ఇందుకు స్థానికులతో ముందుగానే సంప్రదింపులు జరుపుతున్నామని, వారి సహాయ సహకారాలతోనే ముందుకు సాగుతున్నామని ఆయన సిఎస్ కు తెలిపారు. ప్రభావిత ఆస్తులు దగ్గరదగ్గరగా ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సీఎస్ సూచించారు. సురక్షితంగా అక్కడ కూల్చివేతలు, శకలాలు తొలగించే కార్యక్రమం వెంటవెంటనే జరగాలని తెలిపారు. జరుగుతున్న పనుల తీరుతెన్నుల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇంకా వాటిని వేగవంతం చేయడానికి అదనపు నిధులను విడుదల చేస్తామని ప్రధాన కార్యదర్శ రామకృష్ణారావు వెల్లడించారు.

### కొత్త కారిడార్ ల డీపీఆర్ లకు త్వరలో ఆమోద ముద్ర

మెట్రో రైల్ రెండవ దశ (పార్ట్-బి) డీపీఆర్ లు సిద్ధమయ్యాయని, రాబోయే హెచ్ఏఎంఎల్ బోర్డు సమావేశంలో వాటిని పరిశీలించి, ఆమోదిస్తామని సిఎస్ స్పష్టం చేశారు. వీటిని త్వరలోనే రాష్ట్ర మంత్రి వర్గం కూడా ఆమోదించాక కేంద్రానికి పంపుతామని ఆయన వెల్లడించారు. జేబీఎస్ - మేడ్చల్ (24.5 కి.మీ), జేబీఎస్ - శామీర్ పేట్ (22 కి.మీ) కారిడార్ లతో పాటు శంషాబాద్ - ఫ్యూచర్ సిటీ కొత్త కారిడార్(40 కి.మీ) కి కూడా డీపీఆర్ లు సిద్ధం అయ్యాయని ఆయన తెలిపారు. మెట్రో ఎండీ తో ఈ డీపీఆర్ ల గురించి సిఎస్ చర్చించారు. పాతనగరం మెట్రో మార్గం పర్యటనలో మున్సిపల్ శాఖ కార్యదర్శి కె ఇల్లంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ బోర్డ్ ఎండీ అశోక్ రెడ్డి, ఇతర మున్సిపల్, మెట్రో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మోసపోయిన 51 మంది విద్యార్థినులకు అండ



హైదరాబాద్, మే4 (జనంసాక్షి) : మెహదీపట్నంలో గుర్తింపు లేని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ చేరి మోసపోయిన 51 మంది విద్యార్థినులకు సామాజిక కార్యకర్తలు లుబ్నా సర్వత్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఆంగోతు వెంకటేష్ అండగా నిలిచారు. టిపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సహకారంతో ఆ విద్యార్థినులను నకిలీ కళాశాల చెర నుంచి విడిపించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి కళాశాలలో అడ్మిషన్లు ఇప్పించి.. ఆ విద్యార్థినుల భవిష్యత్తును నిలబెట్టారు. ఆ విద్యార్థినిలు గాంధీ భవన్ లో మధుయాష్కీని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ కళాశాల నడుపుతూ విద్యార్థినులను మోసం చేసిన నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఇందుకు చొరవ తీసుకోవాలని లుబ్నా సర్వత్, వెంకటేష్ కు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యార్థినిలతో పేర్కొన్నారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి, హెల్త్ మినిస్టర్ గా దామోదర రాజనర్సింహ ఉన్నారని, ఏ సమస్య ఉన్నా తాము పరిష్కరిస్తామన్నారు. శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

# గద్దరన్న జీవితం ప్రజలకే అంకితం

- గడ్డం ప్రసాద్ శాసనసభ స్పీకర్
- మా నాన్న ప్రజల మనసులో బతికే ఉన్నాడు : వెన్నెల గద్దర్
- సాయి అలేఖ్య ఆధ్వర్యంలో గద్దర్ అవార్డుల ప్రదానం



హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) : గద్దర్ ప్రపంచ చరిత్రలో నిలిచిపోయాడని అతని బ్రతుకంతా ప్రజలతోనే గడిపాడని దళిత బహుజన వాడల్లో వెలుగై నిండాడు అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు, సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో జరిగిన గద్దర్ ఐకాన్ అవార్డ్స్ 2024 ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు, కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ చేసిన సేవలను గుర్తించి ఆయన పేరు మీద గద్దర్ అవార్డులు ఇస్తుందని ఆయన గుర్తు చేశారు, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం మా నాన్నను గుర్తించి గద్దర్ అవార్డుల పేరున గొప్ప కార్యక్రమం చేపట్టడం హర్షనియమన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు పెద్దపీట వేస్తుందని అన్నారు, టూరిజం శాఖ చైర్మన్ పటోళ్ల రమేష్ రెడ్డి మాట్లాడుతూ గద్దర్ చేసిన సేవలు మరువలేవని ఆయన పేరుమీద అవార్డు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని అన్నారు, సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థను అభినందించారు , ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన ఇంతమంది కళాకారులను గుర్తించడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు, టూరిజం శాఖ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సాయి అలేఖ్య సాంస్కృతిక సంస్థ కళాకారుల పట్ల ఎంతో శ్రద్ధ వహించి వారిలో నిగూఢమైనటువంటి కళను వెలికి తీసే ప్రయత్నం చేస్తుందని వారి సేవలు అభినందనీయమన్నారు. సభకు వేణుగోపాల చారి అధ్యక్షత వహించారు, సీఎం యాదగిరి, చైతన్య పాటశాలల చైర్మన్ శివరాత్రి యాదగిరి, వీర భోగ వసంత రాయులు అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన అరుణ అశోక్ దంపతులను ముఖ్య అతిథులు శాలువా కప్పి సత్కరించారు, ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు దరువు అంజన్న వరంగల్ శ్రీనివాస్ గోదారి శ్రీనివాస్, అభినయ శ్రీనివాస్, గజ్వేల్ వేణు, ఆకునూరు దేవయ్య, బాబ్జి, రేలారే గంగా, బుర్ర సతీష్, మల్లిక్ తేజ,మురళి మధు, బైరాగి మోహన్, షేక్ బాబా, నల్లమల్ల మురళి వెంకటాచారి, గద్దర్ సాంబన్న, బీసీ రామలింగం, డప్పు స్వామి,డోలక్ విజయ్, తదితరులను శాలువా కప్పి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలను అందించి సగౌరవంగా సత్కరించారు, ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు పాడిన పాటలు ఉర్రూతలూగించాయి.




# గ్రేటర్‌లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి


- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు
- ఎస్ ఆర్ డి పి, మెట్రో, వాటర్ వర్క్స్ హెరిటేజ్ పనుల పరిశీలన చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు

హైదరాబాద్, మే 04 (జనంసాక్షి) : నగరంలో ఎస్ఆర్‌డిపి ఇతర శాఖల ద్వారా చేపట్టిన పనులను ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా చీఫ్ సెక్రెటరీ బంజారాహిల్స్ లో జివికె మాల్ వద్ద సుమారు రూ. 5 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. తదనంతర దారుషిఫా వద్ద మెట్రో లైన్ అలైన్మెంట్ (ఓల్డ్ సిటీ కారిడార్) పరిశీలించారు. ఓల్డ్ కారిడార్ ఎంజిబిఎస్ బస్ స్టేషన్ నుండి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టే మెట్రో లైన్ పనుల గుర్తించి మెట్రోలైన్ ఎండి ఎన్విఎస్ రెడ్డి చీఫ్ సెక్రెటరీ కి వివరించారు. భూసేకరణ పక్రియ వేగవంతంగా చేయాల్సి ఉందని వివరించారు. ఇప్పటి కి భూసేకరణ పై ప్రజలు సహకరిస్తున్నట్లు. ఏండీ తెలియజేశారు. హుస్సేన్ ఆలమ్ లో ఉన్న ఖుర్షీద్ ఝా దేవిడి హెరిటేజ్ భవనం హెచ్ఎండిఏ నిధులతో కన్సర్వేషన్ రెస్టోరేషన్, మరమ్మత్తులు పనులను సిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎస్ నిర్వాహకులతో మాట్లాడుతూ... పార్కింగ్ అనువైన స్థలం ఉంది కాబట్టి హెరిటేజ్ భవనం మెయింటేనెన్స్ కోసం ఎగ్జిబిషన్ ఇతరత్ర వినూత్న ఈవెంట్స్ నిర్వహించి వచ్చిన నిధులతో హెరిటేజ్ భవనం నిర్వహణకు ఖర్చు చేసుకొనే వెసులుబాటు ఉంటుందని సూచన ఇచ్చారు. అక్కడ నుండీ ఫలక్నమా ఆర్.ఓ.బి పనులను పరిశీలించారు. జిహెచ్ఎంసి సంబంధించిన పనులు తుది దశలో ఉన్నాయని, రైల్వే పోర్షన్ పూర్తి చేసి సర్వీస్ రోడ్డుకు 5 ఆస్తులను సేకరణ పూర్తి చేసి నెలరోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్టు ఏంఏయుడి సెక్రెటరీ ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ సిఎస్ కు వివరించారు. ఆగస్టు వరకు పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. తప్పని సరిగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావడం జరుగుతుందని, రైల్వే పోర్షన్ పనులు మొదలుపెట్టిన నేపథ్యంలో ఆగస్టు చివరి వరకు పూర్తి చేయించడం జరుగుతుందని సిఎస్ కు వారు వివరించారు. అక్కడి నుండి ఫలక్ నూమా ఫ్లై ఓవర్ నుండి నల్గొండ ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తూ మూసి నదిపై ముసారంభాగ్ వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన ప్రజలకు జరిగే ప్రయోజనాల గురించి వివరించారు. భూసేకరణ పప్రక్రియ గురించి సిఎస్ అడుగగా ఇంకా కొన్ని ఆస్తుల్ని చేయాల్సి ఉందని అధికారులు సిఎస్ కు వివరించారు. అక్కడ నుండి వాటర్ వర్క్స్ ద్వారా చేపట్టిన ఎస్.టి.పి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎండి ని ఆదేశించారు. ఈ సందర్భంగా సి ఎస్ కే రామకృష్ణ రావు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి గారు స్పెషల్ ఫోకస్ పెట్టారని అన్నారు. సీఎం ఆదేశాల తో హైదరాబాద్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. ఓల్డ్ సిటీ మెట్రో కు నిధుల కొరత లేదని ఓల్డ్ సిటీ మెట్రో కు ఆస్తుల సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు సిఎస్ తెలిపారు. జిహెచ్ఎంసి ఎస్ ఆర్ డి పి ద్వారా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ముసారం బాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించనున్నారు. అట్టి పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. హైదరాబాద్ లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా తీసుకుందన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సిఎస్ పేర్కొన్నారు. టూరిజం శాఖతో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని మిస్ వరల్డ్ పోటీలు విజయవంతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణ రావు వెంట, ఎంఏయుడి సెక్రెటరీ కె.ఇలంబర్తి, హెచ్ఎండిఏ కమిషనర్ సర్పరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, మెట్రో రైల్వే ఎండి ఎన్.వి.ఎస్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎం.డి అశోక్ రెడ్డి, జిహెచ్ఎంసీ ప్రాజెక్టు మెయింటేనెన్స్ సిఈ లు భాస్కర్ రెడ్డి, రత్నాకర్, కులీ కుత్బుషా అభివృద్ధి అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




### కుల గణన వల్ల కులాలు కలసిపోయి

# కులాల సంఖ్య తగ్గుతుంది




కుల గణన వల్ల సమాజం చీలిపోతుంది అనే వాదన సరైనది కాదు. అందుకు భిన్నంగా కుల గణన వల్ల కులాలు బాగా తగ్గిపోతాయి. అనేక కులాలు కలిసి ఒకే కులంగా మారుతాయి .సాధారణంగా ఒక గ్రామంలో 25 నుండి 40 కులాలే వుంటాయి. వ్యవసాయ సమాజానికి ఆయా కులాలు కుల వృత్తులు అవసరమౌ తాయి. ఆరువేల కులాలు అనేవి అనేక ప్రాంతాల్లో విడిపోయి భాషల వారీగా, తెగల వారీగా కులాల వారీగా , రక్తసంబంధాల వారీగా ఉండడం వల్ల కొనసాగుతున్న విభజనలు. గతంలో 25-30 కి.మీ. భాషలో మార్పులుండేవి. పెళ్లి సంబంధా లు కూడా అదే పరిధిలో సాగాయి. రైల్వేలు రోడ్లు బస్సులు, టెలిఫోన్ సెల్ ఫోన్ , రవాణా సౌకర్యాలు పెరిగాయి. దూరతీరాలకు పారిశ్రామిక కార్మికులు వలసలు పెరిగాయి. వేల కొత్త వృత్తులు ఏర్పడ్డాయి సినిమాలు టీవీలు, ప్రభుత్వ పరిపాలన ప్రజలను సాంస్కృతికంగా, రాజకీయంగా, ట్రేడ్ యూనియన్ కార్మిక కర్షకుల పరంగా, విద్యా రంగంలో విద్యార్థుల పరంగా ఒకటిగా చేస్తున్నాయి. అలా నూతన వర్గాలు రూపొందాయి. అదే విధంగా ఒకే రకమైన వృత్తి వున్న వారిలో భావ సారూప్యత ఏర్పడి వివిధ ప్రాంతాల, వివిధ భాషల కులాలు ఒక్కటవుతాయి. రక్త సంబంధాలు, రాజకీయాలు, కులవృత్తుల నైపుణ్యాలు ఆధునీకరణ కలిసి పంచుకుంటారు. కలిసి తెలుసు కుంటారు. తమ వాటా బడ్జెట్ డిమాండు చేస్తారు. అందుకు ఒకటవుతారు. అలా ఆరువేల కులాలు క్రమంగా ఆరు వందల కులాలుగా కలిసి పోతాయి. గతంలో ఎన్నో భాషలు మాట్లాడేవారు. తమ భాషలు వదిలేసి సమీప బలమైన ప్రాంతీయ భాషలను స్వీకరించారు. వందల భాషలు అదృశ్యమై 22 భాషలు ప్రముఖంగా నిలదొక్కు కున్నట్టే వందల కులాలు కలిసి కొన్ని కులాలుగా రూపొందుతాయి. ఆంత్రోపాలజీ, డి ఎన్ ఏలు వీటిని నిర్ధారిస్తున్నాయి. . కాకతీయుల శాసనాల్లో పదహారు కులాలే కనపడుతాయి. చెరువు నిర్మించి చెరువు కింద వ్యవసాయం చేయడానికి చెరువు ఆధారంగా కొత్త వూరు రూపొందడానికి పదహారు కులాలకు భూమిలిచ్చి స్థిర పరిచారు. పూజారి బ్రాహ్మణులు అయిదారు పల్లెలకు ఒకరుంటే చాలన్నారు. కాలక్రమంలో శైవం , వైష్ణవం, వీర శైవం, వీర వైష్ణవం, విశిష్టాద్వైతం వంటి భక్తి మత ఉద్యమాలు ఒకే కులాన్ని అనేక కులాలుగా చీల్చాయి. రక్త సంబంధాలు దూరమయ్యారు. గణ, తెగలు కులాలుగా రూపొందడంతో తమ ఉనికి కోసం కొత్త కులంగా రూపొందారు. ఇలా కులాల సంఖ్య పెరుగుతూ పోయింది. కాని గ్రామీణ వ్యవసాయ సమాజంలో అన్నీ కలిసి 35- 40 మించి కుల వృత్తులు అవసరం పడలేదు. ఈ కులాల విభజనలో కులాల సంఖ్య పెరగడంలో బ్రాహ్మణిజం, మను ధర్మం పాత్ర ఏమీ లేదు. వాటి పాత్ర వుందని చెప్పడం వాటికి లేని ఆధిక్యతను ఆపాదించడమే. . సమాజంలో ఇస్లాం, సూఫీ, సిక్కు , క్రైస్తవ మతాల విస్తరణ, భక్తి ఉద్యమాల వల్ల ఒకే కులం అనేక కులాలుగా చీలిపోయింది. ఇది సామాజిక రాజకీయ పరిణామమే తప్ప మనుధర్మ బ్రాహ్మణీయ పరిణామం కాదు. కాపులు అయిదారు కులాలు కలిసి ఒక్కటయ్యారు. పద్మశాలి నేత కులాలు 20 కులాలు ఒక్కటిగా సంఘటితమౌతున్నారు. కల్లు గీత గౌడ కులాలు కలిసిపోతున్నాయి. విశ్వ కర్మ ఐదు కులాలు కలిసి పోయాయి. ఎస్సీలంతా కలిసి ఐదు పది కపలాలుగా కలిసి పోతారు. బీసీలంతా కలిసి దేశ వ్యాప్తంగా వంద కులాలుగా కలిసి పోతారు. అవన్ని చూడ్డానికి మనం అప్పటికి బతికి వుండక పోవచ్చు. యువతరం తమ జీవిత కాలంలోనే ఇవన్ని చూస్తారు. అంబేద్కర్ కుల నిర్మూలన జరగాలని అన్నారు. కుల నిర్మూలన ఎలా జరుగుతుంది? కుల నిర్మూలన అంటే ఏమిటి? అన్ని కులాలు కలిసి పోవడమే కుల నిర్మూలన. కుల గణన వల్ల వృత్తిలో నైపుణ్యం కోసం, రాజకీయ సాధికారిత కోసం , రక్త సంబంధాలు పెళ్లిల్లు కోసం క్రమంగా కలిసి పోతారు. కుల గణన లేక పోవడం వల్ల నిరుపేద గ్రామీణ ఉత్పత్తి కులాలు సేవా కులాలు వ్యాపార కులాలు ఇతర ప్రాంతాల్లోని, ఇతర భాషల్లోని ఏఏ కులాలు తమ సమీప కులాలో, తమ నుండి చీలి పోయిప్రత్యేక కులాలుగా ఏర్పడాయో ఇంత దాకా తెలియక కలువ లేదు. కుల గణనతో తెలుస్తుంది. కలుస్తారు. వైశ్యులు జైనులు , అగర్వాల్ లు వియ్యమందుకుంటున్నారు. పద్దెనిమిది రకాల రెడ్డి కులాలు ఒక కులంగా కలిసి పోతున్నారు. ఆరెసెస్ వంటి హిందూ సంస్థలు కులాంతర వివాహాల ఎజెండా తీసుకొని తమ వేదికలపై ప్రోత్సహిస్తే రెండు తరాల్లోనే. హిందువుల మధ్య కుల భేదాలు తొలగి హిందూత్వ బలం పెరుగుతుంది. మూడు వందల కులాలుగా చీలి పోయిన బ్రాహ్మణులు ఒక కులంగా కలిసి పోతున్నారు. పాత వృత్తులు పోయి కొత్త వృత్తులు పెరుగుతున్న క్రమంలో కులాల సమీకరణలు పెరిగి చాలా కులాలు కలిసి పోతాయి. పాత ఉనికిని కోల్పోతాయి. ఇలా కుల గణన వల్ల ఆయా కులాల వృత్తి నైపుణ్యాలను పరస్పరం పంచుకుంటారు. పెంచుకుంటారు. ఒకరికొకరు తోడుగా నిలుస్తారు. ఇలా మనం వూహించని ఎన్నో సానుకూల పరిణామాలు జరుగుతాయి. హిందువులతో పాటు భారతీయులందరు కుల గణనతో ఒక కుదుపుకు లోనవుతారు. చేపలు పట్టే కులాలన్నీ ఒకటవుతాయి. సాంస్కృతికంగా ఐక్యత పెరుగుతుంది. పేరు వెంట వుండే కుల చిహ్నాలు నిషేదిస్తే కులాలు ఒక్కటి కావడం మరింత వేగవంత మవుతుంది.



బిఎస్ రాములు
8331966987

# వాళ్లు మనుషులు కాదు

## మనిషి గాని వాడికి ఏం జాతి... ఏం మతం

ఏప్రిల్ 22 రోజున జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాది దాడిలో 26 మంది అమాయకులు తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు, వేసవిలో కాశ్మీర్ అందాలను తిలకించడానికి వచ్చిన ఆమాయక పర్యాటకు లను బలిగొన్న రాక్షసులు వాళ్లు పాకిస్తాన్ కి చెందిన ఉగ్రవాదులుగా ప్రభుత్వం గుర్తించింది, వారికి మన దేశంలో అడుగుపెట్టి ఇంత ఘోర కిరాతకమైన ఘటనను ఎంతో తేలికగా చేసి ఎవరికి అంతుచిక్కకుండా పారిపోవడం ఇంత సులభం అయిపోయిందా?

దీనికి కారణం ఎవరు? ఈ మతోన్మాద ఉగ్రవాద దాడికి బాధ్యులు ఎవరు? మనమంతా భారతీయులం మన దేశం భారతదేశం అని మాటల్లోనే మిగిలి పోయిన సందర్భంలో మన మన శత్రు దేశాలకు మనం చులకన అయిపో యినం ఇదే అలుసుగా వారు ఇలాంటి దుశ్చర్యను ప్రదర్శించారని అనుకో వడంలో తప్పులేదు కానీ ఎటువంటి శక్తులు మన భారతీయులను విడదీయలేరు, ఇప్పుడు ఈ దేశం మొత్తం ఒక్కటే ఈ ఉగ్రవాద చర్య కి నిరసనగా ర్యాలీలు నిర్వహించడం పెట్టడం చేస్తుంది కానీ ఇక్కడ అసలు సమస్య ఏంటి? కాశ్మీర్ లాంటి ప్రదేశంలో మన సైన్యం ఇలాంటి ఘటన జరగడం మన ఇంటెలిజెన్స్ ఇంకా మన బోర్డర్లో ని లోపం గా చూడొచ్చు, అట్లాంటి రద్దీ ప్రదేశాల్లో కనీస సెక్యూరిటీ లేకపోవడం చాలా బాధాకరం దేశంలో టూరిజాన్ని పెంచడానికి మన దేశాన్ని అందం చూడడానికి చాలా ప్రాంతాల నుండి వివిధ పర్యాటకులు వివిధ ప్రదేశాలకు వెళుతూ ఉంటారు ఈ ఘటన తర్వాత పిల్లలతో కలిసి లేదా తల్లిదండ్రులతో కలిసి సేద తీరడానికి ఏదైనా పర్యాటక ప్రదేశానికి వెళ్లడానికి ఒక భయం ఎందుకు? మన దేశంలో మనం స్వేచ్ఛగా తిరగలేమా, మనదేశంలో మనకి సెక్యూరిటీ లేదా? ఒక ప్రదేశంలో కాల్పులు జరుగుతున్నాయి అని తెలవడానికి కూడా అక్కడి సెక్యూరిటీ కి లేదా అక్కడి లోకల్ పోలీసులకు అక్కడి ప్రభుత్వానికి ఒక అర్థగంట సమయం పట్టింది అప్పటివరకు ఆ రాక్షసుడు తమ కార్యాన్ని ముగించుకొని తప్పించుకొని వెళ్ళిపోయారు, ఇక్కడ ప్రాణాలు కోల్పోయిన ఒక అమాయకుడి భార్య దీనిని ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యంగా చెబుతుంది, వారు మనుషులు కాదు వారికి ఏ మతం ఏ కులం లేదు. మేము తిరగడానికి వచ్చాము మేము వెళ్ళిన ప్రాంతం నుండి త్వరగా తప్పించుకోలేరు ఎందుకంటే దానికి ఒకటే ఉంది మార్గం. అలాంటి ప్రదేశంలో కూడా కనీస సెక్యూరిటీ గాని కనీసం ఒక పోలీస్ నిఘా గాని లేదు, మేము ప్రాణాలతో ఎలా బయటపడ్డాము మాకే తెలుసు ఆ క్షణంలో మేము ఎంత భయాందోళనలకు గురయ్యాము మాకు తెలుసు.. అని తన గోడును వినిపించుకున్నది ఆ వీరవనిత. ఇటువంటి ఘటన కోసం ఎదురుచూస్తున్న ట్టుగా ఉన్న కొన్ని మత పిచ్చి రాజకీయ శక్తులు దీనినే ఛాన్స్ గా వాడుకొని ప్రతి ఒక్క ముస్లిం ని చంపేయాలని వారందరూ ఉగ్రవాదులు అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు మీటింగులు పెట్టి సామాన్య ప్రజలను మైండ్ సెట్ ను నాశనం చేస్తున్నారు ఇది గొడవపడే సమయం కాదు, ఆ ఘటనలో అక్కడి లోకల్ ముస్లిం యువకుడు తుపాకు తుపాకీని ఆపడానికి అడ్డువెళ్లి తన ప్రాణాలు పోగొట్టుకున్నాడు తను భారతీయుడు తనకి ఆ క్షణంలో కులం మతం ఏం కనిపించలేదు మానవత్వం మాత్రమే కనిపించింది. దేశం కోసం తన సాటి భారతీయుల కోసం ప్రాణాలు పోగొట్టుకున్న ఆ యువకుడు మన రాజకీయ నేతలకు మాత్రం కనిపించడం లేదు, ఇప్పుడు కూడా అదే కుల మతాల



రాజకీయాలు.. కాశ్మీరీలు అంటే చాలా మంచి స్వభావం చాలా ఆతిథ్యం ఉన్నవాళ్లు వాళ్ళందరూ పర్యాటకులను చాలా ఆప్యాయంగా పలకరిస్తారు కొందరి జీవితం మొత్తం పర్యాటకుల మీదనే ఆధారపడి ఉంటుంది అలాంటి వారి పరిస్థితి ఏంటి ఇప్పుడు మళ్ళీ ఎవరైనా కశ్మీర్ చూడడానికి వెళ్తారా? అక్కడి లోకల్ ప్రజలు ఉగ్రవాదులకు సహాయపడ్డారని వారందరూ ఒకటే అని వారిని వేరు చేసి మాట్లాడే వారు కూడా మనదేశంలోనే ఉన్నారు అనడం సిగ్గుచేటు ఎందుకంటే వాళ్లు కూడా భారతీయులే వాళ్ళు కూడా మన దేశానికి చెందిన వాళ్లే వాళ్ళు ఇతర దేశానికి ఎందుకు సహాయపడ తారు ఉగ్రవాద చర్యలకు ఎందుకు సహాయపడతారు మనల్ని మనం నమ్మని పక్షంలో మన శత్రుదేశాలకు ఇదే ఛాన్స్‌గా మన మీద దాడులకు దిగి మరింత కులమత రాజకీయాలను రెచ్చగొట్టుతూ మనల్ని మనలో మనం గొడవపడి కొట్టుకునేలా చేస్తున్నాయి. మన ప్రభుత్వం ఇటువంటి సమయం లో అందరం ఒకటే అనే నినాదాన్ని ప్రచారం చేయలే తప్ప రెచ్చగొట్టే వ్యాఖ్యలను మీటింగ్లను ఆపేయాలి అప్పుడే మనం మన శత్రువులతో పోరాడగలం గెలవగలం, బ్రిటిష్ వాళ్ళు చేసిన డివైడెడ్ రూల్ ని మళ్లీ అమల్లోకి మనమే తెచ్చుకుంటున్నాం మనదేశాన్ని మనమే విడదీసుకుం టున్నాం....

జాగో భారత్
జాగో



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# ప్రగతిశీల భావజాలం ప్రవహించే కాలం




సమకాలీన సమాజంలో సృజనాత్మక చైతన్యంతో కదిలించే కవిత్వం రాస్తున్న కవులలో జనగామకు చెందిన పానుగంటి రామమూర్తి గారు ముఖ్యులు.

కవిత్వం జీవితానికి దర్పణం, జీవితం కవిత్వానికి ఇతివృత్తం అన్న ఆచార్య పేర్వారం జగన్నాథం గారి స్ఫూర్తితో తెలుగు ఉపాధ్యాయు లుగా రాణిస్తూనే ప్రవృత్తిగా సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగిస్తు న్నారు. మహాకవులు పాల్కురికి సోమన, బమ్మెర పోతన వంటి ప్రాచీన కవులతో పాటు సర్వాయి పాపన్న సామాజిక చైతన్యం, వరవరరావు, అంపశయ్య నవీన్, లింగంపల్లి రామచంద్ర మొదలైన కవుల చైతన్యంతో నిరంతరం రచన వ్యాసంగాన్ని సాగిస్తున్న చైతన్య శీలి, ప్రతిభాశాలి పానుగంటి రామమూర్తి. అతడు కావ్యకర్తగానే కాకుండా కార్యకర్తగా జనగామ జిల్లా రచయితల సంఘానికి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కవిగా ఇప్పటికే 'మనిషై పుట్టాలని', హనుమత్ ' శతకం రచించిన పానుగంటి, తాజాగా "ప్రవహించే కాలం" పేరుతో కొత్త కవితా కాగడాను వెలిగించారు. 86 పుటలు గల ఈ సంపుటిలో 46 కవితలు ఉన్నాయి. ఇవన్నీ చుట్టూ ఉన్న సమాజాన్ని చూస్తున్నప్పుడు కలిగిన మానసిక స్పందనలకు అక్షర రూపం ఇస్తూ వెలువరించిన కవితలు కావడం విశేషం. అతని కవిత్వంలో గాఢమైన భావుకత, తాత్వికత, చారిత్రక త, కృతజ్ఞత అనేవి కవిత మందిరానికి నాలుగు స్తంభాలలాంటివి అని చెప్పవచ్చు. ఇందులోని ప్రధాన కవిత అయిన ప్రవహించే కాలంనే.. పానుగంటి తన కవిత సంపుటికి శీర్షికగా నిర్ణయించారు.

పానుగంటిలో ప్రాథమికంగా కవికి కావలసిన స్పందన, చేతనలతో పాటు వ్యక్తీకరణ కూడా ఉన్నాయి.

ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం. అని శ్రీశ్రీ అన్నట్లు ఇక్కడి నుండి ఇక్కడికే అనే కవితలో నేను చదువుతున్నది, మానవేతిహాస మహా కావ్యం, రాతియుగంలోనూ అగుపించని, రాగద్వేషాలు, రాక్షసుల కథల్లో రాయని రక్త స్నానాలు, చదువుతున్న కొద్దీ కళ్ళు ఎర్ర సముద్రాలు అవుతున్నాయి అని అంటాడు. కాదేదీ కవితకనర్హం అన్నట్లు పెదవులపై తొణికిసలాడే చిరునవ్వును వర్ణిస్తూ మంచితనం అంతరిస్తున్న నవ నాగరిక లోకంలో, చిరునవ్వు ఒక పెట్టుబడి, నిర్జీవమవుతున్న మానవ బం ధాల నేపథ్యంలో, అదొక మొక్కుబడి అని సూత్రీకరించారు. జీవితం యాంత్రికమై మానవ సంబంధాలు మనీ సంబంధాలుగా మారిన నేపథ్యంలో పానుగంటి కవిత కొరడా కొసల చురుకును తలపిస్తు ంది. ఆత్మీయతకు అనురాగాలకు మారుపేరై అన్నదమ్ముల్లా కలిసి ఉండే జనంలోకి రాజకీయపు జెండాలు వచ్చి, అందరినీ ఎడబాపినై, అంటూ గ్రామాలలో ప్రజలు పార్టీలుగా మారిన వైనాన్ని చిత్రించా డు. కాలం అనంతమైనది. దానికి ఆద్యంతాలు లేవు అందుకే దానిని ఒక సజీవ ప్రవంతిగా భావిస్తూ పానుగంటి ప్రవహించే కాలం అన్నాడు. అందులో ప్రతిరోజు వెలుతురు లోకాన్ని ఆక్రమిస్తుంది, కొన్ని గంటలు కాగానే చీకటి అధికారం హస్తగతం చేసుకుంటుంది, చీకటి వెలుగుల జయాపజయాల్లో నిత్యం ఓడిపోయేది మాత్రం ఈ లోకమే అంటాడు. ఎన్నికలలో నాయకులు గెలుస్తున్నారు కానీ ప్రజలు గెలవడం లేదన్న కవి అంతరంగాన్ని కవిత అంతరార్ధాన్ని పాఠకులు అర్థం చేసుకుంటారు. అంతవరకు పేదవాడి ఆకలికి అన్నమై, దాహార్తికి నీటి చెలిమె కావాల్సిన నాయకత్వం కోసం ఎదురు చూడడమే ప్రజల పని అని పరోక్షంగా ప్రబోధిస్తారు. అడవి, ముళ్ళ దారి ఈ రెండు కవితలు సమరానికి సామరస్యానికి సంధిని సమకూరుస్తాయి. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఈ కవితలకు మరింత ప్రాసంగికత ఉన్నది. కవిత్వాన్ని తన్మయత్వంతో వశం చేసుకునే గాంధర్వంగా చెప్పుకున్న పాను గంటి ఇంతేలే జీవితం అనుకున్నప్పుడు, బ్రతుకంతా చీకటిమయం, ఎంతోలే బ్రతుకు అనుకున్నప్పుడు, జీవితం ఒక స్వర్గధామం అన్న ఆశావాద దృక్పథాన్ని చాటుతారు. ఇది అతని తాత్వికతకు అద్దం పడుతుంది. ఇల్లు అనుబంధాల కూర్పు, తల్లి ఒడిలో దొరికే ఓదార్పు అన్న కవి రాలిన పండుటాకు, ఇంతదాకా నేను అంటూనే కొమ్మపై విర్రవీగింది అని అహంకారికి ప్రతీకాత్మకంగా చెప్పాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం వేసే ఓటు విలువైనదని దానిని అమ్ముకో రాదని చెబుతూ ఎంత విలువై నది ఓటు, అమ్మితే ప్రజాస్వామ్యానికి చేటు అని ఓటర్లకు బాధ్యతను గుర్తు చేస్తాడు. తనకు అభీష్టమైన కె.ఎస్. రమణ , సినారె, అంబేద్కర్, కాళోజి గురించి చక్కని కవితలు రాశారు. అతని కవితా సంపుటిలో జల రూప వజ్రాలు, ప్రణాళిక ప్రగతి సరస్సు, శరత్కాంత వంటి కవితాత్మకమైన మంచి పద ప్రయోగాలు అతని కవితాభివ్యక్తికి పుష్టిని చేకూర్చాయి. చైతన్యానికి చిరునామాగా నిలిచిన జనగామలో వచన కవితకు వన్నెలద్దుతున్న మిత్రులు పానుగంటి రామమూర్తి గారి కవితా ప్రవంతి ఇక్కడి సాహిత్య కేదారాన్ని సస్యశ్యామలం చేయాలని ఆశిస్తూ "ప్రవహించే కాలాని"కి స్వాగతం పలుకుతు న్నాను. ఈ సందర్భంగా కవి పానుగంటిని అభినందిస్తు న్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## మూర్ఖత్వం!

ప్రపంచ దేశాలన్నిటా
భారతీయులున్నారు!
నిన్నటివరకు
మన భారతదేశం
లౌకికరాజ్యం!
నేడు ఇది హిందూదేశం
హిందువులే ఉండాలట!
ఇతరులు పోవాలట! ఈ
వాదనతో మన బతుకు
రోదన కావటం ఖాయం!
మన ఇంటికి వాళ్ళ
ఇల్లుఎంతదూరమో
వాళ్ళ ఇంటికి మన
ఇల్లూఅంతే దూరం!
మనల్ని పొమ్మనరా?
డిజిటల్ గా ఒక్కటై
మారిన ప్రపంచం!
మత, మను వాదాలు
హిత వాదాలుకాదు!
అవి విధ్వంస కారకాలు!

సరిహద్దులు చెరిపేసి
దేశాలు త్వరలోహద్దులు
లేనిప్రపంచం కావటం
అనివార్యం-నీకున్న
'మత రాజ్య'వాంఛ
మూర్ఖత్వం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## నిశీథి....

గాఢంపు ధ్వాంతా
పరిష్వంగమై..
ఎందుకో....
ఇంత గాఢ నీల
పంకము
కురిసినా. .....
నీ స్మృతుల తావుల
తావులు

వ్యర్థమై ...వ్యస్తమై...
అందని ఏ
ఆలింగనాల
అనుభూతినో
వెదకాలని
యత్నిస్తూ...
ఎదురవని ఏ
ఆలంబననో
మది సేద దీర్చు ఏ
పిలుపునో వినాలని
కలవాలని
గెలవాలని
ప్రేరేపిస్తూ...

ఆచూకి అందని
స్వప్న సౌరభాల
ముంచుతూ....
ఎడద స్వస్థ స్థితిని
కలవరపరుస్తూ...

కలతను నెడుతూ..
ఏకతపు శాంతిని
కబళిస్తూ
గ్రీష్మ గానం
వినిపిస్తూ..
ప్రేమ నిండిన ఎదను
స్పందనా రవళిని
నినదించనీ అని
బోధిస్తూ
కమ్ముతూ ....
నీలిమేఘాలు

నిట్టూర్పుల అగరుల
కాల్చుతూ.....
నీవు నాలా అంటూ
నిరాశా నిర్లిప్తతల
తోస్తూ

వేకువ వెలుగుల
వాకిలి
ముద్దాడనీయక
ఎందుకో.. .
.ఈ రాతిరి
ఇంతగా. .. బాధిస్తూ
వేధిస్తూ
బ్రతుకును...మనసు
ను మథిస్తూ...

రాజా వాసిరెడ్డి
మల్లీశ్వరి

# నా వీలునామా



**ముస్లిం రచయితల సంఘం (మురసం) సభ్యులకు, ఇస్లాంవాద కవులకు, అబాబీలు కవులకు, సాహిత్య ప్రపంచానికినేను మురసం వ్యవస్థాపకుడు, తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాద ఆవిష్కర్త, అబాబీలు కవితా ప్రక్రియ రూపకర్తగా నా వీలునామా ఇది.**

....కవి కరీముల్లా

తెలుగు సాహిత్యంలో అనేక ఉద్యమాలు వికసించాయి, ప్రతి ఒక్కటి చారిత్రక నేపథ్యంతో ఏర్పడింది. సామాజిక చైతన్యం కోసం సాంస్కృతిక చైతన్యం అవసరం. ఏ సమాజమైనా ఆధునిక కాలాన్ని అర్థం చేసుకుని, హేతుబద్ధ ఆలోచనలతో, మానవ వ్యక్తిత్వాన్ని, సమాజ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ అభివృద్ధి చెందాలి. సాహిత్యం నిత్యం ప్రవాహంలా సాగాలి, వరదలా అంతర్ధానం కాకూడదు. ఇది ప్రగతిశీలంగా, సంస్కరణలతో, సమస్యల్ని పరిష్కరిస్తూ బలమైన ఉద్యమంగా కొనసాగాలి. ముస్లింలకు ఇస్లాంకంటే బలమైన సైద్ధాంతిక, తాత్విక భూమిక లేదు. అందుకే ఇస్లాంను ఆధారంగా చేసుకుని, ఇస్లాంవాదాన్ని ఆవిష్కరిస్తూ మురసం స్థాపించాను. ఈ నేపథ్యంలోనే అబాబీలు అనే నూతన వచన కవితా ప్రక్రియను సృష్టించాను. ఈ మూడు ఘట్టాలు నా సాహిత్య జీవితంలో కీలకమైనవి. అల్హందులిల్లాహ్. విద్యార్థి దశలో వామపక్ష ఉద్యమాల్లో నాయకత్వం వహించిన అనుభవం మురసం స్థాపనలో ఉపయోగపడింది. నాకు మతం కన్నా మానవత్వమే ముఖ్యం. ఇస్లాంను నేను మతంగా కాక, సఫలీకృత జీవన విధానంగా భావిస్తాను. నిజమైన ముస్లిం విశ్వమానవుడు. సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని కోరుకునే దళిత, బహుజన, సోషలిస్టు శక్తులు నాకు ఇష్టం, ఎందుకంటే అవి ఇస్లామియా విశ్వాసంలో అంతర్భాగాలే.

ముస్లింలకు, ఇతర సమాజాలకు పెరుగుతున్న దూరం, కనుమరుగవుతున్న లౌకిక, మతసామరస్య విలువలు కాపాడేందుకు మురసం కీలక పాత్ర పోషిస్తుంది. విభిన్న వర్గాల మధ్య సామరస్యం, ఇస్లాంపై, ముస్లింలపై అపోహలు తొలగించడం మా లక్ష్యం. ప్రపంచ పెత్తందారీ, సామ్రాజ్యవాద శక్తులకు ముస్లిం సమాజం ఆటంకంగా నిలుస్తోంది, ఎందుకంటే అల్లాహ్ తప్ప ఏ ఆధిపత్య శక్తికీ ముస్లిం తలవంచడు. దీనివల్ల జియోనిస్టు శక్తులు, మీడియా, NGOల ద్వారా ఇస్లామోఫోబియా, ముస్లిం ఫోబియాను పెంచుతున్నాయి. ముస్లిం విశ్వాసాలపై, సంస్కృతిపై ముస్లింల చేతే దాడులు చేయిస్తూ, వారిని సంస్కరణవాదులుగా ప్రచారం చేస్తున్నారు. ఇటువంటి కుట్రలు తెలుగు సాహిత్యంలోనూ కొనసాగుతున్నాయి. ముస్లింలలో లేని కుల వ్యవస్థను సృష్టించి, విడదీసి బలహీనపరిచే కుతంత్రాలను మురసం ఆమోదించదు.

సామ్రాజ్యవాదం, మతతత్వ ఫాసిజం, పెట్టుబడిదారీ విధానం, దోపిడీ, అంటరానితనం, కుల, మత వివక్షలు మా శత్రువులు. సమసమాజం, సామాజిక సమానత్వాన్ని ఆకాంక్షించే సోషలిస్టు, సెక్యులరిస్టు, బహుజన శిబిరాలు మాకు మిత్రులు. మేం ఎవరికీ వ్యతిరేకం కాదు, కానీ స్వతంత్రులం. మా లక్ష్యంవిశ్వమానవ సౌభ్రాతృత్వం, ఆకలి, దోపిడీ లేని రాజ్యం, కులమత వ్యత్యాసాలు లేని లౌకిక రాజ్యం.

### సంస్కరణలకు వ్యతిరేకం కాదు:

ముస్లింలలో పరలోకం మాత్రమే ఆలోచించే మత ఛాందసానికి మేం వ్యతిరేకం. ఇహలోక ఆచరణ ద్వారానే పరలోకం ఉంటుందని ఇస్లాం చెబుతోంది. సమస్యలను విస్మరించి దుఆలకే పరిమితమైతే దైవం క్షమించదు. ముస్లిం సమాజం విద్య, వైజ్ఞానిక రంగాలలో ప్రగతి సాధించాలని నా కోరిక. "తనను తాను మార్చుకోనంత వరకు అల్లాహ్ ఆ జాతిని మార్చడు"

**పవిత్ర ఖుర్‌ఆన్.**

ముస్లింలు దుఆలకే పరిమితం కాకుండా, అన్ని రంగాలలో స్వావలంబన, సామాజిక చైతన్యం సాధించాలి. ఈ స్ఫూర్తిని సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్ల ద్వారా మురసం కొనసాగిస్తుంది. మహిళల హక్కులు ఇస్లాంలో పురుషులతో సమానం. "మహిళల హక్కుల విషయంలో దైవానికి భయపడండి"

**దైవప్రవక్త ముహమ్మద్ (స).**

జ్ఞానార్జన స్త్రీ, పురుషుల విధి అని ఖుర్‌ఆన్ చెబుతోంది. మురసం చైతన్యంలో స్త్రీలది ప్రధాన పాత్ర. హిజాబ్ ముస్లిం స్త్రీల సాంస్కృతిక చిహ్నం. దాన్ని నిషేధించి, మెజారిటీ సంస్కృతిలో విలీనం చేసే ప్రయత్నాల ను పరివార్, హిందూత్వ శక్తులు చేస్తున్నాయి. ఇస్లామోఫోబియా వల్ల కొందరు ప్రగతిశీలవాదులుగా నటిస్తూ ఈ ప్రయత్నాలకు తోడ్పడుతున్నారు. మేం విచ్చలవిడి సంస్కృతిని వ్యతిరేకిస్తాం, మానవ సంబంధాలు, కుటుంబ వ్యవస్థను కోరుకుంటాం. హిజాబ్ వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించినది. ఇస్లాం స్త్రీ, పురుషులకు నిండైన వస్త్రధారణ సూచిస్తుంది. ఎవరు ఏ వస్త్రం ధరించాలనేది వారి ఇష్టం. హిజాబ్ ధరించనందుకు ఎవరైనా దాడులకు గురైతే, మురసం, ఇస్లాంవాదం బాధితుల పక్షం వహిస్తాయి. "ధర్మంలో బలాత్కారానికి తావు లేదు"

**ఖుర్‌ఆన్.**

ఎవరు ఏం తినాలి, ఏం ధరించాలి అనేది వ్యక్తిగత ఇష్టం. బలవంతం అప్రజాస్వామికం. ఈ దేశం విభిన్న మత, కుల, సంస్కృతులది. మేం దళిత, ఆదివాసీ, గిరిజన సంస్కృతులను గౌరవిస్తాం. కుల, మత, భాష ఆధారంగా ఎవరినీ ద్వేషించం. హిజాబ్, టోపీ, గడ్డం ముస్లిం అస్థిత్వ చిహ్నాలు. వీటిని పాటించేవారిని వెనుకబాటుగా భావించడం ఉన్మాదం. షాహిన్ బాగ్‌లో పౌరసత్వ సమస్యలపై, స్వాతంత్ర్య సమరంలో హిజాబ్ ధరించిన మహిళలు, 3000 మంది మౌల్వీలు ఇస్లాం స్ఫూర్తితో పోరాడారు. అందరినీ మతఛాందసులని నిందించడం సరికాదు.

### విద్య మరియు సంస్కరణ:

మురసం మదరసాలలో ఆధునిక విద్యను కోరుకుంటుంది. ధర్మాచరణ పాఠా లతో పాటు, భాషలు, సైన్స్, సామాజిక శాస్త్రాలు బోధించాలి. కుల, మతాలకు అతీతంగా బహుజన మదరసాలు ఏర్పడాలి. ముస్లిమేతర విద్యార్థులకు ఇస్లామియా బోధనల నుండి మినహాయింపు ఇవ్వాలి. దీనివల్ల విద్యార్థులు ఒకరి సంస్కృతిని ఒకరు గౌరవించి, సోదరభావంతో ఉంటారు. "విద్య కోసం భూమి చివరి వరకు వెళ్లండి"

**దైవప్రవక్త ముహమ్మద్ (స).**

తెలుగు, ఉర్దూ ముస్లింల మధ్య వివక్షను తొలగించేందుకు మురసం కృషి చేస్తుంది. నీతులు చెప్పడం కాదు, ఆచరణలో నిజాయితీ ఉండాలి. ప్రవక్త (స) కాలంలో నీగ్రోలతో అరబ్బుల వివాహాలను ప్రోత్సహించారు. మనం మనువాద ప్రభావంతో వివక్షకు లోనవుతున్నాం. జమాత్‌లు ఈ విషయంలో వేగంగా కృషి చేయాలి. ప్రతి గ్రామంలో జుమ్మా ప్రసంగం తెలుగులో జరిగే మస్జిద్ ఉండాలి. ఉర్దూ భాషను తెలుగు ముస్లింలపై బలవంతంగా రుద్దకూడదు. ఉమ్మడి పోరాటాలే కావాలి, ప్రత్యేక పోరాటాలు కాదు.

జమాత్‌లు సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి, ఐక్యత, సామాజిక సమస్యలపై దృష్టి పెట్టాలి. ఇజ్తెమాలు ఆధ్యాత్మికంతో పాటు సామాజిక అవగాహన కలిగించాలి. తెలుగు భాషలో ముస్లిం సాహిత్యకారులను తయారు చేయడం మురసం లక్ష్యం. భాష ఆత్మను వశం చేస్తుంది. తెలుగును నిర్లక్ష్యం చేయడం 15 కోట్ల ప్రజలను నిర్లక్ష్యం చేయడమే. "ప్రవక్తలు లేని జాతి లేదు" ఇస్లాం. మురసం అన్ని పీడనలకు వ్యతిరేకం. "పీడితుని ఆర్తనాదానికి భయపడండి"ప్రవక్త (స). రాజ్యహింస, కులమత దౌర్జన్యాలను నిరసిస్తాం. "అన్యాయంగా ఒకరిని హత్య చేస్తే సమస్త మానవజాతిని హత్య చేసినట్లే"ఖుర్‌ఆన్. మా అక్షరాలు పేదల, పీడితుల పక్షం. శాంతి, క్రాంతి, ఓర్పు, నేర్పుతో మా ప్రయాణం సాగుతుంది. ఈ ఆశయాలతో మురసం ముందుకు సాగాలని నా ఆకాంక్ష.

# కొనకుండ ఉండలేం..!

- పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ
- సైజును బట్టి కుండ ధర
- కుండనీరే శ్రేష్టమంటున్న డాక్టర్లు



**సంగారెడ్డి ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) :** ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు భయపెడుతున్నాడు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు జనం వెంపర్లాడాల్సి వస్తోంది. చల్లటి పానీయాలు, పండ్ల రసాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని ఈ సారి ప్రత్యేక ఆకర్షణగా శాలివాహనలు కుండలు తయారు చేశారు. సైజును బట్టి రేటు ఉంటోందని, కుండలకు డిమాండ్ పెరు గుతోందని కుమ్మర్లు చెబుతున్నారు. ఎంతో అందంగా చూడముచ్చటగా ఉండే ఈ కుండ లంటే ప్రతి ఒక్కరు ఇష్టపడతారు. ఏళ్లు గడుస్తున్నా వాటి క్రేజ్ మాత్రం తగ్గట్లేదు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కుండలు మార్కెట్లో లభిస్తున్నాయి. కుండలకు, కూజలకు ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

### పేదోడి ఫ్రిజ్ కు భలే గిరాకీ..

వేసవికాలం వచ్చిందంటే చాలు కొద్దో గొప్పో ఉన్నోళ్లు ఫ్రిజ్లు కొనుగోలు చేస్తారు. పేదోళ్లు మాత్రం మట్టితో తయారుచేసిన కొత్త కుండల్లో నీరు ఉంచి తాగేం దుకు ఇష్టపడతారు. అందుకే కుండలను పేదవాడి ఫ్రిజ్‌గా పిలుస్తారు. అలాంటి కుండలకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వేసవిలో చల్లటి నీళ్లు తాగడానికి పేదోళ్ల కుండలనే ఫ్రిజ్లుగా భావించి నీటిని తాగుతారు. ఆ పేదోడి ఫ్రీజ్ కు భలే గిరాకీగా ఉంది. ధరలు ఆకాశాన్ని అం టుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ సారి ఒక్కో కుండపై రూ.50 వరకు ధర పెరిగింది. కొళాయి కలిగిన కుండ ఒక్కొక్కటీ రూ.150 నుంచి రూ.200, 20 లీటర్ల కుండ రూ.300, 40 లీటర్ల కుండ రూ.400 నుంచి రూ.500లోపు అమ్ముతున్నారు.

### మట్టి కుండల నీరే శ్రేయస్కరం



ఇళ్లల్లో ఫ్రిజ్లు ఉన్నా మట్టికుండల నీరు తాగితే ఆరోగ్యానికి శ్రేయస్కరమని డాక్టర్లు విటల్ అంటున్నారు. చిన్నప్పటి నుంచి మట్టి కుండల నీటినే తాగేవారు గ్రామంలో ఉన్నారు. ప్రస్తుతం పట్టణాలలో కూడా కుండల నీళ్ల తాగడానికి ఇష్టపడుతున్నారు. ఫ్రిజ్ నీళ్ల కాకుండా కుండలలోని నీళ్ల తాగితే ఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటుందని అన్నారు. బయట లభించే కూల్ డ్రింక్స్ తాగడం కంటే కుండ, కూజ నీళ్ల తాగడం మంచిది.

**డాక్టర్ విటల్**

# 65వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- కారుపై పడ్డ లోడ్ లారీ
- ఐదుగురికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులు శంకర్ పల్లి వాసులు
- మానవత్వం చాటిన మాజీ మంత్రి హరీష్ రావు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్





**సంగారెడ్డి, కొండాపూర్ మే 4 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా పెద్దాపూర్ 65వ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కట్టెల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి జాతీయ రహదారి పై ఉన్న డివైడర్ ను ఢీ కొట్టి అటుగా వెళుతున్న ఒక కారుపై పడింది. ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పింది ఐదు మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. కొండాపూర్ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. శంకర్ పల్లికి చెందిన శ్రీనివాస్ గౌడ్, అరుణ, జగన్, నవీన్, ఈశ్వర్ లు ఆదివారం ఇంట్లో వివాహ కార్యక్రమం ఉండగా పెళ్లి కార్డులను ఇచ్చేందుకు ఉదయం 11 గంటల ప్రాంతంలో సదాశివపేట వైపుకు తమ కారులో బయల్దేరి వెళ్లారు. పెద్దాపూర్ సమీపానికి రాగానే అటుగా వెళుతున్న కట్టల లోడ్ తో ఉన్న లారీ అదుపుతప్పి డివైడర్ పైనుంచి వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో కారులో ఉన్న ఐదు మందికి గాయాలు కాగా వెంటనే వారిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటన స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకాజ్ పరిశీలించారు.

మానవత్వం చాటుకున్న హరీష్ రావు

### జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం

సమయంలో జహీరాబాద్ పర్యటనకు వెళ్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ ఆ ప్రమాదాన్ని చూసి చలించిపోయారు. వెంటనే కారు దిగి ప్రమాద ఘటన వద్దకు చేరుకొని, స్థానికులు, వెంట ఉన్న సిబ్బంది, నాయకుల సహాయంతో బాధితులను కారు నుండి వెలికి తీశారు. స్వయంగా తన వాహనంలో క్షతగాత్రులను ఎక్కించి, చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రికి పంపించారు.

వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి తగిన సహాయక చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా కోరడం జరిగింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో కుటుంబ సభ్యులు బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**మెదక్, మే 4 (జనం సాక్షి) :** జిల్లాలోని హవెలిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాయలంలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మైనంపల్లి హనుమంతరావు ను శాలువాతో సత్కరించారు.

## కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఆర్థిక లబ్ది


- పాక్స్ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి



**శివ్వంపేట, మే 4 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని శివంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్ రాం రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ సీఈఓ మధు యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ పార్వతి సత్యం, నాయకులు సత్యనారాయణ, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐలాపూర్ ఘనంగా మల్లన్న జాతర

- పాల్గొన్న ఎమ్మెల్యే



**అమీన్పూర్, మే 4 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు మల్లేష్, కృష్ణ, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డీకే అరుణమ్మ జన్మదిన వేడుకలు



**వనపర్తి బ్యూరో, మే 4 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు ,మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ పుట్టినరోజు పురస్కరించుకొని వనపర్తి జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా గద్వాల నియోజకవర్గానికి చెందిన డీకే అరుణమ్మ, రాజకీయ అరంగేట్రంలో జడ్పిటిసి స్థాయి నుండి శాసనసభ్యులుగా, ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా తదనంతరం పాలమూరు ఎంపీగా విజయం సాధించి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో మహిళా సాధికారత కమిటీ సభ్యురాలిగా, వక్ఫ్ సవరణ బిల్లు జెపిసి సభ్యురాలుగా కీలక భూమిక నిర్వహిస్తున్నారని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బిజెపి పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ఆపదలో ఆదుకునే పెద్దదిక్కుగా ఉంటూ అధికార పార్టీకి ధీటుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫైట్ బ్రాండ్ నేతగా ఎదిగిన డీకే అరుణమ్మ మహిళ లోకానికి స్ఫూర్తిగా నిలిచి భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో అగ్రస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మహిళా మోర్చా రాష్ట్ర సహ కోశాధికారి జ్యోతి రమణ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.అలివేలమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు సుగురు లక్ష్మి కవిత, కిసాన్ మోర్చా కార్యదర్శి జ్ఞానేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నవీన్ చారి, నల్లపోతుల అరవింద్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రవికుమార్, రఘు, వాల్మీకి గోవిందు ,విజయ సాగర్, రాయన్న కొమ్ము శ్రీనివాసులు, యుగంధర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ బాటలో మనం ముందుకు నడవాలి



**శివ్వంపేట, మే 4 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ రచయిత మనందరికీ ఆదర్శప్రాయుడు బిఆర్ అంబేద్కర్ చూపిన బాటలో ముందుకు సాగాలని శివంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెంకట్ రాం రెడ్డి, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాంబండ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఫ్యాక్స్ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించిన దేశానికి స్ఫూర్తిగా నిలిచారని వారు గుర్తు చేశారు. అంతకుముందు గ్రామంలో కొంతమందికి డబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు శివులు, స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, బాలమణి నరేందర్, నాయకులు రాజశేఖర్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చెట్లపల్లి యాదగిరి, లక్ష్మణ్ లతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## నా జీవితం ప్రజలకే అంకితం

- జన్మదిన వేడుకల్లో ఎంపి.అరుణ
- పేటలో పెద్ద ఎత్తున రక్తదానం



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** నా జీవితం ప్రజల సేవకే అంకితం అని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డికె.అరుణ అన్నారు. ఆదివారం నారాయణపేట లో ఎంపి అరుణ జన్మదిన వేడుకలు బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఎంపి అరుణ పాల్గొని కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఆమెను గజమాల శాలువాలతో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతాంగ్ పాండు రెడ్డి, ఎస్.విజయ్ కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి,గోవర్ధన్ గౌడ్,పున్నం చంద్ లాహోటి, జిల్లా నాయకులు పగుడాకుల శ్రీనివాసులు, నందు నామాజీ,సిద్ది వెంకట్ రాములు, మిర్చి వెంకటయ్య, కృష్ణ, సుజాత, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ కుమార్,మాజీ కౌన్సిలర్లు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎంపి అరుణ తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్నీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై అభిమానంతో ప్రజల ప్రాణాలు కాపాడే రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రక్తదానం చేయడం ప్రాణదానం చేయడమేనని ఎంతో మందికి ఉపయోగకరమైన రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు.కార్యకర్తలు,ప్రజలు తనపై చూపిన అభిమానంతో తన జీవితం ప్రజలకే అంకితం చేస్తానని అన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**గద్వాల్ రూరల్, మే 4 (జనంసాక్షి) :** ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకల సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన గట్టు యూ సీ బ్రదర్స్ రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, యుగంధర్,కృష్ణమూర్తి,శ్రీనాథ్.రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం శ్రీ భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా జరపడం ఎంతో సంతోషకరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.భగీరథుడు పవిత్రమైన గంగను భూమి పైకి తెచ్చిన ఏకైక వ్యక్తి అని గ్రామ ప్రజలకు భగీరథ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గట్టు మాజీ ప్రెసిడెంట్ యు శ్రీనివాసులు జాయింట్ సెక్రెటరీ యు రవీంద్రబాబు విలేకర్ శ్రీనివాసులు యు యశ్వంత్ సాగర్ టీచర్ రాజ్ సాగర్ యు మహాదేవు టమోటా వెంకటేష్ హోటల్ వెంకటేశు హోటల్ ఈరన్న తంగలగడ్డ గోవిందు జనార్ధన్ వీరేష్ కమ్మరి రమేష్ యాస్కో వీరేష్ వైకుంఠ వీరేష్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. నారాయణపేట జిల్లా పరిధిలో దొంగతనాల నిర్మూలన గురించి పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరిగిందనీ గ్రామాలలో, పట్టణ కేంద్రంలోని కాలనీలలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ వారికి డయల్ 100 లేదా 24/7 పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్.8712670399కి, లేదా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ పెంచడం జరిగిందని పెట్రో కార్ పెట్రోలింగ్, బ్లూ కోట్స్ పెట్రోలింగ్, అలాగే మఫ్టీలో పోలీసులను, టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దొంగతనాల నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే పాత నేరస్తుల పై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీ నిర్వహించడంజరుగుతుందని, ప్రజలు ఎవరైనా గ్రామాల లో ఎక్కువ రోజులు ఇండ్లకు తాళం వేసి టూర్లు లేదా బంధువుల ఊర్లకు వెళ్లినచో సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని ఆయ ఏరియాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు చేయడానికి భయపడతారని, అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందనీ ప్రతి గ్రామంలో ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

## ఆదర్శప్రాయుడు భగీరథ మహర్షి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** సమాజ హితం కోసం కృషిచేసిన భగీరథుడు ఆదర్శ ప్రాయుడని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై భగీరథ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. ఏదైనా కష్టమైన కార్యం సాధించాలంటే మహర్షి భగీరథుడి కృషిని ప్రస్తావిస్తూ, ఆ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిందిగా పెద్దలు సూచిస్తారని గుర్తు చేశారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగానిర్వహిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో బి. సి. అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఓ ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సగర సంఘం నాయకులు మల్లికార్జున్, నర్వ చెన్నయ్య సాగర్, విజయ్ సాగర్, నిడుగుర్తి శంకర్, ధన్వాడ శంకరయ్య, నర్వ రామకృష్ణ, కడేచూర్ అంజి, మన్నె నారాయణ, ఆనంద్, బుసన్న, రాజబాబు, సురేందర్,బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
05 మే 2025

# మండుటెండల్లో మధుర ఫలాలు

- కొబ్బరి బోండాలు, మజ్జిగ, చెరకు రసాలతో ఉపశమనం
- తాటి ముంజలకు పెరిగిన ఆదరణ
- అమ్మలా మేలు చేసే నిమ్మ
- భలే మజా.. కర్బూజా
- అమృత తుల్యం మజ్జిగ, పుచ్చకాయతో ఆరోగ్యం
- తక్కువ ఖర్చుతో చక్కని ఆరోగ్యం

**మే నెల మొదటి వారంలోనే ఎండలు మండి పోతున్నాయి. మరో రెండు నెలలపాటు పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఇటువంటి సమయంలో చక్కని ఆరోగ్యం కోసం ప్లానింగ్ చేసుకోవాలి. అప్పుడే తక్కువ ఖర్చుతో మంచి ఆరోగాన్ని పొందే అవకాశం వుంటుంది. హెూటళ్లకు వెళ్లి రూ. 100 నుంచి రూ. 250 వెచ్చించి ఒక చికెన్, లేదా మటన్ పలావ్ కొని తినడం కన్నా అదే డబ్బుతో నాలుగైదు రోజులు శరీరానికి మేలు చేసే మధుర ఫలాలను కొనుక్కోవడం వల్ల ఎంతో లాభం చేకూరుతుంది మండుటెండల్లో సైతం ప్రకృతి వరప్రసాదినిగా అనేక మధుర ఫలాలు అన్ని చోట్లా అందుబాటులో వున్నాయి.. వేసవిలో ప్రకృతి సిద్ధంగా మనకు లభించే మధుర ఫలాల్లో తాటి ముంజలు ఒకటి. ఎండల్లో వీటిని తినడం ఎంతో మంచిది. తాటి ముంజుల్లో 99 శాతం నీరు వుంటుంది. తాటీ ముంజలు వారానికి రెండు, మూడు సార్లు తినడం వల్ల చక్కని ఆరోగ్యం పొందవచ్చు.**

**సంగారెడ్డి ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) :** వేసవికి భానుడు భగభగమంటున్నాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి, కాసేపు అలా ఎండలో వెళితే గొంతు తడారిపోతుంది, చల్లగా ఏదైనా తాగాలనిపిస్తుంది. ఎదురుగా కనిపించే రంగురంగుల కూల్డ్రింక్స్ ఆకర్షిస్తాయి. అవి తాగినంతసేపు చల్లగా ఉన్నట్లనిపిస్తుంది. మళ్లీ వెంటనే దావాం వేస్తుంది. కూల్డ్రింక్స్ వల్ల దాహం తీరకపోగా అనేక రోగాలకు దారితీస్తాయి. అదే మన ప్రాంతంలో లభించే సహజ సిద్ధమైన పండ్లతో చేసే రసాలు, ఇంట్లో లభించే పెరుగు లాంటి వాటితో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పండ్లరసాలను వేసవిలో సేవించడం ద్వారా ఈ ఎండా కాలాన్ని చల్లగా గడిపేయవచ్చు.

### భలే మజా.. కర్బూజా..

తొంభైశాతం నీరేండే కర్బూజా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఎండ లో ఎక్కువగా తిరిగేవారు చెమట రూపంలో లవణాలు కోల్పోతారు. ఇటువంటి వారు క్రమంతప్పకుండా కర్బూజా తీసుకోవడం ఎంతో ఉత్తమమని అంటున్నారు. తిన్న కొద్ది నిమిషాల్లోనే తక్షణ శక్తి ఇవ్వడం కర్బూజా సొంతమని చెబుతున్నారు.



### కొబ్బరి బోండాం

వేసవిలో కొబ్బరి బోండాం మనిషికి ఏమాత్రం నీరసం అనిపించినా వెంటనే గుర్తుకొచ్చేది కొబ్బరిబోండాం. జ్వరం, విరేచనాలు, నీరసం ఇలా దేనికయినా కొబ్బరి బోండామే విరుగుడు. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల మనిషికి తక్షణం శక్తినిస్తుంది. అలాగే ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది.

### తాటి ముంజలకు పెరిగిన ఆదరణ

వేసవిలో పండ్లలో తాటి ముంజలకు అధిక ప్రాధా న్యం సంతరించుకుంది. ఎండ వేడిమిని తగ్గించడంలో తాటిముంజలు కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటికి ఆదరణ పెరిగింది. ప్రతి ఏటా పట్టణాలకు, పల్లెలో చుట్టు ఉన్న గ్రామా ల్లోని వ్యాపారులు జీవనధారంగా మార్చుకున్నారు. వ్యాపారులు తాటిచెట్లు కొనుగోలు చేసి కొట్టుకు వచ్చి పట్టణాలలోని ప్రధాన రహదారుల్లో ఇరువైపుల ఉండి విక్రయిస్తున్నారు. డజన్ రూ.80,100, చొప్పున విక్రయిస్తున్నారు.

### అమృత తుల్యం మజ్జిగ

ఇక అందరి ఇంటా లభించే మజ్జిగను వేసవిలో అమృత తుల్యంగా చెప్పొచ్చు. మార్కెట్లో లభించే శీతలపానీయాల కంటే తక్కువ ధర వుండే మజ్జిగ ఎంతో మంచి వేస్తుంది. ఇది ఆరోగ్యక రమే గాకుండా చక్కని పౌష్టికా హార పానీయం శరీరాన్ని తేమగా వుంచుతుంది. మజ్జిగలో ఉప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు పెప్పర్, జీలకర్ర, అల్లం, కొత్తిమీర వంటివి క లిపితే రుచే వేరు. శరీరంలో వేడిని తగ్గించే ద్రవాల్లో మజ్జిగ మొదటి స్థానంలో వుంటుంది. శరీరానికి అవ సరమైన సీ ఏ, ఈ కె. బీ విటమిన్లు మజ్జిగ ద్వారా లభిస్తాయి. ఐరన్, జింక్ పొటాషియం వంటి మినరల్స్ మజ్జిగలో ఎక్కువగా వుంటాయి. శరీరంలో శక్తిని కోల్పోయినప్పుడు.. పొడిబారుతున్నప్పుడు.. దాహంగా ఉన్నప్పుడు. వేసవిలో ప్రతి రోజూ కనీసం రెండు గ్లాసులు మజ్జిగ తాగితే తిరుగులేని ఆరోగ్యం మన సొంతమవుతుందని చెప్పాలి.

### చెరకు రసం టేస్ట్ వేరు

వేసవిలో చెరకు రసం మరెంతో ఉపకరిస్తుందని చెప్పాలి. ఇందులో కొలాస్ట్రాల్ లేని నూరుశాతం సహజ పానీయం చెరకు రసం ఒంట్లో వున్న వేడిని తక్షణమే తగ్గించగల మధుర పానీయం ఇది. చెరకు రసానికి కొద్దిగా నిమ్మరసం కలిపితే కిక్కే వేరని చెప్పాలి. ఇందులో ఐస్ వేసుకో కపోవడం ఎంతో మంచిదని చెప్పాలి. ఆరోగ్యానికి ఉపయోగపడే మినరల్స్, విటమిన్స్, యాంటీ ఆక్సిండెంట్స్, సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషి యం, ఇనుము అధికంగా లభిస్తాయి చెరకు రసం శరీరంలో నీటి శాతం తగ్గకుండా కాపాడగలుతుంది. పోషకాలెక్కువగా వుంటాయి.



### అమ్మలా మేలు చేసే నిమ్మ

వేసవిలో నిమ్మకాయలు అమ్మలా మేలు చేస్తాయి. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్, కాల్షియం, పొటా: షియంలు ఎక్కువగా వుంటాయి. శరీరం నుంచి చెమటరూపంలో హరించుకుపోయిన శక్తిని నిమ్మ రసం తాగడం ద్వారా తిరిగి పొంద వచ్చు ఇది రోగనిరోధకశక్తిని పెంచు తుంది, ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

### పుచ్చకాయతో ఆరోగ్యం

హైబీపీతో బాధపడుతున్న వారు పుచ్చ కాయ జ్యూస్ తీసుకోవడం ఎంతో మేలు ఈ పండును రసం తీసి తాగడం కంటే పీచుతో తినడం మంచిది ఇందులో విటమిన్-డితో పాటు నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని ఇస్తుంది. వేసవిలో దాహార్తి తీర్చడానికి, చర్మవ్యాదులు నియంత్రణకు ఇది ఎంతో ఉపకరిస్తుంది.

### పండ్ల రసాలతో ఆరోగ్యం



వేసవికాలంలో పండ్ల రసాలు సేవించడం వలన ఆరోగ్య సమస్య ఉండదని సంగారెడ్డి హెూప్ న్యూరో కార్డియాక్ డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని శీతల పానీయాలు (కూల్ డ్రింక్స్) జోలికి వెళ్లకుండా చల్లదనాన్నిచ్చే పండ్ల రసాలే ఆరోగ్యానికి శ్రేయస్కరం అన్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**డాక్టర్ కృష్ణమూర్తి**

## సైబరాబాద్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- పలు వాహనాల డ్రైవర్లు అరెస్ట్



**శేరిలింగంపల్లి, మే 4 (జనంసాక్షి) :** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భారీగా డ్రైవర్లు మద్యం సేవించి పట్టుబడడం జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీసు అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం... శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న డ్రైవర్లు భారీగా పట్టుబట్టడం జరిగిందని తెలిపారు. మొత్తం 220 మంది డ్రైవర్ లు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 187 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 04 మంది ఆటో రిక్షా డ్రైవర్లు కాగా 45 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతున్న డ్రైవర్లు మరియు ఇద్దరు హెవీ వెహికల్‌లను నడిపిస్తున్న డ్రైవరు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఇందులో 18 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 200 ఎంజి/100 ఎమ్మెల్ నుండి గరిష్టంగా 500 ఎంజి/100 ఎమ్మెల్ గా పరిగణించడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారందరినీ హైకోర్టు లో ప్రవేశపెట్టి ఎవరైనా రోడ్డు ప్రమాదాలకు కారణమైనా..., హిట్ అండ్ రన్ చేసినట్లు తెలిసినా అరెస్టు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని, గరిష్టంగా పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశంకూడా ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలకు ఫర్నీచర్ వితరణ

- రూ. 30 వేల సామాగ్రిని అందజేసిన మిడ్జిల్ నల్లబోల్ సుమన్ రెడ్డి



**తలకొండపల్లి, మే 4 (జనంసాక్షి) :** తలకొండపల్లి ప్రభుత్వ కళాశాల నూతనంగా ఏర్పడడంతో అధ్యాపకుల కోరిక మేరకు ఆఫీసుకు సంబంధించిన ఫర్నిచర్,ను మిడ్జిల్ వాస్తవ్యులు నల్లబోల్ సుమన్ రెడ్డి రూ,30 వేల విలువగల ఆఫీసు సామాగ్రిని అందజేయడం అభినందనీయమని కళాశాల అడ్మిషన్ డ్రైవ్ ఇన్చార్జి లైబ్రేరియన్ జి.షణ్ముఖ రెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు.కానీ ఆఫీసుకు సంబంధించిన సామాగ్రి లేనందున ఇట్టి విషయాన్ని మిడ్జిల్ వాస్తవ్యులు నల్ల బోల్ సుమన్ రెడ్డి కి అధ్యాపకులు తెలియజేశారు.వారు వెంటనే స్పందించి పెద్ద మనసుతో ఆఫీసుకు సంబంధించిన రెండు బీరువాలు,రైటింగ్ టేబుల్,కుర్చీ,లను దాదాపు రూ,30 వేల విలువగల సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా సుమన్ రెడ్డి మాట్లాడుతూ..మారుమూల తలకొండపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగడంతో గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద విద్యార్థులకు సరైన బోధన అందుతుంది అనే ఉద్దేశంతో తన సొంత నిధులను వెచ్చించి సామాగ్రిని అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందజేస్తుందని ఇట్టి అవకాశాన్ని ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.రాబోవు కాలంలో కళాశాలకు కావలసిన వసతుల విషయంలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ ప్రాంత నాయకులు,ప్రజా ప్రతినిధులు,పెద్దలు,ముందుకు వచ్చి కళాశాలకు కావలసిన వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు సరైన బోధనను అందించేందుకు కృషి చేయాలని కోరారు.అనంతరం షణ్ముఖ రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు సామాగ్రిని అందించాలని కోరిన వెంబడే ఫర్నిచర్ ను అందించిన సుమన్ రెడ్డి,కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా బీరప్ప దేవుని కళ్యాణ మహెూత్సవం



**రాయికొడు, మే 4 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో గత నాలుగు రోజుల నుండి బీరప్ప స్వామి జాతర మహెూత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహెూత్సవాలలో భాగంగా ఆదివారం బిరప్ప స్వామి కామరతి దేవీల కళ్యాణ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కథ కళాకారులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతోపాటు కురుమ సంఘం సభ్యులు, వివిధ గ్రామాల కులబాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి కేంద్రాన్ని ఆవిష్కరించిన ఆజాద్ ఇంజినీరింగ్

**ఖైరతాబాద్, మే 4 (జనం సాక్షి) :** ప్రెసిషన్ ఇంజి నీరింగ్ పరికరాల తయారీలో అగ్రగామి అయిన ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థ హైదరాబాద్ తునికిబొ ల్లారంలో సరికొత్త ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించి నట్లు ఆజాద్ ఇంజినీరింగ్ సీఈఓ, ఛైర్మన్ రాకేష్ చొప్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జీఈ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ కోసం ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయ డం ద్వారా ఓ సరికొత్త మైలురాయి అందుకుందని అన్నారు.




## బీఆర్ఎస్ నాయకుడి సతీమణి మృతికి ఎమ్మెల్యే నివాళి



**న్యాల్‌కల్, మే 4 (జనం సాక్షి) :** విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడి సతీమణి సిద్ధమ్మ (56) మృతి చెందడం పట్ల జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్ రావు ఘన నివాళు లర్పించారు. ఆదివారం మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన పార్టీ ముఖ్య నాయకుడు విట్టల్ సతీమణి (భార్య) మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ లు పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రవీందర్ తో కలిసి ఆదివారం సాయంత్రం అంత్యక్రియలో పాల్గొని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, ఎమ్మెల్యే తనయుడు మిథున్ రాజ్, పార్టీ శ్రేణులు దీపక్, ఉమేష్ పాటిల్, హనీఫ్, వెంకటేశ్వర్, దిగంబర్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ పాటిల్, నగేష్, తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లి పరిధి చెరువులకు మహర్దశ

- పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, మే 4 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులన్నింటికీ మహర్దశ పట్టనుందని రాష్ట్ర ప్రజా పరిధిలో కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు మియాపూర్ డివిజన్ పరిధి పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్కా మహబూబ్ పేట్ పరిధి పెద్ద కుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మ కుంట చెరువు తదితర చెరువులను మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆదివారం అయినా పరిశీలించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి మియాపూర్ డివిజన్ పటేల్ చెరువు, గురునాథం చెరువు, పెద్ద కుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మకుంట చెరువు తదితర 64 చెరువులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రత్యేక నిధులను కేటాయించి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అద్భుతమైన మహర్దశ అందనుందన్నారు. భవిష్యత్తు తరాలకు వందల కోట్ల ఆస్తుల కన్నా... జీవనాధారమైన నీరు, మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవితం అందించగలిగితే ప్రస్తుత నాయకుల జన్మ సార్ధకమైనట్టేనన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ, అందుకు తోడ్పాటు అందించే చెరువుల పరిరక్షణ భవిష్యత్తు సమాజం మనగడకు నాంది పలుకుతుందని... మనిషి జీవనాధారానికి తోడ్పాటు అందించే జలసిరిని ప్రజలకు అందించే చెరువుల పరిరక్షణకు తాను నిర్ద్వంద్వంగా కట్టుబడి ఉన్నానని అరికెపూడి భరోసాని వ్యక్తం చేశారు. మియాపూర్ డివిజన్ పరిధి పటేల్ చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ విభాగం నిధుల కింద మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపడుతున్న చెరువుల పునరుజీవ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించడంతోపాటు ఇతర చెరువుల పరిరక్షణకు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి నియోజకవర్గం పరిధిలోని ఇతర ఐటీ పరిశ్రమకు చెందిన కంపెనీలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా చెరువుల సుందరీకరణకు, పరిరక్షణకు తమ వంతు తోడ్పాటు, సహాయ సహకారాలను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ పరిశ్రమ ప్రత్యేక నిధులతో చేపడుతున్న గురునాథం చెరువు సుందరీ కరణ పనులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ కార్యక్రమంలో భాగంగా లక్షల రూపాయలను వెచ్చించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ పరిశ్రమ నూతనంగా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన కొనియాడారు. మనిషి మనుగడకు మూలాధారమే జలమని, భవిష్యత్తు సమాజ పురవృద్ధికి భూగర్భ జలాలు, నేటి వనరులు అత్యంత కీలకం కానున్నాయని గాంధీ వివరించారు. గురునాథం చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులను నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేపట్టడం జరుగుతుందని, ఇదే క్రమంలో ఐజియుఎస్, హెచ్డిఎఫ్సి, మల్లిగావాడ్ తదితర ఐటి కంపెనీలు, సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ విభాగం కింద శేరిలింగంపల్లి పరిధి చెరువుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను వెచ్చించి స్వచ్ఛందంగా చెరువుల పరిరక్షణకు పూనుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఆయా చెరువుల కలుషితనీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మల్లింపు పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరడం జరుగుతుందన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలను చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అరికెపూడి, ఉప్పలపాటి తెలియచేసారు. చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలకు, చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని వారు ఆదేశించారు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని పనులు వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. చెరువు సుందరికరణలో భాగంగా చెరువుకట్టను పటిష్ట పరిచేలా పునరుద్ధరణ, మురుగునీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ (యుజిడి) నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని పీఏసీ చైర్మన్, కార్పొరేటర్ వివరించారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణపు పనులు చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బాటసారుల దాహార్తిని తీర్చాలి




**అమీన్‌పూర్, మే 4 (జనం సాక్షి) :** వేసవిలో బాటసారిల దాహార్తిని తీర్చాల్సిన అవసరం అందరిపై ఉందని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహా గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ నగర్ లో ఎన్ఎన్ జీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకి ఎండలు ముదురుతుండటంతో బాటసారులకు ఇబ్బంది కాకుండా చలివేంద్రాలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం గౌడ్, ప్రమోద్ రెడ్డి, రవి, రాజు, గోవింద్ కాలనీవాసులు ఉన్నారు.

# అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

## రాజన్న ఆలయ అభివృద్ధికి పెద్దపీట

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 4 (జనంసాక్షి) :**



ప్రజలకు మెరుగైన కనీస సౌకర్యాలు, వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్ పల్లిలో రూ.కోటి 43 లక్షలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఆదివారం ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాత్రాజ్ పల్లి చాలా చైతన్య వంతం కలదని, ఎందరో ప్రభుత్వ ఉద్యోగులను అందించిన చరిత్ర దీనికి ఉందని గుర్తు చేశారు. అనాడు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చెస్తూ ముందుకూ పోతున్నామని స్పష్టం చేశారు. శాత్రాజ్ పల్లిలో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం వైద్యానికి హబ్ గా ఏర్పడుతుందన్నారు.ఎవరు అడగకున్నా ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ12 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో హెల్త్ సెంటర్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**సుందరీకరణ పనులకు శంకుస్థాపన**

వేములవాడలోని తిప్పాపూర్ బస్టాండ్ నుండి చెక్ డ్యామ్ వరకు,మిగిలిన బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ తిప్పాపూర్ నుంచి మూలవాగు ఎడమ వైపు రూ 80 లక్షలతో సుందరీకరణ పనులను ప్రారంభం చేయడం జరిగింద న్నారు.ఒక ఆహ్లాదకమైన వాతావరణం కల్పించేందుకు నేడూ శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేశామని ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతి సలహాలు సూచనల మేరకే పనులకు శ్రీకారం చేపడతామన్నారు. రాజన్న గుడి చెరువులోకి మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వేములవాడ సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజాం, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరిస్తారా.. సమ్మె చేయమంటారా?



**డిపో ముందు ఆర్టీసీ సమ్మె పోస్టర్లు విడుదల**

**ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి) :**

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారా లేక సమ్మెకు దిగమంటార అని హెచ్చరిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివారం బోజన విరామ సమయంలో జిల్లా కేంద్రంలో టీజీ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ డిపో ముందు ఈనెల 7న చేపట్టనున్న సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఈవీఆర్ కిషన్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఆర్టీసీ కార్మికులు తీవ్రమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కాక కార్మికులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నామన్నారు. అదే విధంగా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీ ఆర్టీసీ జేఏసీ కార్మికుల ఆధ్వర్యంలో ఈరోజు డిపో ముందు ఈ నెల 7న నిర్వహించే సమ్మె పోస్టర్లను విడుదల చేయడం జరిగిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో శంకర్, తిరుపతి, గంగాధర్, లింగన్న కార్మికులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఖమ్మం, (జనం సాక్షి):**




ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరించేవరకు రాష్ట్ర జేఏసీ కార్యాచరణ కార్యక్రమాలను ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసీ తరపున విజయవంతం చేస్తామని ఖమ్మం జిల్లా టీజీఇజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణ మేరకు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఉద్యోగ సదస్సులో ఖమ్మం జిల్లా టీజీఇజెఏసి చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జరిగిన ఉద్యోగ సదస్సు, ఉద్యోగ ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని తెలిపారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణ మేరకు మే 15 నుండి జరిగే నిరసన కార్యక్రమాలను జూన్ 9న జరిగే రాష్ట్రస్థాయి మహా ధర్నాకు ఖమ్మం జిల్లా ఉద్యోగుల పక్షాన పూర్తిస్థాయిలో మద్దతు తెలియజేస్తామని, రాష్ట్ర జేఏసీ కార్యాచరణను విజయవంతం చేస్తామని అన్నారు. ఖమ్మం జిల్లా టీజీఇజెఏసి కన్వీనర్ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారిలో ఉన్న అసంతృప్తి, ఆవేదన ఖమ్మం

జిల్లా ఉద్యోగుల సదస్సులో బహిర్గతమైందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, వాసిరెడ్డి శ్రీనివాస్ , డాక్టర్. పి. విజయ్ కుమార్ సూరంపల్లి రాంబాబు, గోపాలకృష్ణ బుర్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడు స్ఫూర్తి



## వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

**వరంగల్ ప్రతినిధి, మే 4 (జనంసాక్షి)**

లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ నీటిని దివి నుంచి భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని అన్నారు. ఆయన్ను స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదా యకమన్నారు. మహనీ యుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవా లని సూచించారు. మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సంక ల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను నిర్వహించేలా ఆదేశాలు

ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా అధికారులు బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల అవినీతిపై విచారణ చేయాలి

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**ఉమ్మడి మెదక్ జిల్లా (జనంసాక్షి) :**



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పోలీసుల అవినీతి పై విచారణ జరపాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసుల వైఖరి పై విమర్శలు చేశాడు. దుబ్బాక నియోజకవర్గంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందనీ, దుబ్బాక ఎస్ఐ పై లంచాలు తీసుకుంటు న్నారంటూ ఫిర్యాదు భయంకరంగా వస్తున్నాయని అన్నారు. మిరుదొడ్డి ఎస్ఐ సైతం హెూంగార్డు ద్వారా డబ్బులు తీసుకుని వేరే దగ్గర ఉంచాడంటూ వార్తలు వచ్చాయని అన్నారు. డబ్బుల డిమాండ్ ఆరోపణల్లో ఎస్ఐ పాత్ర ఉంటే హెూంగార్డును బలిపశువు చేయరని అన్నారు. ఎస్ఐలు లంచం తీసుకుని కిందిస్థాయి కానిస్టేబుళ్లను, హెూంగార్డ్స్ ను బలి చేయడం దారుణమని అన్నారు. ఏ గ్రామంలో చూసిన బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, యువకులు గ్రామాలలో మద్యం సేవించి బైకులపై పడి చనిపోతున్నారు. వాళ్ళ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా పోలీసులు, ఎక్సైజ్ శాఖ వారు బెల్టు షాపుల నుండి మామూలు తీసుకుంటున్నారని అన్నారు. దుబ్బాకలో పోలీసులు విచ్చలవిడిగా లంచాలు తీసుకుంటున్నారనీ, లంచాలు తీసుకోవడం మానేయాలి, అధికారులు వైఖరి సమాజానికి మంచిది కాదని ఘాటు విమర్శలు చేశారు. సిద్దిపేట సిపికి పోలీసుల వ్యవహారం పై ఎమ్మెల్యేలు కంప్లైంట్ చేసిన పట్టించుకోవడం లేదని, దుబ్బాక, మిరుదొడ్డి ఎస్ఐలపై కచ్చితంగా దర్యాప్తు జరిపించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ వాళ్ళకేనా ఇందిరమ్మ ఇల్లు**

అర్హులకు అందాల్సిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు అర్హులైన వారికే ఇస్తున్నామని,అనర్హులకు ఇస్తే రద్దు చేస్తామన్న మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు కోటలు దుంకుతున్నాయని, చేతల్లో వైఫల్యం చెందారన్నారు. కాంగ్రెస్ నాయకులతో కూడిన ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడమే అవినీతి, ఆశ్రిత పక్షపాతంకు ఆస్కారం ఏర్పడిందన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు.

# గాలి దుమారానికి కూలిన టోల్ గేట్ పైకప్పు

**సిద్దిపేట బ్యూరో, మే4 (జనంసాక్షి) :**





సిద్దిపేట జిల్లాలో రాత్రి గాలి దుమారం బీభత్సం సృష్టించింది. భారీ ఈదురు గాలులకు, గాలి దూమరానికి రాజీవ్ రహదారిపై ఉన్న దుద్దేడ టోల్ గెట్ పై కప్పులు ఎగిరిపోయినవి. వాహనాలపై ఎగిరిపడ్డ రేకులు విధ్వంసం సృష్టించడంతో హైవే పైన పలు వాహనాలు ధ్వంసం ఐనవి. గాలి దుమారం వల్ల టోల్ గేట్ ప్రాంతంలో నిలిచిన వాహనదారులకు పెను ప్రమాదం తప్పినది. గాలి దుమారంకు టోల్ గేట్ సిగ్నలింగ్ టోల్ వ్యవస్థ నిలిచిపోవడంతో రాజీవ్ రహదారిపైన కిలోమీటర్లు వరకు ట్రాఫిక్ స్తంభించినది. కరెంట్ లేక, సిగ్నల్స్ పనిచేయక పోవడంతో ట్రాఫిక్ లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# రాష్ట్రంలో రెజ్లింగ్ పోటీలను బలోపేతం చేస్తాం

## తెలంగాణ క్రీడా చైర్మన్ శివసేన రెడ్డి

**హైదరాబాద్, మే4 (జనంసాక్షి)**



రాష్ట్రంలో రెజ్లింగ్ పోటీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ క్రీడా చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెజ్లింగ్ చాంపియన్షిప్ పోటీలను హైదరాబాద్ హిమాయత్ సాగర్లో నిర్వహించారు. ఇందులో అండర్ 17 కేటగిరీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువతీయువకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఫ్రీ స్టైల్, గ్రోకో రోమన్, మహిళల రెజ్లింగ్ అనే మూడు కేటగిరీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెజ్లింగ్ పోటీలకు ఎంతో ఆదరణ ఉందని తెలిపారు. తెలంగాణ ఆమెచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు వెళ్లేవారికి వన్వే ప్రయాణ ఖర్చులను భరించడానికి చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

# సమోసాలో ప్రత్యక్షమైన పురుగు

**గోదావరిఖని (జనంసాక్షి):**



స్థానిక మార్కండేయ కాలనీలోని వైష్ణవి స్వీట్ హౌజ్ లో శనివారం సాయంత్రం పీక భరత్ అనే యువకుడు సమోసా తీసుకోని చించి తినే సమయంలో పురుగు ప్రతేక్షమైంది. సమోసాలో పురుగు వచ్చింది అని వెళ్లి అడుగుతే అది ఎలా వచ్చిందో తెలియదు ఇంకో సమోసా తీసుకో అని ఇచ్చారు.రామగుండం మున్సిపల్ ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు చేపట్టాలని, ఇలాంటి స్వీట్ హౌజ్ లను సిజ్ చేయాలని భరత్ కోరారు.

# జూన్ 28న ఇంటర్నేషనల్ ఐకానిక్ టాలీవుడ్ అవార్డ్స్

**శేరిలింగంపల్లి, మే 4 (జనంసాక్షి)**

ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్స్ టాలీవుడ్ (ఐఐఏ) తొలి సీజన్ జూన్ 28న హైదరాబాద్లో జరగనుంది. ఈ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా గచ్చిబౌలిలోని ఓ స్టార్ హెూటల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టాలీవుడ్ నటుడు రవి ప్రకాష్ , బాలీవుడ్ నటి నిఖితా రావల్, దర్శకులు ప్రదీప్ మదల్లి, రాకీ సింగ్, నటుడు రేవంత్ లెవాకాతో ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్స్ వ్యవస్థాపకుడు మొహమ్మద్ లతీఫ్, చైర్మన్ ఆదిత్య ఖురానాలు కలిసి ఐఐఏ టాలీవుడ్ సీజన్ 1 పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటుడు రవి ప్రకాష్ మాట్లాడుతూ.. రివార్డులతో

పాటు కళాకారు లకు అవార్డులు కూడా ఎంతో ముఖ్యమని, మరింత ప్రోత్సాహాన్ని గుర్తింపు నిస్తాయని అన్నారు.

# వృద్ధాశ్రమంలో ఘనంగా జరిగిన నవ్వుల దినోత్సవం

## కామెడీ స్కిట్స్ తో సందడి చేసిన స్మైల్ ప్లీజ్ సభ్యులు

**గోదావరిఖని, (జనంసాక్షి)**




నేటి దైనందిన జీవితంలో మనిషి ఉద్యోగ, వ్యాపార, వ్యవహార విషయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాడని, అందుమూలంగా వయసుతో నిమిత్తం లేకుండానే బిపి, షుగర్ వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారని, అలాంటి ఒత్తిడి నివారణకు దివ్యమైన ఔషధం నవ్వేనని పలువురు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ సభ్యులు వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో 'నవ్వుల నజరానా–హాస్యవల్లరి' నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు మేజిక్ రాజా మాట్లాడుతూ కృత్రిమంగా కాసేపు నవ్వినా.. ఫీల్ గుడ్ హార్మోన్స్ బాడీలో రిలీజ్ అయ్యి.. మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, నవ్వితే హ్యాపీ.. నవ్వకపోతే బీపీ.. అని వైద్యులు సూచిస్తున్నారన్నారు. నవ్వు ప్రయోజనాలను అందరికీ తెలిపేందుకు 1998లో డాక్టర్ మదన్ కటారియా జనవరి 10న మొదటిసారిగా లాఫింగ్ యోగా పేరుతో నవ్వుల దినోత్సవం నిర్వహించారన్నారు. అనంతరం ప్రతిఏటా మే మొదటి ఆదివారం ప్రపంచవ్యాప్తంగా నవ్వుల దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల ఒత్తిడిని దూరం చేసి నవ్వులు పంచడానికి 2007, డిసెంబర్ 16న స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. నాటినుండి స్థానికంగానే కాకుండా పలు జిల్లాలలో, హైదరాబాద్, ఒంగోలు, విశాఖపట్నం ప్రాంతాల్లో సైతం నిర్వహించిన హాస్యవల్లరి కార్యక్రమాలలో పాల్గొన్నామన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో 'సరదాగా కాసేపు నవ్వుకుందాం!' వీడియో సిడిని రూపొందించామని, దూరదర్శన్ లో, పలు సినిమాలలో సైతం తమ సభ్యులు నటించారన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన పలువురు మాట్లాడుతూ నా అనేవారులేక.. ఒంటరితనంతో.. నైరాశ్యంలో ఉన్న వృద్ధులలో ఆనందం నింపడానికి స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ తమ కార్యక్రమానికి ఈ వృద్ధాశ్రమాన్ని వేదికగా చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం క్లబ్ సభ్యులను జరీ కండువాలతో సత్కరించి అభినందించారు. కాగా ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మేజిక్ రాజా, చంద్రపాల్, హరి ప్రదర్శించిన పలు కామెడీ స్కిట్ లు, మేజిక్ రాజా మాట్లాడే బొమ్మ, హరి ఇంద్రజాల ప్రదర్శన వృద్ధులను విశేషంగా ఆకట్టుకుంది. తమ వయస్సును సైతం మర్చిపోయిన వృద్ధులు నవ్వులు, కేరింతలతో చప్పట్లు కొట్టారు. ఆనందంగా గడిపారు. స్పందించిన ఆశ్రమవాసి సకినాల రాజమౌళి సైతం తన జోక్స్ తో అలరించారు. కార్యక్రమ అనంతరం క్లబ్ సభ్యులు వృద్ధులకు మధ్యాహ్న భోజనం అందించడంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్ ప్లీజ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేజిక్ రాజా, చంద్రపాల్, సభ్యులు, పాత్రికేయులు దయానంద్ గాంధీ, పొన్నం విజయ్ కుమార్ గౌడ్, మేజిక్ హరి, మొగరం గట్టయ్య, వై.లెనిన్, ఆశ్రమ నిర్వాహకులు పీటి స్వామి, గంట సత్తయ్య, జాకా సత్యనారాయణ, కోటగిరి శ్రీనివాస రావు, బట్టల వెంకట్ గౌడ్, సీతారాం రెడ్డి, జై హింద్ తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలోనే ఏపీకి అక్రమ నీటి తరలింపు

- మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మిర్యాలగూడ, మే 4 (జనం సాక్షి) :** కృష్ణా జలాల్లో బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీల నీటిని కేటాయిస్తే అందులో 593 టీఎంసీల నీటిని ఏపీ వాడుకునే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 ఏపీకి అనుకూలంగా వ్యవహరించి అక్రమ నీటి తరలింపులో ఆ ప్రభుత్వంలోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని జనాభా ప్రాతిపదికన కృష్ణ జలాల వాటా అధిక శాతం తెలంగాణకే కావాలని బ్రిజేష్ కుమార్ కమిటీ ట్రిబ్యునల్ ఎదుట కొట్లాడుతున్నామని ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని ఎన్నీ కన్వెన్షన్ హాల్లో ... ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇరిగేషన్ శాఖలో చేపడుతున్న పనుల పురోగతి, ధాన్యం సేకరణ పై ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట డిండి, ఎస్ ఎల్ బీసీ ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందన్నారు. 2014లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదలైన ప్రాజెక్టులకు నిధులను కేటాయించకుండా రూ. 94 వేల కోట్లతో కాళేశ్వరం నిర్మించడం ఆ ప్రాజెక్టు నిర్మాణంలో సైతం అవినీతి అక్రమాలతో పాటు అసమర్ధ పనుల మూలంగా రైతులకు ఉపయోగపడకుండా ఉందన్నారు. గడచిన పదేళ్లలో నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టును సైతం నిర్లక్ష్యం చేయడంతో... డ్యాంలో షిల్ట్ చేరి నీటి నిలువ సామర్థ్యం తగ్గిందన్నారు. నాగార్జున సాగర్ పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహా రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల పూర్తికి ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం రూ. 23 వేల కోట్లను కేటాయించిందని చెప్పారు. ఎస్ఎల్ బీసీ పనులను జాతీయస్థాయిలో నిపుణుల కమిటీని వేసి వేగంగా కంప్లీట్ చేస్తామని చెప్పారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు కు భూ సేకరణ చేపట్టి పనులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్ ప్రస్తుత యాసంగి సీజన్ లలో సుమారు 1 కోటి 21 లక్షల ఎకరాలలో వరి సాగు చేసి 2.80 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డు స్థాయి దిగుబడిని సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వం రూ. 13 వేల కోట్లు ఖర్చు చేసి 3.10 కోట్ల మందికి బియ్యం ఇస్తోందన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ దృష్టికి తెచ్చిన లిఫ్ట్ ఇరిగేషన్, ఇతర సాగునీటి పనులను సత్వరం పూర్తి చేసేందుకు అధికారులను సమాయత్తం చేస్తామని చెప్పారు. అనంతరం ఆర్ అండ్ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 17 నెలల్లో పెండింగ్ లో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి పనులను వేగవంతం చేసినట్టు చెప్పారు. ప్రభుత్వానికి భారమైనప్పటికీ పేద ప్రజలకు కడుపు నింపాలన లక్ష్యంతో సన్న బియ్యం స్కీం ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీ మొదటి శత్రువు అని చెప్పటం ఆ పార్టీ అనైతిక విధానాలకు నిదర్శనమన్నారు. అనంతరం శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల రిపేర్లు, అదేవిధంగా ఎస్ఎల్బీసీ నిర్మాణ పనుల్లో మార్పులపై గౌరవ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోకస్ చేయాలని కోరారు. ఖమ్మం మీదుగా తెలంగాణ ప్రాంతానికి సన్న బియ్యం తరలించి ఇక్కడ ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను కాజేసేందుకు చేస్తున్న విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అక్రమ ధాన్యం తరలింపు ను కట్టడి చేయాలని కోరారు. ఈ సమీక్షలో మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్ రెడ్డి, బాలు నాయక్, రాజగోపాల్ రెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం... సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతి, అవసరమైన అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.. ఈ సమావేశంలో రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ లు శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్లగొండ జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, ఇంజనీర్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆర్డీవోలు తదితరులు హాజరయ్యారు.

## సామ్యాతండాలో పురుగుమందు డబ్బాతో నిరసన



**కారేపల్లి, మే 4 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల తొలి జాబితాపై కారేపల్లి మండలంలో అగ్రహావేషాలు వ్యక్తం అవుతున్నాయి. ఇండ్ల మంజూరు జాబితాలో అసలైన నిరుపేదలను విస్మరించి పెద్దలు, గ్రామానికి చుట్టచూపుగా వచ్చే పోయే వారికి ఇండ్లు మంజూరైనాయని జాబితాలో పేర్లు లేని వారు ఆరోపణలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక పక్రియ ఇందిరమ్మ కమిటీ చేతికి ఇవ్వటంతో ఆరోపణల జోరు పెరిగింది. కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇండ్ల మంజూరు పైకం డిమాండ్ చేస్తున్నారనే అరోపణలు వినవస్తున్నాయి. ఇందిరమ్మ ప్రజాపాలన గ్రామసభల సందర్భంగా మండలంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితా పై కూడా అనేక ఆరోపణలు వచ్చాయి. రేకుల ఇండ్లు, కిరాయికి ఉంటున్న వారికి ఇండ్లు రాలేదని, పక్కా ఇండ్లు ఉన్నవారు గొడ్ల కొట్టం వద్ద దిగిన వారికి ఇండ్లు మంజూరైనాయని విమర్శలు ఉన్నాయి. అట్టి జాబితా మానవ నిమిత్తం లేకుండా సాఫ్ట్‌వేర్ ద్వారా జరిగిందని అధికారులు సర్ధిచెప్పారు. తీరా తుది జాబితాలో సైతం అర్హులను విస్మరించారని అగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. భాగ్యనగర్‌తండా, పాటిమీదిగుంపు పంచాయతీలో ఇండ్లు ఉన్నవారికి, డబ్బులు ఇచ్చిన వారికే జాబితాలో చోటుదక్కిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇండ్లు కాలి తడికలు కట్టుకొని రేకుల నీడలో ఉంటున్న తమకు అన్యాయం జరిగిందంటూ బాగ్యనగర్‌తండా కు చెందిన బాధితులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. తమకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ న్యాయం చేయకపోతే పురుగుమందు త్రాగి చస్తామంటూ బానోత్ నందిని, గుగులోత్ సునిత, గుగులోక్ కైకా, బానోత్ కాంతి, గుగులోత్ లలిత, పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు.

## చేర్యాలలో రాకపోకలకు అంతరాయం



**చేర్యాల, మే 4 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి చేర్యాల–ఆకునూరు రోడ్డుకు భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న దాన్యం తడిసి ముద్దయింది. ఆకునూరు వైపు వెళ్లే రోడ్డుకు పడిన వృక్షాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, గ్రామ యువకులు బరిగె వేణు, సూర కృష్ణ,ఏళ్ల సూర్యకాంత్, పందిళ్ళ నర్సింహులు గ్రామ యువకులు తొలగించారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

## నేటి నుంచి మోడల్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు




**కారేపల్లి, మే 4 (జనంసాక్షి) :** తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు మే 5వతేది నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఈ ప్రేమ్‌కుమార్ తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్ధులు ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 25 లోపు హెచ్‌టీటీపీ://183.82.97.97/ఎంఎస్‌టీజీ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మోడల్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ లలో 40 సీట్ల చొప్పున సీట్లు మొత్తం 120 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## రహదారిపై పడ్డ చెట్ల తొలగింపు



**కారేపల్లి, మే 4 (జనంసాక్షి) :** కారేపల్లి మండలం ఊట్కూర్–ఎర్రబోడు మార్గంలో ఇటివల వీటిన ఈదురు గాలులకు ప్లాంటేషన్ చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో ఆ మార్గంలో వాహన రాక పోకలు నిలిచాయి. వాహనదారులు వయా ముత్యాలగూడెం. కొమ్ముగూడెం గ్రామాల మీదిగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన రహదారికి పడిన చెట్లు అడ్డుగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు గాదెపాడు బస్‌ను నిలుపుదల చేశారు. దీంతో వారం రోజులుగా ఖమ్మం – ఊట్కూర్– ఎర్రబోడు–గాదెపాడు బస్ నడవటం లేదు. నిత్యం ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే దీంతో 10 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకోని ఎర్రబోడు గ్రామపంచాయతీ వారు ఊట్కూర్–ఎర్రబోడు మధ్య రోడ్డుపై పడిన చెట్లను ఆదివారం తొలగించారు. దీంతో ఆమార్గంలో ఆటంకాలు తొలగిపోయాయి. అర్టీసీ అధికారులు వెంటనే గాదెపాడు బస్‌ను పునరుద్దించాలని కోరుతున్నారు.

# కంకోల్ ఈద్గాను కూల్చేసిన దుండగులు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎంఐఎం హైదరాబాద్ ఎమ్మెల్సీ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా, మునిపల్లి మండలం, కంకోల్ గ్రామ శివారులోని ఈద్గాను గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి తర్వాత జెసిబి తో కూల్చి వేశారు. గత వందల సంవత్సరాల నుంచి కంకల్ గ్రామస్తులు పండగ నమాజు చేస్తున్నారు. ఇటీవల లక్షల రూపాయాలు ఖర్చు చేసి ఎర్ర రాయితో నిర్మించిన ఈద్గాను దుండగులు కూల్చడం దారుణమని ముస్లీం సంఘాలు మండిపడ్డాయి. సంఘటనకు సంబంధించి ఎంఐఎం పార్టీ హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ఖ్యాద్రి , జిల్లా అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్ , మల్లేపల్లి కార్పొరేటర్ జఫర్ ఖాన్ సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ కు ఫిర్యాదు చేశారు. ఈద్గాలు కూల్చివేసిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# అల్వాల్‌లో వృద్ధ దంపతుల హత్య

- బంగారం, నగదు చోరీ పాత కక్షా..?
- ఆర్థిక లావాదేవీలా కారణమా..?
- మిస్టరీగా మారిన జంట హత్య



అల్వాల్, మే 4 (జనంసాక్షి) : హైదరాబాద్ నగర శివారులోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతుల హత్య ఘటన కలకలం రేపింది. సూర్యనగర్ కాలనీలో నివసిస్తున్న కనకయ్య (70), రాజమ్మ (65) అనే వృద్ధ దంపతులను శనివారం అర్ధరాత్రి దుండగులు దారుణంగా హత్య చేశారు. వీరిద్దరూ నిర్మాణ ప్రాంతాల్లో వాచ్‌మెన్లుగా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం సమాచారం అందిన వెంటనే అల్వాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దంపతులు పడుకున్న మంచంపైనే మృతిచెందగా, వారి శరీరాలపై గాయాలుండటంతో దుడ్డు కర్రలతో హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి పోలీసులు పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ అర కిలోమీటర్ దూరంలో ఆగిపోవడంతో అనేక అనుమానాలు తలెత్తాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో బంగారం, వెండి, సుమారు లక్ష రూపాయల నగదు మాయం కావడంతో పాటు మృతుల ఒంటి పై గాయాలు కావడం చోరీకోసం జరిగిన హత్యగా పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. హత్యకు పాత కక్షా? లేక ఆర్థిక లావాదేవీల కారణమా? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో సూర్యనగర్ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు గ్రామానికి చెందినవారు. మూడేళ్ల క్రితం ఉద్యోగరీత్యా అల్వాల్‌కి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఘటన స్థలానికి అల్వాల్ సీఐ రాహుల్ దేవ్, సికింద్రాబాద్ డీసీపీ సురేష్ కుమార్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఏసీపీ రాములు,అడిషనల్ డీసీపీ లు కూడా సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు ఛేదనకు ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- మృతుడు మధిర మండలం వాసిగా గుర్తింపు



**చింతకాని, మే 4 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలో ఖమ్మం నుండి బోనకల్ వెళ్లే ప్రధాన రహదారిలో తిరుమలపురం సమీపంలో ఆర్టీసీ బస్సు కారు ఢీ కొట్టి వ్యక్తి మృతి చెంది, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధిర మండలం ములుగుమాడు గ్రామానికి చెందిన పసుపులేటి వెంకట సాయి బ్రహ్మం అనే వ్యక్తి అక్కడకే మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తితో పాటు కారులో ఉన్న ఏపూరి. శబరిస్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు ఖమ్మం నుండి మధిర వెళుచుండగా అతివేగంతో వచ్చి బస్సు నుండి కొట్టారని స్థానికులు తెలిపారు. బస్సుని ఢీకొట్టడంతో బస్సు కూడా దగ్గర్లో ఉన్న బావి అంచుల దగ్గరికి వెళ్లి ఆగిపోవడంతో ప్రమాదం తప్పిందని అన్నారు. లేకపోతే బస్సులో ఉన్న వారందరూ కూడా చనిపోవడం జరిగేదే అని అని భయభ్రాంతులకు గురయ్యారు అన్నారు. గాయలపాయలైన వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. చింతకాని ఎస్ఐ షేక్ నాగులమేరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# తుది దశకు మురుగునీటి శుద్ధి కేంద్రాలు

- ఎస్టీపీల నుంచి దుర్వాసన కట్టడికి సాంకేతికత వినియోగం
- జూన్ నాటికీ పూర్తి చెయ్యడానికి కసరత్తు
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** ఎస్టీపీల నిర్మాణ ప్రాజెక్టు ప్యాకేజ్–1లో భాగంగా అంబర్ పేట్ లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను రాష్ట ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు సందర్శించారు. ఇటీవల భాద్యతలు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్ నగరంలో పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పథకాలతో పాటు జలమండలి నిర్మిస్తున్న ఎస్టీపీ పనుల పురోగతిని పరిశీలించారు. మొదటగా పిటియూ(ప్రైమరీ ట్రీట్మెంట్ యూనిట్)ను సందర్శించిన రాష్ట ప్రధాన కార్యదర్శి.. ఐఎన్‌డీ, స్ప్లిట్టర్ బాక్స్, కనెక్టింగ్ చానెల్స్ ఎస్బిఆర్ బేసిన్స్, సిసిటి తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దానికి.. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మురుగు శుద్ధి ప్రక్రియ, వివిధ దశలు వివరిస్తూ.. జూన్ లో ఎస్టీపీ పనులను వేగంగా పూర్తి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఈ ఎస్టీపీ ప్రాజెక్టు పూర్తి చేస్తే దేశంలో 98 శాతం సీవరేజి ట్రీట్‌మెంట్ చేస్తున్న ఏకైక నగరంగా హైదరాబాద్ నిలవనుందని తెలియజేసారు. జీహెచ్ఎంసీలోనే కాకుండా ఓఆర్ఆర్ పరిధిలో అమృత్ 2.0 ప్రాజెక్టు భాగంగా మరో 39 ఎస్టీపీలను నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికల సిద్ధం చేశామని.. ప్రస్తుతం టెండర్ దశలో ఉందని ఈ సందర్భంగా అశోక్ రెడ్డి సీఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ రామ కృష్ణ రావు.. ఎస్టీపీల్లో వెలువడే దుర్వాసన వాళ్ళ ప్రజలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలి సూచించారు. నివాసాల సమీపంలో ఉన్న ఎస్టీపీల చుట్టూ నివసించే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏస్టీపీ నుంచి దుర్వాసన రాకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అశోక్ రెడ్డి చెప్పారు. దీనికోసం విదేశీ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

# రాజ్యాంగబద్ధ నిర్ణయాలను స్వాగతిద్దాం

- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



**హుజూర్‌నగర్, మే 4 (జనంసాక్షి) :** భారత ప్రభుత్వం తీసుకునే రాజ్యాంగబద్ధం నిర్ణయాలను స్వాగతిద్దామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యవస్థను నష్టపరిచే భావజాలాన్ని వామపక్ష పార్టీ సమర్థించదన్నారు. ఉగ్రవాద దాడులను అన్ని పక్షాల లాగానే మానవతా వాదానికి వ్యతిరేకమైన హింసను ఖండిస్తున్నట్లు తెలిపారు. తుపాకుల ద్వారానే చరిత్ర మారుతుందనే సిద్ధాంతానికి మేము వ్యతిరేకం అన్నారు. ప్రతి విషయానికి చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని సిపిఐ నమ్ముతుందన్నారు. కర్రే గుట్ట ఆపరేషన్ ను వెంటనే నిలుపుదల చేయాలని, అక్కడున్న మావోయిస్టులతో శాంతియుతంగా చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వం ఎన్ కౌంటర్లను నివారించాలని కోరారు. ఈ సమయంలో మావోయిస్టుల కూడా చట్టపరంగా ఉద్యమాలు చేసి ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిద్దామని పిలుపునిస్తున్నట్లు తెలిపారు. భారత్, పాకిస్తాన్ల మధ్య ఉన్నది హిందూ ముస్లింల సమస్య కాదని, ఉగ్రవాద సమస్యను అలా చూడవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, ఎన్నికల హామీలను సక్రమంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్ నాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డ వెంకటయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, యల్లావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## • బెర్క్‌షైర్ హాత్‌వేను వీడనున్న బఫెట్

**జనంసాక్షి:**ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈవో పదవిని త్వరలో వీడనున్నారు. ఈ మేరకు ఆయన తన రిటైర్మెంట్ ప్రణాళికలను ప్రకటించారు. 2025 చివరి నాటికి ఆ పదవి నుంచి వైదొలుగుతానని శనివారం జరిగిన వార్షిక వాటాదారుల సమావేశంలో వెల్లడించారు. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని, గ్రెగ్ అబెల్ (%+తీవస్త్రాూఎవశ్రీ%) కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తారని ప్రకటించారు. పదవీ విరమణ, గ్రెగ్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించాలనే నిర్ణయాలు తన కుటుంసభ్యులకు తప్ప.. గ్రెగ్‌కు కూడా తెలియవని బఫెట్ పేర్కొన్నారు.బెర్క్‌షైర్ హాత్‌వేను నడిపించడానికి అబెల్ సరిపోతారని చాలా మంది పెట్టుబడిదారులు నమ్ముతున్నప్పటికీ.. అతడు పెట్టుబడులను ఎలా డీల్ చేయగలడనే అనుమానాలను పలువురు లేవనెత్తారు. అయితే అతడి పనితీరుపై తనకు నమ్మకం ఉందని.. తన సంపదను కంపెనీలో పెట్టుబడిగా ఉంచుతానని బఫెట్ హామీ ఇచ్చారు. తాను సీఈవోగా ఉన్నప్పటి కంటే గ్రెగ్ నేతృత్వంలో బెర్క్‌షైర్‌లో అవకాశాలు మెరుగ్గా ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు.

## • సేయా ఇండస్ట్రీస్ ఉన్నతాధికారులపై సెబీ కొరడా

**న్యూఢిల్లీ:**మహారాష్ట్రలోని స్పెషాలిటీ రసాయనాల తయారీ సంస్థ సేయా ఇండస్ట్రీస్‌కు చెందిన నలుగురు ఉన్నతాధికారులపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రూ.58.50 కోట్ల జరిమానా విధించింది. వీరిలో ప్రమోటరు- ఛైర్‌పర్సన్ అశోక్ రజని, ఆయన కుమారుడు అమ్రిత్ రజని (కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి) కూడా ఉన్నారు. నిధులను దారి మళ్లించడం, ఆర్థిక నివేదికలను తారుమారు చేయడం వంటి ఆరోపణలు వీరు ఎదుర్కొంటున్నారు. అశోక్, అమ్రిత్‌లపై చెరో రూ.28 కోట్లు, అసిత్ కుమార్ భౌమిక్ (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)పై రూ.2 కోట్లు, శివప్రసాద రావు బుడ్డి (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)పై రూ.50 లక్షలు జరిమానా విధించినట్లు సెబీ ఉత్తర్వులు జారీ చేసింది. సేయా ఇండస్ట్రీస్ నుంచి 2018-19, 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో సుమారు రూ.81.26 కోట్ల నిధులను ప్రమోటరు సంస్థల (విజ్ ఎంటర్‌ప్రైజెస్, అనీకా యూనివర్సల్, శ్రీ బాలాజీ ఎంటర్‌టైన్‌మెంట్స్)కు దారి మళ్లించినట్లు సెబీ గుర్తించింది.

## • క్రెటా జోరు

### ఏప్రిల్‌లో అమ్మకాలు 17,016

గురుగ్రామ్: ఈ ఏడాది ఏప్రిల్‌లో దేశంలో అత్యధికంగా విక్రయమైన ఎస్‌యూవీగా తమ క్రెటా నిలిచిందని హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) తెలిపింది. 17,016 క్రెటా వాహనాలు ఏప్రిల్‌లోనే విక్రయించినట్లు వెల్లడించింది. 2024 ఏప్రిల్ విక్రయాలతో పోలిస్తే, ఈ సంఖ్య 10.2% అధికం. ఈ ఏడాది జనవరి - ఏప్రిల్‌లో కలిపి మొత్తం 69,914 క్రెటా వాహనాలు విక్రయమయ్యాయని పేర్కొంది. దేశీయంగా తమ విక్రయాల్లో ఎస్‌యూవీల వాటాయే 70.9 శాతమని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ వివరించారు. గత దశాబ్దకాలంలో మొత్తం 12 లక్షల క్రెటా వాహనాలు విక్రయించినట్లు తెలిపారు.


# డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల ఆదాయం అంతంతే..

• చాలా కొద్దిమంది మాత్రమే సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందుతున్నారు

• తాజా నివేదికలో కీలక వివరాలు



ప్రస్తుతం భారత్‌లో కంటెంట్ క్రియేటర్ల హవా నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా వీరిని రకరకాల కార్యక్రమాలతో ప్రోత్సహిస్తోంది. అనేక మంది యూట్యూబ్, ఇన్‌స్టా వంటి వేదికల ద్వారా డబ్బు సంపాదించడానికి ఉవ్విళ్లూరుతూ ఈ రంగంలో కాలుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత కంటెంట్ క్రియేటర్ల సంపాదనపై బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఓ నివేదిక విడుదల చేసింది.ఈ నివేదిక ప్రకారం, భారత్‌లో సుమారు 2.5 మంది డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు నిత్యం వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే వీరిలో కేవలం 8 నుంచి 10 శాతం మంది మాత్రమే తమ కంటెంట్‌ను సరిగ్గా మానెటైజ్ చేసుకుని ఆదాయం పొందగలుగుతున్నారు. మిగతా అందరూ చాలా స్వల్పస్థాయిలో ఆదాయం పొందుతున్నారు. కొందరికి రిక్తహస్తాలే మిగులుతు న్నాయి.కంటెంట్ క్రియేటర్లు ఎక్కువైపోవడమే ఈ పరిస్థితికి కారణం. వ్యూవర్స్‌ను ఆకర్షించేందుకు మిలియన్ల కొద్దీ కంటెంట్ క్రియేటర్లు ప్రయత్నిస్తున్నా కొందరు మాత్రమే సుస్థిర ఆదాయాన్ని పొందగలుగుతున్నారు. చాలా మందికి యాడ్‌లు, బ్రాండ్ స్పాన్సర్‌షిప్స్‌యే ప్రధాన ఆదాయ మార్గాలు. కానీ ఇవి టాప్ కంటెంట్ క్రియేటర్లకు ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి.కంటెంట్ క్రియేటర్ల మధ్య ఆదాయంలో తేడాలు కూడా భారీగా ఉంటున్నాయి. అధికశాతం కంటెంట్ క్రియేటర్లు ప్రస్తుతం నెలకు రూ.18 వేలు సంపాదిస్తున్నారు. చిన్న స్థాయి కంటెంట్ క్రియేటర్ల వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ3.8 లక్షలు. ఇక మిలియన్ మంది కంటే ఎక్కువ సబ్‌స్క్రైబర్లు ఉన్న వారు వీక్షకులను బాగా ఆకట్టుకుంటున్నారు. తమ కంటెంట్‌తో జనాలను కట్టిపడేస్తూ బ్రాండ్ అండార్స్‌మెంట్స్, ఇతర మార్గాల్లో నెలకు రూ.50 వేల కంటే ఎక్కువే సంపాదిస్తున్నారు. కానీ ఇలాంటి కంటెంట్ క్రియేటర్ల సంఖ్య చాలా తక్కువ. భారత్‌లో ప్రతి 1000 వ్యూస్‌కు యాడ్ ద్వారా వచ్చే ఆదాయం రూ.50 నుంచి రూ.200 మధ్య ఉంటోంది. అంటే లక్ష వ్యూస్ వచ్చినా కూడా ఆదాయం మాత్రం రూ.5500 నుంచి రూ.20 వేల మధ్యే ఉంటున్నట్టు నివేదికలో తేలింది .లైవ్ కామర్స్, వర్చువల్ గిఫ్టింగ్, సబ్‌స్క్రిప్షన్స్, అఫిలియేట్ మార్కెటింగ్ వంటివి మానెటైజేషన్ వ్యవస్థలో కొత్త మార్పులు తెస్తున్నట్టు కూడా బీసీజీ నివేదిక పేర్కొంది. యూట్యూబ్ లైవ్, మోజ్, షేర్‌చాట్ వంటివి క్రియేటర్లు ఫ్యాన్సు నుంచి టిప్స్ రూపంలో డబ్బులు పొందే అవకాశం కూడా కల్పిస్తున్నాయని బీసీజీ తెలిపింది. ప్రస్తుతం ఫ్యాషన్, బ్యూటీ, ఫుడ్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలకు వీక్షకులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఫైనాన్స్, విద్య, టెక్ రంగాలు.. టైర్ 2, టైర్ 3 నగరాల్లో పాప్యులర్ అవుతున్నాయి. భారత కంటెంట్ కారణంగా వినియోగదారులు సుమారు 350 నుంచి 400 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారని కూడా నివేదిక వెల్లడించింది. ఈ మొత్తం 2023 కల్లా 1 ట్రిలియన్ డాలర్లు చేరుకుంటుందని అంచనా వేసింది.ఇంతటి వ్యాపారం జరుగుతున్నా కంటెంట్ క్రియేటర్లకు మాత్రం కేవలం 20 నుంచి 25 బిలియన్లు మాత్రమే దక్కుతున్నాయి. వచ్చే పదేళ్లల్లో ఈ మొత్తం ఐదు రెట్లు కానుందని ఓ అంచనా. కంటెంట్ క్రియేషన్‌ను ఆదాయవనరుగా మార్చుకోవాలంటే కేవలం వ్యూస్ మాత్రమే టార్గెట్ చేయకుండా తమ వెంటే నడిచే నమ్మకమైన సబ్‌స్క్రైబర్లు, ఫాలోవర్లను పెంచుకోవాలి. కేవలం యాడ్స్ ఆదాయంపైనే ఆధారపడకుండా, ఇతర మార్గాలా ద్వారా ఆదాయం పెంచుకోవాలని నివేదిక సూచించింది.




## ప్రముఖ బ్యాంకులపై ఆర్బీఐ భారీ ఫైన్..

**జనంసాక్షి:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల సంచలన నిర్ణ యం తీసుకుంది. దేశంలోని ఐదు ప్రముఖ బ్యాంకులపై భారీ జరిమానాలు విధించింది. ఈ బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉన్నాయి. ఈ ఐదు బ్యాంకులపై మొత్తం రూ.2.52 కోట్లకు పైగా జరిమానా పడింది. సైబర్ సెక్యూరిటీ, %ఖ్జ%, కస్టమర్ సర్వీస్ వంటి అంశాల్లో ఈ బ్యాంకులు నియమాలను ఉల్లంఘించిన క్రమంలో ఆర్బీఐ ఫైన్ వేసింది. ఈ క్రమంలో బ్యాంకులు నియమాలను సరిగ్గా పాటించని విషయాలపై ఆర్బీఐ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూనే ఉంది. ఈ బ్యాంకుపై రూ. 97.80 లక్షల జరిమానా విధించారు. సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్, నిబంధనలు, క్రెడిట్/డెబిట్ కార్డ్ జారీలో నియమాలను పాటించలేదని గుర్తించింది. ఈ లోపాలు కస్టమర్ల డేటా భద్రతను ప్రభావితం చేస్తాయని తెలిపింది. బ్యాంక్ ఆఫ్ బరోడా: ఈ బ్యాంకుకు రూ. 61.40 లక్షల జరిమానా పడింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, కస్టమర్ సర్వీస్ నిబంధనలను అనుసరించలేదని తెలిపింది. ఈ క్రమంలో కస్టమర్లకు అందించే సేవల్లో లోపాలు ఉన్నాయని గమనించారు. బ్యాంకుపై రూ. 31.80 లక్షల జరిమానా విధించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా వ్యవసాయ రుణాలకు సంబంధించిన వడ్డీ సబ్సిడీ స్కీమ్ నిబంధనలను పాటించలేదని గుర్తించింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: ఈ బ్యాంకుపై కూడా రూ. 31.80 లక్షల జరిమానా పడింది. నిబంధనలను సరిగ్గా అమలు చేయ లేదని తెలిపింది. యాక్సిస్ బ్యాంక్: యాక్సిస్ బ్యాంకుపై రూ. 29.60 లక్షల జరిమానా విధించారు. అంతర్గత/ కార్యాలయ ఖాతాలను అనధికారికంగా నిర్వహించినట్లు గమనించింది. బ్యాంకులపై జరిమానాలు విధించడం అనేది కేవలం శిక్షణ కోసం మాత్రమే కాదు. ఇది బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత, భద్రత, కస్టమర్ హక్కులను కాపాడేందుకు చేసే ప్రయత్నమని చెప్పవచ్చు.

## రూ.7 వేలు పెరిగిన వెండి..

దేశంలో గత కొన్ని రోజులుగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలకు బ్రేక్ పడింది. ఆదివారం (మే 4, 2025న) రోజు వీటి ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే గత వారం రోజుల్లో వీటి ధరలు తగ్గాయా లేదా పెరిగాయా, తగ్గితే ఎంత తగ్గాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.ప్రస్తుతం వీటి ధరలు ఉదయం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 95,551గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 87,541 ఉంది. ఇదే సమయంలో గత వారం అంటే ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,210 కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.90,010గా ఉంది. అంటే గత వారం రోజుల్లో వీటి ధరలు రూ.270 తగ్గాయి. ఇక వెండి విషయానికి వస్తే గత వారం రోజుల్లో భారీగా పెరగడం విశేషం. అంటే మే 4, 2025న హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,09,000గా ఉండగా, గత వారం ఏప్రిల్ 27, 2025న కేజీ వెండి ధర రూ.1,01,900గా ఉంది. ఈ క్రమంలో వారం రోజుల్లో ఏకంగా రూ.7100 పెరిగింది. ఈ నేపథ్యంలో బంగారం ధరతో పోలిస్తే వెండి రేటులో పెద్ద ఎత్తున మార్పు వచ్చింది. అంతేకాదు వెండి ధరలు భవిష్యత్తులో పెరుగుతాయని నిపుణులు హెచ్చరించడంతో అనేక మంది బంగారం కంటే ఎక్కువగా వెండిపై పెట్టుబడులు చేశారు. దీంతో వీటి ధరలు గోల్డ్ రేట్లను బీట్ చేశాయి. బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువ, భౌగోళిక, రాజకీయ పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లపై ఆధారపడతాయి. గత కొన్ని రోజుల్లో అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, డాలర్ విలువలో మార్పులు, డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా, డాలర్ బలపడటం వంటి పలు రకాల అంశాలు ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి.రేట్లు భారీగా ఉన్నప్పటికీ అక్షయ తృతీయ సందర్భంగా భారతదేశంలో బంగారం కొనుగోళ్లు భారీగా జరిగాయి.



# నా తప్పేమీ లేదు

• మోదీయే న్యాయం చేయాలి!

• పాక్ మహిళతో పెళ్లిపై జవాను ఆవేదన

దిల్లీ: పాకిస్థానీ మహిళను పెళ్లాడిన విషయాన్ని రహస్యంగా ఉంచడమే కాకుండా.. వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచిన మునీర్ అహ్మద్ అనే జవాన్‌ను సీఆర్పీఎఫ్ అధికారులు ఉద్యోగం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. ఉద్వాసనకు గురైన అతడు.. తాజాగా జాతీయ మీడియాతో మాట్లాడాడు. పాక్ మహిళను పెళ్లి చేసుకున్నట్లు అధికారులకు చెప్పలేదనడంలో వాస్తవం లేదని అన్నాడు. తన తప్పేమీ లేదని, కావాలనే ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయాడు. ప్రధాని నరేంద్ర మోదీయే తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. " పాక్ మహిళను పెళ్లి చేసుకున్నట్లు ఇంతకు ముందే అధికారుల దృష్టికి తీసుళ్లాను. దీనికి సంబంధించి నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి" అని మీడియాకు తెలిపాడు.తనను ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలియగానే షాక్ గురయ్యానని మునీర్ అన్నాడు. అకారణంగా తనను తొలగించారని, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తానని చెప్పాడు. " 2024లో మెనల్ ఖాన్‌ను వివాహం చేసుకున్నా. ఆమెతో ప్రేమ వ్యవహారం గురించి 2022 నుంచే అధికారులకు చెబుతున్నా. ఇందులో అక్రమం ఏముంది? ఓ జవానుగా నాకు న్యాయం జరగాలి. అందుకోసం మోదీ, అమిత్‌షా దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలనుకుంటున్నా" అని మునీర్ మీడియాకు తెలిపాడు.

# ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి..

## టెల్ అవీవ్‌కు ఎయిరిండియా సర్వీసులు రద్దు

### దిల్లీ- టెల్ అవీవ్ విమానం అబుదాబీకి మళ్లింపు

దిల్లీ: ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ శివారులోని బెన్ గురియన్ విమానాశ్రయం సమీపంలో క్షిపణి దాడితో ఎయిరిండియా అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని అధికారులు అబుదాబీకి మళ్లించారు.ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం %ూ×%139 టెల్ అవీవ్‌లో ల్యాండ్ కావడానికి దాదాపు గంట ముందు ఈ దాడి జరగడంతో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విమానం తిరిగి దిల్లీకి వచ్చేస్తుందని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ అబుదాబీకి మళ్లించాలని నిర్ణయం తీసుకున్న సమయానికి ఈ విమానం జోర్డాన్ గగనతలంలో ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో టెల్ అవీవ్ నుంచి దిల్లీకి ఆదివారం రావాల్సిన ఎయిరిండియా విమానం రద్దయింది.మరోవైపు, టెల్ అవీవ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో మే 6 వరకు విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది.




వినియోగదారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ ఉద్యోగులు కస్టమర్లకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వారికి సహాయం చేస్తున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 6 మధ్య ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తామని 'ఎక్స్'లో పేర్కొంది. ఇతర సమాచారం కోసం 011-69329333, 011-69329999 నంబర్లు లేదా తమ అధికారిక వెబ్‌సైట్ సంప్రదించవచ్చని సూచించింది. యెమెన్ నుంచి హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి ఆదివారం ఉదయం బెన్ గురియన్ విమానాశ్రయం ప్రధాన టెర్మినల్ సమీపంలో కూలినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి దాడి సమీపంలో టెల్ అవీవ్ శివారులో ఉన్న విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు అలముకున్నట్లు ఉన్న వీడియో ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్షిపణి దాడి నేపథ్యంలో టెల్ అవీవ్‌లోని విమానాశ్రయానికి విమాన రాకపోకలు నిలిపివేశారు. ఈ క్షిపణి దాడిలో ఆరుగురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ.. తమపై దాడిచేసిన వారికి.. అంతకు ఏడు రెట్లు బలంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

### ఎయిర్‌హెూస్టెస్‌పై ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన.. నిందితుడిపై కేసు నమోదు

ముంబయి: దిల్లీ - శిర్డీ విమానంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇండిగో విమానంలో ఎయిర్‌హెూస్టెస్‌పై ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విమానం టాయిలెట్ వద్ద ఎయిర్ హెూస్టెస్‌ను నిందితుడు అసభ్యకరంగా తాకినట్లు పోలీసులు వెల్లడించారు. శిర్డీ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ అయిన వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తన పట్ల ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించిన తీరుపై ఎయిర్ హెూస్టెస్ క్రూ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విమానం శిర్డీలో ల్యాండ్ కాగానే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడిని రహతా పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## ఆలస్యం మిగిల్చిన ఆవేదన

• నీట్ పరీక్షకు 3 నిమిషాలు ఆలస్యం..


• కన్నీటి పర్యంతమైన విద్యార్థిని తల్లి

కరీంనగర్: నీట్ పరీక్షకు 3 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయలేకపోయింది. ఆమె తల్లి ఎంత బతిమిలాడినా పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించలేదు. తన కుమార్తెను పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఎంతగా ప్రాధేయపడినా అధికారులు అంగీకరించక పోవడంతో విద్యార్థిని తల్లి కన్నీరుమున్నీరయ్యారు. కరీంనగర్‌లోని మహిళల డిగ్రీ, పీజీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వేములవాడ నుంచి తన తల్లితో విద్యార్థిని బయల్దేరింది. 3 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకుంది. విషయాన్ని అక్కడి అధికారులకు చెప్పి బతిమిలాడినా వారు కనికరించలేదు. కూలీ పని చేసి, తన పుస్తెలతాడు పెట్టి లోన్ తీసుకొని తన కుమార్తెను లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపించానని.. ఒక మంచి హెూదాలో చూస్తానని కలలు కన్నానని.. కానీ దురదృష్టవశాత్తూ ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయని ఆ తల్లి విలపించిన తీరు కలచివేసింది.

# ప్రెస్‌మీట్‌లో బాహబాహీ

### లండన్‌లో పాక్ జర్నలిస్టుల బూతుపురాణం తన్నుకునేదాక వెళ్లిన గొడవ

లండన్: ఉన్నతస్థాయి నాయకులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహించినప్పుడు.. హాజరైన జర్నలిస్టులంతా ఎంతో హుందాగా వ్యవహరిస్తుంటారు. వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, విదేశాల్లో మీడియా సమావేశానికి హాజరైన ఇద్దరు పాక్ జర్నలిస్టులు మాత్రం.. అత్యంత దారుణంగా వ్యవహరించారు. పరస్పరం తిట్టుకుంటూ ఏకంగా బూతుపురాణం అందుకున్నారు. ఈ ఘటన లండన్‌లోని ప్రసిద్ధమైన ఓ కేఫ్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పాక్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ సెక్రెటరీ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితుడైన సల్మాన్ అక్రమ్ రాజా లండన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సఫీనా ఖాన్, అసద్ మాలిక్‌తోపాటు పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు.సఫీనా ఖాన్ పాకిస్థాన్‌కు చెందిన నియో న్యూస్ ఛానెల్‌లో పని చేస్తుండగా.. అసద్ మాలిక్, కొందరు ఇతర జర్నలిస్టులు వేర్వేరు చానళ్లలో పని చేస్తున్నారు. వీరంతా ఒక చోట చేరిన



సమయంలో సఫీనా, అసద్ మాలిక్ మధ్య వివాదం చోటు చేసుకుంది. అది క్రమంగా చినికి చినికి గాలివానలా మారింది. పరస్పరం బూతుపురాణం అందుకున్నారు. అక్కడున్న మిగతా జర్నలిస్టులు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రెస్‌మీట్ అనంతరం సఫీనా ఖాన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసద్ మాలిక్‌తోపాటు, టీవీ లండన్‌లో పని చేస్తున్న మోహసిన్ నక్వీ, హమ్ న్యూస్ రిపోర్టర్ రఫీక్ నుంచి తనకు ప్రాణహాని ఉందని పోస్టు చేశారు. లండన్ పోలీసులను కూడా ట్యాగ్ చేశారు. గతంలోనూ వీరంతా తనపై యాసిడ్ దాడి చేసేందుకు యత్నించారని అన్నారు. అయిన ప్పటికీ.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇద్దరు జర్నలిస్టుల మధ్య వాగ్వాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## భారత్‌లో ఇమ్రాన్ ఖాన్.. భుట్టో 'ఎక్స్' ఖాతాల నిలిపివేత

**జనంసాక్షి:**పహల్గాం దాడి తర్వాత పాక్‌పై భారత్ అనేక చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆ విదేశాంగశాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో ల ఎక్స్ ఖాతాలను నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఇటీవల పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ ఎక్స్ ఖాతాను భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్లు న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన 16 ఛానళ్లపై ఈ వేటు వేసింది.పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ..ఇది చాలా విషాదకర సంఘటన అని అన్నారు. కశ్మీర్ విషయంలో భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రేలాపనలు చేశారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. భిలావల్ భుట్టో సైతం ఇదే విధంగా భారత్‌పై నోరు పారేసుకున్నారు.

# సమరానికి సన్నద్ధం

## పాక్ కోసం 'ఇగ్లా'లు సిద్ధం చేసిన భారత్..!



జనంసాక్షి: సంక్షోభ సమయంలో వాడేందుకు వీలుగా భారత్ స్వల్ప శ్రేణి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా సిద్ధం చేస్తోంది. కొన్నాళ్ల క్రితమే రష్యా తయారీ ఇగ్లా-ఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకొంది. ఇవి వెరీషార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ కిందకు వస్తాయి. సైనికదళాలకు ప్రభుత్వం ఇచ్చిన ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ పవర్స్‌ను వాడి వీటిని కొనుగోలు చేశారు. వాస్తవానికి కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకొన్నాయి. ఈ క్రమంలో సంక్షోభం తలెత్తడంతో ప్రత్యర్థులకు సమాధానం ఇచ్చేందుకు వీటిని సిద్ధం చేస్తోంది. ఈ స్వల్పశ్రేణ క్షిపణులతో ఫైటర్ జెట్ ఎయిర్ క్రాఫ్టులు, ఛాపర్స్, డ్రోన్లను ధ్వంసం చేయవచ్చు.దాదాపు రూ.260 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. ముఖ్యంగా పశ్చిమ సెక్టార్లో సరిహద్దుల వద్ద వాడేందుకు ఇవి అత్యంత అనువుగా ఉంటాయి. భారత వాయుసేన అమ్ములపొదిలో కూడా ఇవి ఉన్నాయి. ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కింద ఇటీవల కాలంలో ఆయుధాల విడిభాగాలు వంటివి కూడా దిగుమతి చేసుకొంటున్నారు. దళాలను యుద్ధ సన్నద్ధతగా ఉంచడానికి ఇవి బాగా ఉపయోగపడుతన్నాయి. తాజాగా కూడా 48 లాంచర్లు, 90 ఇగ్లా-ఎస్ క్షిపణుల కోసం సైన్యం టెండర్ విడుదల చేసింది. వీటిని ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కిందే కొనుగోలు చేయనున్నాయి. వీటితోపాటు కొత్త తరం ఇగ్లాలపై కూడా దృష్టిపెట్టారు. వీటికి లేజర్ బీమ్ రైడింగ్ సామర్థ్యం కూడా ఉంది.1990 నుంచి ఇగ్లాను భారత్ సైన్యం వినియోగిస్తోంది. దేశీయంగా ఉన్న సంస్థలు వీటిల్లో మార్పుతో ఇగ్లా-ఎస్ వెర్షన్ సిద్ధం చేశాయి. పాక్ సైన్యం పలు రకాల డ్రోన్లు, యూఏవీలు వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇగ్లా-ఎస్ క్షిపణుల అవసరం భారత్‌కు ఎక్కువగా ఉండొచ్చని భావిస్తు న్నారు. వీటిలతోపాటు మన దళాలు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్‌ను కూడా మోహరించనుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
05 మే 2025

# సమాజాన్ని మీడియా ప్రతిబింబించాలి

### కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి సురేష్ లాల్

**వరంగల్ ఎంజీఎం, మే 4(జనంసాక్షి)**



సమాజంలో చోటు చేసుకున్న పరిణామాలు సంఘటనలను రాజకీయం ఒక చిత్రాన్ని ప్రజల మనోగతాన్ని మీడియా ప్రతిబింబించాలని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ బి సురేష్ లాల్ చెప్పారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం 2022బి2024 జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంకు దూర విద్య కేంద్రం సమావేశం మందిరంలో జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షత వహించారు, సమావేశానికి ముందుగా పహల్గం లో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పేదరికం నిరక్షరాస్యత ఆకలి లాంటి రుగ్మతలు లేని సమాజం ఉండాలని జర్నలిస్టులు తపన పడాలని ప్రొఫెసర్ బి సురేష్ లాల్ ఆకాంక్షించారు. జర్నలిస్టులు మంచి సమాజం కోసం నిరంతరం నిఘా వేసుకొని ఉండాలన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మధ్యమాల విస్తృతి మూలంగా ప్రపంచంలో ఏ సంఘటన జరిగిన కణాల్లో శరవేగంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టులకు సృజనాత్మకత ఉండాలని ఆచార్య బి సురేష్ లాల్ సూచించారు. జర్నలిజంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవడానికి జర్నలిజం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తో పాటు కాలంతో పోటీ పడి పనిచేసే తత్వం ఉండాలని ఆయన చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చిన మార్పు మూలంగా గుర్తించిన మేద (ఏ ఐ) మిషన్ లర్నింగ్ (ఎం ఎల్) మీడియా స్వరూపంలో మార్చేశాయనీ బి సురేష్ చెప్పారు. గౌరవ అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజం పట్ల కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించాల న్నారు. జర్నలిస్టులు సత్ప్రవర్తనతో మెలగాలని చెప్పారు. జర్నలిజం కోర్స్ చదివితే సమాజాన్ని చదివినట్టుగా ఉంటుందని డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి చెప్పారు తెలంగాణలోని వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల మట్టి వాసన తెలిసిన వ్యక్తిగా ఈ ప్రాంతానికి వచ్చానని ఆయన తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం కు చెందిన డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి దేశ, రాష్ట్ర నలుమూలల్లో ప్రముఖ జర్నలిస్టులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. వరంగల్ లోని జనధర్మ, వరంగల్ వాణి దినపత్రికలను తాను లెటర్ ప్రెస్ లో చూసానని ప్రస్తుతం డిజిటల్ మీడియాను చూస్తున్నానని డాక్టర్ వెంకటరమణ గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జర్నలిజం కోర్స్ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు కొదవ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహారాములు, పెరుమళ్ళ వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, చిరంజీవి, డాక్టర్ శంకర్, సిబ్బంది ప్రనుప్, విద్యార్థులు ఈర్ల కుమార్, దుబాసి రవీందర్, బి కమలాకర్, పున్నంచందర్, సునీత, మహోన్నత, కే బాబురావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీభత్సం సృష్టించిన గాలి దుమారం



### విరిగి పడ్డ చెట్లు.. తడిసిన ధాన్యం
### అరగంట పాటు గాలితో పైకి లేచిన దుమ్ము

**నంగునూరు,మే 4, (జనంసాక్షి)**

గాలి దుమారం, ఉరుములతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలంలో ఆదివారం సాయంత్రం గాలి దుమారంతో మామిడి తోటలకు తీరని నష్టం వాటిల్లింది. తోటల్లో మామిడికాయలు పూర్తిగా రాలి పోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాలలో చెట్లు వేర్లతో లేచి పడ్డాయి. చెట్లు రహదారులపై పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. సుమారు అరగంట పాటు వీచిన గాలి దుమారంతో ఇండ్లపై పెంకులు, రేకులు లేచి పోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సుమారు అరగంట పాటు వీచిన గాలి దుమారం వల్ల దుమ్ము పైకి లేవడంతో రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కూడిన సిద్దన్నపేటలో ఒక వేప చెట్టు వేర్లతో సహా, మరో చెట్టు కొమ్మలు విరిగి బద్ధిపడగ వైపు వెళ్ళే రహదారిపై పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. మామిడి తోటల్లో మామిడి కాయలు నేలపై పరిచినట్టు రాలి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం వేస్తున్నారు. సిద్ధిపేట, చిన్నకోడూరు తదితర మండలాలలో ఉరుములు, ఈదురు గాడ్పులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు తడిసిపోయాయి. ధాన్యం రాశులపై కప్పిన కవర్లు వేగంగా డ్డులకు కొట్టుకుపోయాయి. మామిడి తోటలో మామిడికాయలు రాలి తీవ్ర నష్టం వాటిల్లింది

# తెలంగాణ ఉద్యమకారుల అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

**కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జివి. రామకృష్ణారావు**

**కరీంనగర్ బ్యూరో, మే 02 (జనంసాక్షి)**



ఆదివారం రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని హోటల్లో ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో కరీంనగర్ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చేయిర్మెన్ కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జివి. రామకృష్ణారావు, టియుఎఫ్ చేయిర్ మెన్ చీమ శ్రీనివాస్, ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ లతో కలిసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు సంబంధించినటువంటి నాయకులు ఉద్యమకారులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కొరకు ఆహర్నిశలు కష్టపడి రాష్ట్రం సిద్ధించేంతవరకు కొట్లాడినటువంటి ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదని జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు తప్పకుండా అమలుపరచాలని, ఉద్యమకారుల ఆర్థిక స్థితిగతులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రతి నిజమైనటువంటి ఉద్యమకారునికి 250 చదర గజాల భూమితో పాటు 25 వేల పెన్షన్ వైద్య సదుపాయాలు వారి పిల్లలకు ఉచిత విద్య అవకాశాలు కల్పించి వారిని తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని, గత పది సంవత్సరాలుగా వందలాది మంది ఉద్యమకారులు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా వెనుకబాటు గురై ఆత్మహత్య లకు గురైనటువంటి సందర్భాలు మనకు స్పష్టంగా కనబడు తున్నారని, తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటాం అన్నటువంటి ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇచ్చినటువంటి హామీలు అతి తొందరగా అమలుపరచాలని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల్లో వారికి భాగం కల్పించాలని వారికి ఆర్థిక మనోధైర్యం నింపాలని కోరు కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ సమయం ఆసన్నమైంది



### బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**హైదరాబాద్, మే4 (జనంసాక్షి)**

: అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయానికి, అణిచివేతకు గురవుతున్న ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ కల్పించే సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటుగా కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తమ బీఆర్ఎస్ స్వాగతిస్తున్నదని చెప్పారు. కులగణనతో మాత్రమే సరిపెట్టకుండా, వాటి జనసంఖ్య దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్స్ కూడా అమలుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్స్ ప్రవేశపెట్టి అమలుపర్చ డానికి ఈ కులగణన దోహదపడు తుందని, అందుకు ఇది సరైన సమయమని ఎంపీ వద్దిరాజు అభిప్రాయపడ్డారు . హైదరాబాద్ గచ్చిబౌలి యశోదా ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఏర్పాటు చేసిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిపించిన సర్వేలో బాగా తొండి (తప్పులు)జరిగిందని మున్నూరుకాపు, ఇతర బీసీ కులాల జనాభాను 50లక్షల వరకు తక్కువ చేసి చూపడం జరిగిందని, దీనిని తాము తీవ్రంగా ఖండించడం జరిగింద న్నారు. పవన్ కళ్యాణ్ సినిమా రంగంతో పాటుగా రాజకీయంగా కూడా బాగా ఎదగడం సంతోషకర మన్నారు. ప్రాంతాలు వేరైనా కూడా కాపు, తెలగ, తూర్పు కాపు, బలిజ ,ఒంటరి ,మున్నూరు కాపులంతా ఒక్కటేనని, మనమందరం ఇదేవిధంగా సంఘటితంగా

ముందుకు సాగితే ఇరు తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా మరింత బలపడొచ్చని ఎంపీ వద్దిరాజు చెప్పారు. మన సామాజిక వర్గానికి చెందిన వివిధ పేర్లతో పిలువబడుతున్న వారు పలు రాష్ట్రాలలో కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారని, పార్లమెంట్ సభ్యులలో సుమారు 200 వరకు ఉండొచ్చని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమోహన్ రావు తదితర కాపు ప్రముఖులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసి కోరడంతో ఈ పక్కనే ఉన్న విలువైన 7 ఎకరాలను కేటాయించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. కాపు, మున్నూరుకాపు, తెలగ, తూర్పు కాపు, బలిజ, ఒంటరి కులాల వారికి 6,000 రాయితీ కార్డులను యశోదా ఆస్పత్రి యాజమాన్యం అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఛైర్మన్ రవీందర్ రావు ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# విసునూరులో నకిలీ దేశ గురువు మోసం

### మాయ మాటలతో లక్ష 30 వేలు వసూలు
### నిలదీసిన గ్రామస్తులు.. తప్పించుకొని పారిపోయిన గురువు

**పాలకుర్తి, మే 04 (జనంసాక్షి)**



నకిలీ దేశ గురువు మోసాలకు పాల్పడడంతో విసునూరు గ్రామస్తులు మోసపోయిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం విసునూరు గ్రామంలో గత మూడు రోజులుగా దేశ గురువు పేరుతో సంచరిస్తూ అమాయక ప్రజల నుండి లక్ష 30 వేలు వసూలు చేయడంతో దేశ గురువు పట్ల గ్రామస్తులు అనుమానం మొదలైంది. గ్రామంలో గుర్రంపై పురవీధుల్లో తిరుగుతూ కుటుంబాల్లో సమస్యలు ఉన్నాయని, బాగు చేస్తానని ప్రజలను నమ్మించడంతో ఒక్కొక్కరు 2000 నుండి 15వేల వరకు నకిలీ దేశ గురువుకు ముడుపులు చెల్లించారు. డబ్బులు లేక కొంతమంది 5 క్వింటాళ్ల బియ్యం తో పాటు గొర్రె పిల్లలను అందజేశారు. గ్రామంలో నకిలీ దేశ గురువు సంచరిస్తుం డటంతో గ్రామస్తులు నిలదీశారు. గ్రామస్తుల చెర నుండి నకిలీ దేశ గురువు తప్పించుకున్నాడు. నకిలీ దేశ గురువు అనుచరులు పారిపోయేందుకు దేశ గురువు ఉపయోగించే గుర్రాన్ని టాటా ఎస్ లో ఎక్కించాలని గ్రామస్తులు తెలిపారు. నకిలీ దేశ గురువు అనుచరులను విసునూరు మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య తోపాటు గ్రామస్తులు పట్టుకొని ప్రశ్నించారు. ద్విచక్ర వాహనాల ను లాక్కున్నారు. గుర్రాన్ని తరలించే వాహనాన్ని అడ్డుకున్నారు. గ్రామంలో ప్రజల నుండి లక్ష 30 వేలు వసూలు చేశామని ఒప్పుకోవడంతో వసూలు చేసిన డబ్బులు చెల్లించే వరకు ఎటు వెళ్లకూడదని గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో నకిలీ దేశ గురువు అనుచరులు డబ్బులు చెల్లించారు. సూర్యాపేట జిల్లా పెన్పహాడ్ మండలం, నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన నకిలీ దేశ గురువు రాజశేఖర్ దేశ గురువునని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నాడని ప్రజలు తెలిపారు. దేశ గురువులు ఒక్కో గ్రామంలో సుమారు నెల నుండి రెండు నెలలు ఉంటారని, నకిలీ దేశ గురువులు ప్రజలను మోసం చేస్తూ ఒకటి, రెండు రోజులు మాత్రమే గ్రామాల్లో సంచరిస్తూ పేద ప్రజల నుండి అందిన కాడికి దోచుకుంటారని వివరించారు. నకిలీ దేశ గురువుల ముసుగులో సూర్యాపేట జిల్లా నుండి ఎక్కువ మొత్తంలో నకిలీ దేశపురువులు సంచరిస్తున్నారని తెలిసింది. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కట్టంగూరు, తిమ్మాపూర్, నకిరేకల్, నల్లగొండ జిల్లా ఆలియా ప్రాంతాలకు చెందిన నకిలీ దేశ గురువులు బొడ్రాయిలను ప్రతిష్టిస్తామని ప్రజలను మోసం చేస్తారని ప్రజలు వివరించారు. గతంలో గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాల్లో ఇదే తరహాలో మోసాలకు పాల్పడితే ప్రజల నుండి ప్రతిఘటన ఎదురైందని సమాచారం. దేశ గురువుల పేరుతో ప్రజలను మోసం చేస్తూ అందిన కాడికి దోచుకునే వ్యక్తులను ప్రజలు నమ్మరాదని గ్రామాల పెద్దలు కోరుతున్నారు. నకిలీ దేశ గురువులను గ్రామాల్లో ఆశ్రయం కల్పించరాదని సూచించారు. గ్రామంలో నకిలీ దేశ గురువు వసూలు చేసిన డబ్బులను ఎవరివి వారికి తిరిగి చెల్లిస్తామని మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా నకిలీ దేశ గురువుల పట్ల ఎలాంటి ఫిర్యాదులు అందలేదని వివరణ ఇచ్చారు.

# చిన్నారుల ప్రాణాలకు అండగా నిలవడం అభినందనీయం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 4 (జనం సాక్షి)**

: ఉప్పల శ్రీనివాస్ గుప్తా 53 వ జన్మదిన సందర్భంగా కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. రక్తదాతలను ఉప్పల శ్రీనివాస్ గుప్తా, దుద్దెల శ్రీనివాస్ అభినందిం చారు. బిబిపేట్ మండల కేంద్రంలో ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త 53 వ జన్మదిన సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ డెవలప్మెంట్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డిఐజి దుద్దెల శ్రీనివాస్ లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాతలందరికీ అభినందనలు తెలియజేస్తూ ప్రశంస పత్రాలను, స్టీల్ వాటర్ బాటిల్స్ ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తన జన్మదినానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో తల సేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామని కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సంయుక్తంగా ఇప్పటివరకు 3 వేల యూనిట్ల రక్తాన్ని చిన్నారుల కోసం అందజేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారుల ప్రాణాల కాపాడడం కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని అన్నారు. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగించాలని ఆకాంక్షిం చారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షలను అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమద్,,ఉపాధ్యక్షులు పర్శ, వెంకటరమణ ,,వాసవి క్లబ్ అధ్యక్షుడు నాగభూషణం,, కార్యదర్శి ఉప్పల సాయినాథ్, కోశాధికారి రెడ్డి శెట్టి నాగభూష ణం,,మాజీ డిప్యూటీ గవర్నర్ దుద్దెల, విశ్వప్రసాద్, అంతర్జాతీయ వాసవి క్లబ్ కోఆర్డినేటర్ బాశెట్టి నాగేశ్వర్, బచ్చు చంద్రశేఖర్,,పబ్బు యాదగిరి, రెడ్ శెట్టి వెంకటేశం లు పాల్గొనడం జరిగింది.

# అంతరించిపోతున్న కళలకు జీవం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 4 (జనంసాక్షి) :**



నేటి సమాజంలో అంతరించి పోతున్న కళలను జీవం పోస్తున్న కళాకారులు చిరుతల రామాయణం వేస్తూ ప్రజలను ఆకట్టుకుం టున్నారు. చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఈనెల 1 నుండి 3 వరకు మూడు రోజుల పాటు కళాకారులు ఆడిన చిరుతల రామాయణం నాటకం ప్రజలను మంత్రముగ్దులను చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కళాకారుల సంఘం ఏర్పాటు చేసుకొని నాటకాలు వేస్తున్నారు. గతంలో తుపాకుల మోత వినబడే నూకలమర్రికి చెందిన బొడ్డు రాములు శ్రీరాముడిగా, సీతగా శ్రీనివాస్, ఆంజనేయుడిగా ఎర్ర దేవరాజు, లక్ష్మణుడుగా అనంతరెడ్డి, వాలి సూర్పనగా శంకర్, పాత్రలు వేయగా ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్న సావనపల్లి శ్రీనివాస్ రావణాసురుని పాత్ర వేశారు. మూడు రోజులుగ తమ నటనలతో ఎంతగానో ఆకట్టుకొని వారు వేసిన పాత్రలకు జీవం పోశారు.
అంతరించిపోతున్న కలలను మళ్లీ ప్రజల వద్దకు తీసుకురావడంతో ప్రజలు వీరిని అభినందించారు.

# 16న అమెరికాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చిన సిబిఐ కోర్టు

**హైదరాబాద్, మే4 (జనంసాక్షి) :**



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 16 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్సీ కవిత – అనిల్ దంపతులు ఈ నెల 16వ తేదీన అమెరికాకు బయలుదేరనున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు అనుమతిస్తూ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది.

# పరాగ్ పోరు వృధా

## ఒక్క పరుగు తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్ థ్రిల్లింగ్ విజయం

### ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ పోరు

- రియాన్ పరాగ్ పోరాటం వృథా..
- పాయింట్ల పట్టికలో ఐదో స్థానం



ఐపీఎల్ 18వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తమ ఐదో విజయాన్ని నమోదు చేసింది. సొంత మైదానమైన ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్)తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో కేకేఆర్ ఒక్క పరుగు తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరిత అనుభవాన్ని అందించింది, చివరి బంతి వరకు ఉత్సాహాన్ని నింపింది. టాస్ గెలిచిన కేకేఆర్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఆండ్రీ రస్సెల్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో 25 బంతుల్లో 57 పరుగులు (4 ఫోర్లు, 6 సిక్సర్లు) సాధించి జట్టు స్కోరును ఊపందుకునేలా చేశాడు. ఓపెనర్లు సునీల్ నరైన్, రెహ్మానుల్లా గుర్బాజ్, మరియు అంగ్‌క్రిష్ రఘువంశీలు కూడా సమర్థవంతంగా రాణించారు, కానీ రస్సెల్ ఇన్నింగ్స్ ఈ స్కోరును సాధ్యం చేసిన కీలక అంశం.

**మధ్య ఓవర్లలో కేకేఆర్ ఆధిపత్యం**

మొయిన్ అలీ వేసిన ఏడో ఓవర్‌లో జైస్వాల్, రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. వరుణ్ చక్రవర్తి ఒకే ఓవర్‌లో ధ్రువ్ జురెల్ (0) మరియు వానిందు హసరంగ (0) వికెట్లను తీసి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ దశలో స్కోరు వేగం కొంత నెమ్మదించింది. అయితే, రియాన్ పరాగ్ ఒంటరి పోరాటంతో జట్టును ముందుకు నడిపించాడు. మొయిన్ అలీ వేసిన 13వ ఓవర్‌లో అతను ఐదు సిక్సర్లు బాది రాజస్థాన్ ఆశలను రగిలించాడు. పరాగ్ 45 బంతుల్లో 95 పరుగులు (6 ఫోర్లు, 8 సిక్సర్లు) సాధించినప్పటికీ, హర్షిత్ రాణా అతన్ని 17వ ఓవర్‌లో ఔట్ చేసి కేకేఆర్‌కు కీలక బ్రేక్‌త్రూ ఇచ్చాడు. హెట్‌మయర్ (23 బంతుల్లో 29) కూడా ఔటయ్యాడు, దీంతో 18 ఓవర్లకు రాజస్థాన్ స్కోరు 174/7గా నిలిచింది.

**చివరి ఓవర్ ఉత్కంఠ**

19వ ఓవర్‌లో ఆండ్రీ రస్సెల్ 11 పరుగులు ఇచ్చాడు. చివరి ఓవర్‌లో రాజస్థాన్‌కు 22 పరుగులు అవసరం కాగా, వైభవ్ అరోరా బౌలింగ్‌కు శుభమ్ దూబె (14 బంతుల్లో 25, 1 ఫోర్, 2 సిక్సర్లు) వరుసగా సిక్సర్, ఫోర్, సిక్సర్ బాదాడు. చివరి బంతికి 3 పరుగులు అవసరం కాగా, ఒకే పరుగు వచ్చింది. రెండో పరుగు కోసం ప్రయత్నించిన జోఫ్రా ఆర్చర్ (8 బంతుల్లో 12) రనౌట్ కావడంతో కేకేఆర్ ఒక్క పరుగు తేడాతో విజయాన్ని అందుకుంది.

**పరాగ్ ఒంటరి పోరాటం**

207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఆరంభంలోనే ఎదురుదెబ్బ తిన్నది. తొలి రెండు ఓవర్లలో వైభవ్ సూర్యవంశీ (4) మరియు కునాల్ సింగ్ రాథోడ్ (0) వెనుదిరగడంతో 8 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. అయితే, కెప్టెన్ రియాన్ పరాగ్ మరియు యశస్వి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. వైభవ్ అరోరా వేసిన మూడో ఓవర్‌లో ఇద్దరూ చెరో సిక్సర్ బాదారు. హర్షిత్ రాణా ఓవర్‌లో పరాగ్ రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో దూకుడు చూపించాడు. జైస్వాల్ (21 బంతుల్లో 34, 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా బౌండరీలతో రాణించడంతో, పవర్‌ప్లే ముగిసే సమయానికి రాజస్థాన్ 59/2తో బలమైన స్థితిలో నిలిచింది.


88 పరుగులతో అసమాన పోరాటం చేసినప్పటికీ, జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. అతని ఇన్నింగ్స్ ఈ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది.

**మ్యాచ్ ప్రభావం**

ఈ విజయంతో కేకేఆర్ ప్లే-ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది, పాయింట్ల పట్టికలో బలమైన స్థానాన్ని సంపాదించింది. రాజస్థాన్ రాయల్స్‌కు ఈ ఓటమి పెద్ద ఎదురుదెబ్బగా మారింది, ఎందుకంటే వారు కూడా ప్లే-ఆఫ్స్ రేసులో ఉన్నారు. రియాన్ పరాగ్ హీరోయిక్ ఇన్నింగ్స్, రస్సెల్ విధ్వంసం, మరియు చివరి బంతి వరకు కొనసాగిన ఉత్కంఠ ఈ మ్యాచ్‌ను ఐపీఎల్ 2025లో మరపురాని ఘట్టంగా నిలిపాయి.

## మ్యాక్సీ ఔట్..

ఐపీఎల్ 2025 సీజన్ నుంచి పంజాబ్ కింగ్స్ ఆటగాడు గ్లెన్ మ్యాకె వెల్ వైదొలిగాడు. గాయం కారణంగా దూరమైన మ్యాక్సీ స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు మిచెల్ ఓవెన్ ను పంజాబ్ తీసుకుంది. రూ.3 కోట్లతో ఆ జట్టుతో జాయిన్ కాబోతున్నాడు. 2024-25 సీజన్లో లో బిగ్ బాష్ లీగ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. హెూబర్ట్ హరికేన్స్ తొలిసారి విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. 200 స్ట్రైక్‌రేట్తో 452 పరుగులు చేశాడు.



ప్రస్తుతం మిచెల్ పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జాల్మీ జట్టుకు ఆడుతున్నాడు. బాబర్ అజామ్ కూడా ఇదే టీమ్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మిచెల్ ఎంపికపై ఐపీఎల్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. " పంజాబ్ కింగ్స్ ఆల్రౌండర్ మిచెల్ ఓవెన్ను తీసుకుంది. గ్లెన్ మ్యాక్స్వెల్ స్థానంలో అతడిని ఎంపిక చేసింది. వేలికి గాయం కావడంతో ఐపీఎల్లో మిగతా మ్యాచులకు మ్యాక్సీ దూరం కానున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ ఓవెన్ 34 టీ20లు ఆడి 646 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. పది వికెట్లూ తీశాడు" అని వెల్లడించింది.

## అసలైన ఛాంపియన్..

ఐపీఎల్ 2025 సీజన్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టాప్లోకి దూసుకెళ్లింది. 11 మ్యాచుల్లో ఎనిమిది విజయాలు సాధించిన ఆర్సీబీ దాదాపు నాకౌట్ దశకు చేరుకున్నట్లే. ప్రస్తుతం 505 పరుగులు చేసిన కోహ్లి ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. అతడి స్ట్రైక్రే చాలా విమర్శలు వస్తున్నాయి. కోహ్లి ఆటతీరు టీ20లకు పనికిరాదనే వ్యాఖ్యలూ వచ్చాయి. అయితే, వాటిని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కొట్టిపడేశాడు. సీఎస్కేపై కోహ్లి కేవలం 33 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు. "ఇప్పటి వరకు ప్రతి మ్యాచ్లో విరాట్ కోహ్లి యాంకర్ పాత్ర పోషించాడు. అంతకుముందు వరకు కనీసం 100 స్ట్రైక్రేట్తో పరుగులు రాబట్టాడు. అతడు దూకుడుగా ఆడాలంటే ఆడేస్తాడు. సీఎస్కేపై 187 స్ట్రైక్రేట్తో పరుగులు చేశాడు. తెల్ల బంతి క్రికెట్లో అతడు నిజమైన ఛాంపియన్. దూకుడుగా ఎలా ఆడాలో తెలుసు. నిలకడగా ఏ విధంగా పరుగులు రాబట్టాలో కోహ్లికి బాగా తెలుసు" అని ఇర్ఫాన్ పోస్టు పెట్టాడు.



## భారత్‌కు తొలి ఓటమి

కొలంబో: భారత మహిళల క్రికెట్ జట్టు ముక్కోణపు సిరీస్‌లో తొలి ఓటమిని చవిచూసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 275 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధానా 45 పరుగులు చేయగా, మిడిల్ ఆర్డర్‌లో రిచా ఘోష్ అద్భుతమైన బ్యాటింగ్‌తో 58 పరుగులు చేసి జట్టుకు పోరాడే స్కోరును అందించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 38 పరుగులు జోడించింది. అయితే, మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో భారత్ 300 పరుగుల మార్కును చేరుకోలేకపోయింది. శ్రీలంక బౌలర్లలో ఇనోషి ప్రియదర్శని మూడు వికెట్లు తీసి భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసింది.

అనంతరం బరిలోకి దిగిన శ్రీలంక జట్టు ఆరంభంలో తడబడింది. ఓపెనర్లు త్వరగా పెవిలియన్ చేరడంతో ఒత్తిడిలో పడింది. అయితే, మిడిల్ ఆర్డర్‌లో హర్షిత సమర విక్రమ, నిలాక్షి డి సిల్వా అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశారు. హర్షిత సమరవిక్రమ 53 పరుగులు చేయగా, నిలాక్షి డి సిల్వా కీలకమైన 56 పరుగులు చేసి జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. చివరి ఓవర్లలో శ్రీలంక బ్యాటర్లు సంయమనం పాటించి లక్ష్యాన్ని ఛేదించారు. భారత బౌలర్లలో స్నేహ రాణా తన స్పిన్‌తో 3 వికెట్లు తీసి శ్రీలంకను కట్టడి చేసే ప్రయత్నం చేసినప్పటికీ, ఇతర బౌలర్ల నుంచి సరైన సహకారం లభించకపోవడంతో ఫలితం ప్రతికూలంగా వచ్చింది. ఈ ఓటమితో సిరీస్‌లో భారత్‌కు ఇది తొలి ఎదురుదెబ్బ అయినప్పటికీ, ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. శ్రీలంక కూడా మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఈ ఓటమి భారత జట్టుకు ఒక గుణపాఠం లాంటిదని, రాబోయే మ్యాచ్‌ల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని ఆశిద్దాం.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ఈ టార్గెట్ని శ్రీలంక.. ఐదు బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లంక బ్యాటర్లలో నీలాక్షి డి సిల్వా (56), హర్షిత సమరవిక్రమ (53) అర్ధ శతకాలు బాదారు. టీమ్ ఇండియా బ్యాటర్లలో రిచా ఘోష్ (58బీ 48 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సు) మెరిసింది. ప్రతీకా రావల్ (35), జెమీమా రోడ్రిగ్స్ (37), హర్మన్ ప్రీత్ కౌర్ (30), హర్లీన్ డియోల్ (29), దీప్తి శర్మ (24) పరుగులు చేశారు.

## తేనెటీగ రామారావు ఇకలేరు


### టాలీవుడ్‌లో తీవ్ర విషాదం



**హైదరాబాద్, మే4 (జనంసాక్షి) :** తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నిర్మాత జవ్వాజి వెంకట రామారావు కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా ఆయన లివర్ సమస్యలతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1990ల్లో రామారావు పలు హిట్ సినిమాలు నిర్మించారు. తేనెటీగ, ప్రేమ అండ్ కో, బడి, బొబ్బిలి వేట వంటి సినిమాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. రాజేంద్ర ప్రసాద్, నరేశ్‌లతో రామారావు ఎక్కువ సినిమాలు తీశారు. రామారావుకు భార్యా, కొడుకు, కుమార్తె ఉన్నారు. రామారావు మరణవార్త తెలిసిన సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు.

## ఆసియా కప్‌లో పాక్ ఆడకపోవచ్చు : గవాస్కర్

### అసంతృప్తి వ్యక్తం చేసిన పాకిస్తాన్ మాజీ ప్లేయర్స్



ఈ ఏడాది భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్న ఆసియా కప్ టోర్నీ నుంచి పాకిస్తాన్ తప్పుకునే అవకాశం ఉందని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలపై పలువురు పాక్ మాజీ క్రికెటర్లు అసహనం వ్యక్తం చేశారు. జావేద్ మియాందాద్ సహా పలువురు మాజీలు దిగ్గజ బ్యాట్స్‌మెన్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్‌తో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో సెప్టెంబర్‌లో జరిగే టోర్నీ నుంచి పాక్ వైదొలగే అవకాశం ఉందని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను బీసీసీఐ పాటిస్తుందని.. ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదితో మ్యాచ్ ఆడేందుకు విముఖత చూపొచ్చని గవాస్కర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై మియాందాద్ ఓ మీడియా చానెల్‌తో మాట్లాడుతూ సన్నీ భాయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశాడంటే తాను నమ్మలేకపోతున్నానని తెలిపాడు. ఇద్దరి మధ్య మైదానంలోనూ, బయటా మంచి స్నేహం ఉందన్నారు. గవాస్కర్ ఎంతో గౌరవనీయుడు, నిరాడంబర వ్యక్తని.. ఎప్పుడూ రాజకీయాలకు దూరంగా ఉంటారన్నారు. మాజీ స్పిన్నర్ ఇక్బాల్ ఖాసిం మాట్లాడుతూ.. గవాస్కర్ అలాంటి చేశారంటే తాను నమ్మలేకపోతున్నానని పేర్కొన్నారు. గవాస్కర్ బాధ్యతాయుతమైన వ్యక్తని.. సరిహద్దుకు ఇరువైపులా ఆయనకు అభిమానులు ఉన్నారన్నారు. క్రీడలను రాజకీయాలతో కలపకూడదని స్పష్టం చేశారు. అయితే, మాజీ కెప్టెన్ బాసిత్ అలీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'తెలివితక్కువ మాటలు'గా.. ఆరోపణలు చేసే ముందు ఆధారాలు చూపాలన్నారు. మాజీ లెగ్ స్పిన్నర్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మాట్లాడుతూ మాజీ ప్లేయర్స్ సమయస్ఫూర్తితో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. హజ్రత్ అలీ మాట్లాడుతూ కోపంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని.. ఆ తర్వాత పశ్చాత్తాప పడాల్సి వస్తుందన్నారు. క్రికెట్ ప్రపంచంలో పాక్‌కు ఉన్న ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, క్రీడలను రాజకీయం చేయొద్దన్నారు.

## బావిలో ఈత కొడుతుండగా ఫిట్స్

### యువతి మృతి



**జనగామ, మే4 (జనంసాక్షి) :** స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువతి అనుకోని రీతిలో మరణించిన ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమదూర్ గ్రామంలో చోటు చేసుకుంది గ్రామానికి చెందిన కంట అఖిల అనే యువతి ఆదివారం ఉదయం ఫ్రెండ్స్‌తో కలిసి ఊరు శివారులో ఉన్న ఓ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లింది. సరదాగా అందరితో కలిసి ఈత కొడుతున్న సమయంలో అఖిలకు ఒక్కసారి పిట్స్ వచ్చాయి. దీంతో బావిలో కొట్టుమిట్టాడింది. బావిలో ఉండటంతో.. తోటి స్నేహితులు కూడా ఏం చేయలేకపోయారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన బావి నుంచి బయటకు తీసి.. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో.. యువతి మార్గం మధ్యలో మృతి చెందింది. మృతురాలు అఖిల హైద్రాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో అందరితో కల్మషం లేకుండా ఉండే అఖిల మృతితో చిన్నమదూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని కన్ను మూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న జస్టిస్ గిరిజా ప్రియదర్శిని ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు.

## బిడ్డ పరీక్ష రాయలేకపోయినందుకు..

# తల్లడిల్లిన తల్లి

### పరీక్షకు 3 నిమిషాలు ఆలస్యమైన విద్యార్థిని



**కరీంనగర్, మే4 (జనంసాక్షి) :** నీట్ పరీక్షకు 3 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయలేక పోయింది. ఆమె తల్లి ఎంత బతిమిలాడినా పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతి ఁచలేదు. తన కుమార్తెను పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఎంతగా ప్రాధేయపడినా అధికారులు అంగీకరించకపోవడంతో విద్యార్థిని తల్లి కన్నీరు మున్నీరయ్యారు. కరీంనగర్లోని మహిళల డిగ్రీ, పీజీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వేములవాడ నుంచి తన తల్లితో విద్యార్థిని బయలుదేరింది. 3 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయలేకపోయింది.

ఆమె తల్లి ఎంత బతిమిలాడినా పరీక్ష రాసేందు కు అధికారులు అనుమతించలేదు. తన కుమార్తెను పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఎంతగా ప్రాధేయపడినా అధికారులు అంగీకరించకపోవడంతో విద్యార్థిని తల్లి కన్నీరుమున్నీరయ్యారు. కరీంనగర్లోని మహిళల డిగ్రీ, పీజీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వేములవాడ నుంచి తన తల్లితో విద్యార్థిని బయలుదేరింది. మూడు నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకుంది. ఈ విషయాన్ని అక్కడి అధికారులకు చెప్పి బతిమిలాడినా వారు కనికరించలేదు. కూలీ పని చేసి, తన పుస్తెలతాడు పెట్టి లోన్ తీసుకొని తన కుమార్తెను లాంగ్టర్మ్ కోచింగ్కు పంపించానని ఒక మంచి హెూదాలో చూస్తానని కలలు కన్నానని కానీ దురదృష్టవశాత్తూ ఆ ఆశలన్నీ అడియాశయ్యాయని ఆ తల్లి విలపించిన తీరు కలచి వేసింది.

## ఇండియాలో పవర్ ఫుల్ ఆయుధం ఓటు

### వియత్నంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**హైదరాబాద్, మే4 (జనంసాక్షి) :** ఓటు అనేది ఇండియాలో ఒక పవర్ఫుల్ ఆయుధం అని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. సస్టైనబుల్ డెవలప్ మెంట్ అండ్ ప్రిన్సిపుల్స్ అనే అంశంపై వియత్నంలోని డానాంగ్‌లో అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం కొనసాగుతోంది. దీనిలో భాగంగా నాలుగో రోజు ఆదివారం అంతర్జాతీయ రాజకీయ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడారు. భారత దేశంలో రాజకీయ వ్యవస్థ, పార్టీలు, ప్రముఖ రాజకీయ నేతలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణలో ప్రజా పాలన ప్రాముఖ్యతను తెలియజేశారు. ముఖ్యంగా ఇండియాలో ప్రస్తుతం కేంద్రంలో కొనసాగిస్తున్న పాలన విధానంతోపాటుగా తెలంగాణలోని సర్కారు విధానాన్ని వివరించారు. హైదరాబాద్మహానగరంలో మూసీ ప్రాజెక్టుతోపాటుగా మెట్రో రైలు, ఈ బస్సుల ద్వారా పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్పై సమగ్రంగా తెలియజేశారు. అలాగే, తెలుగు రాష్ట్రాలలో ఉన్నటువంటి భాషా, సంస్కృతులు, స్లాంగ్కు సంబంధించి ప్రత్యేకించి చెప్పారు. ఇండియాలో ఓటుకు ఉన్న ప్రాధానాన్ని తెలియజేశారు. ఈ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో 13 దేశాల నుంచి ప్రతి నిధులు పాల్గొంటున్నారు. ఈ శిక్షణా సదస్సుకు భారత్ నుంచి ప్రతి నిధులుగా ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్, బూసా అనులేఖ హాజరయ్యారు.

## జిల్లాల్లో వడగళ్ల వానలు

### 13 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** తెలంగాణలో రాగల నాలుగురోజులు వర్షాలు కొనసాగుతా యని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో వడగండ్ల వానలు, మరికొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వండగండ్ల వానలు కురుస్తాయని పేర్కొంది.

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వచే అవకాశం ఉందని పేర్కొంది.

దాంతో ఆయా జిల్లాలకు హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయంటూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలో ఉరుములు, మెరుపులు వానలు కురుస్తాయని తెలిపింది.

ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది ఐఎండీ హైదరాబాద్. అలాగే, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఈ నెల 6, 7 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది.

## మర్మాంగాలపై పెంపుడు కుక్క దాడి, వ్యక్తి మృతి

**హైదరాబాద్, మే4 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. పెంపుడు కుక్క దాడి చేయడంతో వ్యక్తి చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన పవన్ కుమార్ (37) గత ఐదేళ్లుగా తన స్నేహితుడితో కలిసి మధురానగర్‌లో నివాసం ఉంటున్నాడు. పవన్ ఓ ప్రైవేటు కంపెనీలో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తుండగా గత కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా ఆఫీసుకు వెళ్లడం లేదు. ప్రతిరోజూ స్నేహితుడితో వాకింగ్ వెళ్లే పవన్ శనివారం రాత్రి కూడా వాకింగ్ వెళ్లి వచ్చి పడుకున్నాడు. ఉదయం పవన్ ఫోన్ ఎత్తకపోవడంతో డోర్ కొట్టారు. అయినా తీయకపోవడంతో అతడి స్నేహితుడు చుట్టుపక్కల వారిని పిలిచి డోర్ పగలగొట్టారు. లోపలికి వెళ్లేసరికి పవన్ మర్మాంగాలపై తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పక్కనే అతడి పెంపుడు కుక్క ఉండగా దాని నోరంతా రక్తంతో నిండి ఉంది. దీంతో పెంపుడు కుక్కనే పవన్ ప్రైవేటు పార్ట్స్ పై దాడి చేసిందని పోలీసులు అనుమానిస్తున్నారు. పవన్‌కు గతంలో వివాహం జరగ్గా భార్యతో విడాకులు తీసుకున్నాడు. అతడి స్నేహితుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## మిస్ వరల్డ్ పోటీల కోసం హైదరాబాద్ జిగేల్

- ప్రపంచ సుందరీమణుల పోటీలకు సిద్ధమవుతున్న హైదరాబాద్
- రహదారులు, కూడళ్లు సుందరీకరణ
- హైటెక్ సిటీ అంతా అందాలే




**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** మహానగరం ప్రపంచ సుందరీమణుల పోటీలకు ముస్తాబవుతోంది. రహదారులు, కూడళ్లు, పర్యాటక కేంద్రాలు, ముఖ్యమైన భవాలను అందంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ నడుంబిగించింది. అందాల భామలు, అతిథులు తిరిగే రహదారులపై గుంతల్లేకుండా చూసుకోవడం, లేన్ మార్కింగ్, కాలిబాటలు, కూడళ్ల సుందరీకరణ, పచ్చదనం ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదిశగా యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ చేశారు.

ఇప్పుడిప్పుడే ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేవారు ఇప్పటికే నగరానికి చేరుకోవడం ప్రారంభించారు. పోటీదారులు, అతిథులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నగరంలోకి చేరుకునే అన్ని రోడ్లను బల్దియా చక్కదిద్దుతోంది. అటువైపు వెళ్లే రోడ్లు, చుట్టు పక్కల ప్రాంతాలను ముస్తాబు చేయాలని నిర్ణయం తీసుకుంది. రోజంతా పారిశుద్ధ్య నిర్వహణకు జోనల్, సర్కిళ్ల స్థాయిలో కమిటీలు వేసింది. 151 కి.మీ. రోడ్లను కేంద్ర కార్యాలయం మ్యాపింగ్ చేసి, పర్యవేక్షణకు ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించింది. ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను సైతం జీహెచ్ఎంసీ చేపట్టబోతోంది. నగరంలో ఉన్న 250 బస్టాపులపై ఫ్లెక్సీ బోర్డులు, పలు వారసత్వ కట్టడాలు, రహదారుల్లో రూ.1.8 కోట్లతో ఎల్ఈడీ విద్యుద్దీపాల ఏర్పాటు, సెల్ఫీ పాయింట్లు, ఇతరత్రా ఏర్పాట్లు పురోగతిలో ఉన్నాయి.

**హైటెక్సిటీ ప్రాంతమంతా అందాలే**

పోటీదారులు, అతిథులు ఆ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో విహరించే అవకాశం ఉండటంతో రూ.1.89 కోట్లతో పైవంతెనలపై క్రాష్ బారియర్లు, రోడ్ల విభాగినులు, కాలిబాటలకు రంగులు సైతం వేస్తున్నారు. యూటర్న్లు, రహదారులకు మరమ్మతులు, లేన్ మార్కింగ్ చేస్తున్నారు. చౌమహల్లా ప్యాలెస్, చార్మినార్, తదితర ప్రాంతాలనూ అతిథులు సందర్శిస్తారని అధికారులు చెబుతున్నారు. అక్కడా మరమ్మతులు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ చెప్పింది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
05 మే 2025

# అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- మహిళల జీవితాలలో వెలుగులు నింపడం ప్రభుత్వ సంకల్పం
- ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు నిరంతర కృషి
- 12 కోట్లతో జూనియర్, డిగ్రీ కళాశాలల కొత్త భవనాల నిర్మాణం
- వేల కోట్లతో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు
- చివరి అంచు వరకు సాగు నీరు అందించేందుకు చర్యలు
- వందల కోట్లతో మారు మూల గ్రామాలకు రహదారుల నిర్మాణాలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హుజూర్ నగర్ మే 04 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తన జీవితాన్ని ప్రజా జీవితానికి అంకితం చేసి నిబద్ధత, నిజాయితీతో పారదర్శకంగా ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతున్నానని అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని 231 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ/షాధి ముబారక్ పథకంలో భాగంగా రెండు కోట్ల ముప్పయి లక్షల రూపాయల చెక్ లను మంత్రి ఉత్తమ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళల జీవితాలలో వెలుగులు నింపడం ప్రభుత్వ సంకల్పమన్నారు. మహిళలను సుసంపన్నం చేసేందుకే వడ్డీలేని రుణాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత విద్యార్థి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు వీలుగా ఇక్కడ ఐ.టి.ఐ తో పాటు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ను నెలకొల్పినట్లు ఆయన వివరించారు. అంతే గాకుండా ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గాను హుజుర్నగర్ లో 7.50 కోట్ల వ్యయంతో జూనియర్ కళాశాల భవనం, 4.50 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాలను నిర్మిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హుజుర్నగర్, కోదాడ ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకే వేల కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అందుకు గాను త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. చివరి అంచు వరకు సాగు నీరు అందించాలని నీటిపారుదల రంగంపై పెట్టె ప్రతి పైసా రైతాంగానికి ఉపయోగ పడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెరుగుతున్న రవాణాకు తగిన రీతిలో మారుమూల గ్రామాలలో వందల కోట్లు వెచ్చించి రహదారుల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన 2000 ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు మొత్తానికి మొత్తంగా హుజూర్ నగర్ పట్టణంతో పాటు హుజూర్ నగర్ మండలానికి చెందిన వారై ఉండాలని సూచించారు. అయితే ఇళ్ల కేటాయింపులలో ఎటువంటి వత్తిడికి లొంగొద్దని పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. మిగిలిన మండలాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయలు అందించే ప్రక్రియ త్వరలోనే ప్రారంభం అవుతుందని ప్రకటించారు. అర్హులైన నిరుపేదలకు ఉచితంగా అందించే సన్న బియ్యం పంపిణీ హుజూర్ నగర్ లో ఉగాది పర్వదినం రోజున ప్రారంభించడం ముమ్మాటికీ ఒక చారిత్రాత్మకమైన సందర్భంగా ఆయన అభివర్ణించారు.

అటువంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి తాను మంత్రిగా విధులు నిర్వర్తించడం తన పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర జనాభాలో 84 శాతానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేసి పేదోళ్ల జీవితాల్లో వెలుగులు నింపడం మించిన సంక్షేమ పథకం మరోటి ఉండదన్నారు. యావత్ భారతదేశంలో ఈ తరహా కార్యక్రమం ఒక్క తెలంగాణా రాష్ట్రంలో అదీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభం కావడం విశేషమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# టెట్ పరీక్షపై టి-సాట్ స్పెషల్ లైవ్

- 6న నిపుణ ఛానల్ లో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం
- 50 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రత్యేక ప్రసారాలు
- టి.సాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలలో నిర్వహించబోయే టెట్ (తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పై టి-సాట్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరవ తేదీన ఉదయం 11 గంటలకు టి-సాట్ నిపుణ ఛానల్ ప్రత్యేక లైవ్ కార్యక్రమంలో ప్రధాన సబ్జెక్స్ కు సంబంధించి నలుగురు ఎక్స్ పర్ట్స్ పాల్గొంటారని, పరీక్షలో ప్రధానంగా ఎదుర్కోబోయే సమస్యలు, సమయ పాలన, పరీక్ష రాసే విధానం తదితర జాగ్రత్తలు సబ్జెక్టుల వారిగా వివరిస్తారన్నారు. జూన్ 15వ తేది నుండి 30వ తేది వరకు 15 రోజుల పాటు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై అభ్యర్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ సందేహాలకు సమాధానాల కోసం 040-23540326 / 726 టోల్ ఫ్రీ 1800 425 4039 నెంబర్లకు కాల్ చేయాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

**50 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రత్యేక ప్రసారాలు**

తెలంగాణ ప్రభుత్వం జూన్ 15వ తేది నుండి 30వ తేది వరకు నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు టి-సాట్ అరగంట నిడివిగల ప్రత్యేక పాఠ్యాంశాలను సుమారు 200 ఎపిసోడ్స్ సిద్ధం చేసి ప్రసారం చేస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. టి-సాట్ విద్య ఛానల్ ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు, నిపుణ ఛానల్ సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రసారాలు కొనసాగుతున్నాయన్నారు. టెట్ పరీక్ష రెండు పేపర్లకు సంబంధించి లాంగ్వేజెస్ తో పాటు పెడగాజీ, ఎన్విరాన్ మెంట్ సైన్స్, చైల్డ్ డెవెలప్ మెంట్ తదితర సబ్జెక్టులలో వీడియో పాఠ్యాంశాలను ప్రసారం చేస్తున్నామని, అభ్యర్థులు టి-సాట్ అందించే కంటెంట్ ను సద్వినియోగం చేసుకుని, డబ్బు, సమయాన్ని ఆదాచేసుకోవాలని సూచించారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన పోటీ పరీక్షలకు టి-సాట్ కంటెంట్ ఎంతగానో ఉపయోగ పడిందన్న విషయాన్ని స్వయంగా అభ్యర్థులే తెలియజేయడం పాఠ్యాంశాల నాణ్యతకు అద్దంపడుతోందని సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

# బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మరు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు స్వేచ్ఛగా ఉండాలంటే కాంగ్రెస్ ఉండాలని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌ని అధికారంలోకి తెచ్చుకుని బందీగా ఉండాలని ఎవరూ కోరుకోరని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. విద్యార్థులు, మహిళలు, రైతులు, యువత ఇలా అనేక మంది చాలా కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల మీద నిరసన తెలిపే హక్కు కూడా ఉండేది కాదని అన్నారు. ధర్నా చౌక్‌ను ఎత్తేసి ఒక నియంతలాగా కేసీఆర్ పాలించాడని అన్నారు.

బీఆర్ఎస్‌కు పూర్తి భిన్నంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని అన్నారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అనేక హామీలు అమలు చేశామని అన్నారు. 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం.. రైతులకు రైతుభరోసా, రుణమాఫీ చేశాం, మహిళలకు ఆర్టీసీల్లో ఉచిత ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇలా చెప్పుకుంటే అనేక హామీలు 17 నెలల్లోనే అమలు చేశామని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దెదింపి మళ్లీ నియంత బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే ఎవరూ కోరుకోరు అని అన్నారు.

కవిత కొత్త రాగం తీసుకున్నది.. తెలంగాణ ప్రజల్ని మోసం చేయడానికేనన్నారు. అధికారం పోయాక చాలా పెద్ద మాటలు మాట్లాడుతోందని, అధికారంలో ఉండగా గుర్తుకు రాని మాటలు ఇప్పుడు మాట్లాడుతోందని, మీ నాయన సీఎం గా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికే తెలంగాణ లో రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో..సామాజిక ప్రజా పరిపాలన కొనసాగుతుందని, స్వేచ్ఛగా గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛ కాంగ్రెస్ ఇచ్చిందని తెలిపారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని ..నటించడం కవిత మీ కుటుంబానికి సాధ్యమని తెలిపారు. కవిత మనసులో మాటలు ఆమెకు తెలియకుండానే బయటకు వచ్చాయని తెలిపారు.

# పాక్‌కు ధీటుగా జవాబివ్వాలి

- పాక్ ముఖంలో చిరునవ్వును తడిచేయాలి
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పాకిస్తాన్‌కు భారత్ ధీటుగా బదులివ్వాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ అన్నారు. పాకిస్థాన్ ముఖాల్లో ఆ చిరునవ్వును తుడిచేయాలని, భారత్ పై దాడి చేయాలంటే వంద సార్లు ఆలోచించేలా చర్యలు ఉండాలని అన్నారు.ఆదివారం బీహార్‌లోని ఈస్ట్ చంపారన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా అసద్.. పాకిస్థాన్ ఒక పెయిల్డ్ కంట్రీ అని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చినందుకు పాక్ పై భారత్ దీటుగా సమాధానం ఇవ్వాలని, ఈ విషయంలో ప్రధాని మోడీ గట్టి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే పాకిస్థాన్ ఇండియాపై దాడి చేసేందుకు ఎవరినైనా పంపించాలంటే 100 సార్లు ఆలోచించేలా చర్యలు ఉండాలని అన్నారు. అంతేగాక ఉగ్రదాడిపై పాక్ సిగ్గులేకుండా ఆధారాలు అడుగుతోందని, గతంలో వైమానిక దళ స్థావరంపై దాడి చేసినప్పుడు ఆధారాలు చూపిస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పాకిస్థాన్ తన దేశం నుంచి ఉగ్రవాదులు వచ్చి భారత ప్రజలను చంపుతారని ఎప్పటికీ అంగీకరించదని, భారత్ ను శాంతియుతంగా జీవించనివ్వదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పహల్గాం ఉగ్రదాడి విషయంలో రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

ఉగ్రదాడిలో తన భర్త ప్రాణాలు కోల్పోయిన నేవీ అధికారి వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి హిందూ- ముస్లిం విషాన్ని వ్యాప్తి చేసేవారికి చక్కని సందేశం ఇచ్చారని తెలిపారు. ఆమె తన భర్తను కోల్పోయానని, కానీ ముస్లింలు, కాశ్మీరీలపై హింసను కోరుకోవడం లేదని చెప్పిందని అన్నారు. ఆమె మాటలు భారత ప్రభుత్వం గుర్తుంచుకోవాలని, దేశాన్ని ఐక్యంగా ఉంచడం కోసం ద్వేషాన్ని కాదు.. ప్రేమ, శాంతిని పెంపొందించాలని సూచించారు. భారత్ లో విషాన్ని వ్యాప్తి చేస్తున్న వారు పాకిస్థాన్ ముఖాల్లో చిరునవ్వులు తెస్తున్నారని గుర్తుంచుకోవాలని, ఆ క్రూరమైన వ్యక్తుల ముఖాల్లో చిరునవ్వులు తుడిచేయాలని తాను కోరుకుంటున్నట్లు ఓవైసీ వెల్లడించారు.

# సీబీఎస్ఈ ఫలితాల వదంతులపై బోర్డు క్లారిటీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీబీఎస్ఈ ఫలితాల వదంతులపై బోర్డు క్లారిటీ ఇచ్చింది. 10వ, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలు మే 6న విడుదలవుతాయని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతుండగా అవన్నీ ఫేక్ వార్తలుగా కొట్టిపడేసింది బోర్డ్. అయితే సోమవారం ఉదయం 11 గంటలకు సీబీఎస్ఈ 10వ, 12వ తరగతుల ఫలితాలు విడుదల అవనున్నాయని వస్తున్న వదంతులను ఖండిస్తూ బోర్డ్ అధికారులు ఓ లేఖను విడుదల చేశారు. తాము ఎలాంటి ప్రకటన చేయలేదని తేల్చి చెప్పింది. విద్యార్థులు, తల్లిదండ్రులు అలాంటి వార్తలను నమ్మకూడదు అని కోరింది.

తాము ఏదైనా సమాచారం విడుదల చేస్తే దానిని తమ అధికారిక వెబ్సైట్ లో పొందుపరుస్తామని పేర్కొంది. కాగా ఈ ఏడాది అకడమిక్ ఇయర్ లో 10వ, 12వ తరగతి పరీక్షలకు దేశవ్యాప్తంగా దాదాపు 42 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 10వ తరగతికి చెందిన 24.12 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. 12వ తరగతికి చెందిన విద్యార్థులు 17.88 లక్షల మంది ఉన్నారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు దేశవ్యాప్తంగా 7,842 కేంద్రాలలో విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు.

# ములుగుకు బస్ స్టేషన్..


- ప్రారంభించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క



**ములుగు (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టీజీఎస్ఆర్టీసీలో కీలక మార్పులు చేసింది. ఆర్టీసీ సంస్థ బలోపేతం దిశగా అడుగులు వేస్తూ.. పలు నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణం, నూతన బస్ డిపోల మంజూరుకు అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ములుగు, పెద్దపల్లి జిల్లాల్లో బస్ డిపోలు ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాధనల మేరకు తెలంగాణ ఆర్టీసీ నూతన బస్ డిపోలకు అనుమతుల ఇచ్చింది.

ఇందులో భాగంగా ఆదివారం ములుగులో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్ సహా ఆర్టీసీ అధికారులు కొత్త బస్ స్టేషన్ కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ట్విట్టర్‌లో స్పందిస్తూ.. శంకుస్థాపనకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. దీనిపై ఆయన.. ములుగు జిల్లాకు బస్ డిపో లేదని, బస్ డిపో కావాలని ములుగు జిల్లా కేంద్రంలో బస్ స్టేషన్ కావాలని సీతక్క ప్రతిపాధనలు చేసినట్లు తెలిపారు. సీతక్క విజ్ఞప్తి మేరకు దాదాపు 5 కోట్లతో పైన 4 షాపులు, కింద 7 షాపులతో 4 వేల చదరపు అడుగులతో గ్రీనరీ, తాగు నీటి వసతితో అధునాతనంగా బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. అంతేగాక ములుగు జిల్లా కేంద్రంలో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ కు శంకుస్థాపన చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు.


# కోహినూర్ వజ్రంపై.. బ్రిటన్ మంత్రి క్లారిటీ



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** మన దేశ కోహినూర్ వజ్రం బ్రిటన్ రాణి కిరీటంలో ఉన్న సంగతి తెలిసిందే. దానిని తిరిగి ఇస్తారా అంటూ బ్రిటన్ మంత్రి లీసా నాండీకి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. దానికి ఆమె సమాధానం ఇస్తూ.. భారత్, బ్రిటన్ మధ్య సాంస్కృతిక కళా కండాల మార్పిడి కోసం ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. అన్నీ అనుకూలంగా జరిగితే అందరికీ ఆమోదయోగ్యమయ్యే నిర్ణయం రావచ్చని చెప్పారు. ఇదే విషయంపై భారత మంత్రిత్వశాఖ మంత్రితోనూ చర్చించినట్టు తెలిపారు. సృజనాత్మక, సాంస్కృతిక, క్రీడారంగాల్లో భారత్ భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్టు లీసా స్పష్టం చేశారు. సినిమా, మ్యూజిక్, టీవీ రంగాల్లో బ్రిటన్ దూసుకుపోతోందని ఆయా రంగాల్లో బ్రిటన్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని చెప్పారు. భారత్ సహకరిస్తే వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లచ్చనే నమ్మకం ఉందన్నారు. భారత్ కూడా సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. లీసా పహల్గామ్ దాడిలో చనిపోయిన వారికి నివాళులు అర్పించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచదేశాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

# నాణ్యమైన విత్తనాల పంపిణీకి సిద్ధం

- వ్యవసాయ శాఖ సన్నద్ధం



**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) : గ్రామ గ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం నూతన కార్యక్రమాన్ని జూన్ 2వ తేదీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఇప్పటికే అగ్రికల్చర్యూనిర్శిటీ, వ్యవసాయ శాఖ ఈనెలారులోగా విత్తనాలు మండలాలకు తరలించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12వేల గ్రామాలలోని ప్రతి గ్రామం నుండి మూడు నుంచి ఐదుగురు ఆసక్తి కలిగిన అభ్యుదయ రైతులకు విత్తన పంపిణీ చేయనుంది. ఈ పథకంలో సుమారుగా 2500 నుంచి 3వేల క్వింటాళ్ళ ఐదు ప్రధాన పంటల విత్తనాన్ని (వరి, కంది, పెసర, మినుము, జొన్న) దాదాపు 40 వేల మంది రైతులకు పంపిణీ జరగనుంది. ఈ పథకం ద్వారా నాణ్యమైన విత్తనం పొందిన రైతులు తిరిగి ఆయా పంటలలో పండిన విత్తన పంటను ఆయా గ్రామాలలో తమతోటి రైతాంగానికి తక్కువ ధరకు అందజేయాలి.**

దీంతో వచ్చే మూడు సంవత్సరాలలో గ్రామంలోని రైతులందరకి నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉంటాయి. దీని ఫలితంగా రైతాంగం నకిలీ విత్తనాల మోసాల బారినుండి రక్షించబడటమే కాకుండా నాణ్యమైన విత్తనం ద్వారా 10 నుంచి 15 శాతం అదనంగా దిగుబడులు పెరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు రైతు నికరాదాయం కూడా పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనేక రకాల కొత్త వంగడాలను అభివృద్ధి పరిచి, వాటిలో ప్రాముఖ్యం పొందిన విత్తనాలను రైతాంగానికి అందిస్తుంది. దీని ద్వారా రైతులను నాణ్యమైన విత్తనాలను వారి స్థాయిలోనే ఉత్పత్తి చేసుకొనే విధంగా ప్రోత్సహిస్తుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్పత్తి చేసి, అన్ని రకాల నాణ్యతా పరీక్షలు నిర్వహించిన విత్తనాలను పంపిణీ చేస్తోంది.

**మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి: వ్యవసాయ శాఖ**

వానాకాలం సీజన్ప్రారంభమైతుండటంతో రైతులు ఇప్పటికే పంటలు సాగు చేసేందుకు దుక్కులు దున్ని సిద్దం చేశారు. వర్షాలు కురువగానే పత్తి, కంది, మినుము, పెసర, వరి పంటలు వేసేందుకు విత్తనాల కోసం ప్రైవేటు విత్తన దుకాణాలను ఆశ్రయిస్తారు. దుకాణాల యాజమానులు రైతులు నాణ్యమైన విత్తనాలు గుర్తించరని నకిలీ విత్తనాలు వారికి అంటగట్టే ప్రయత్నాలు చేస్తారు. వాటిని రైతులు పొలంతో నాటితే పెరగక, కొన్న గింజలు భూమిలో ఉండిపోతాయి. దీంతో రైతులు లబోదిబోమంటూ మళ్లీ రెండోసారి కొనుగోలు చేస్తారు. ఇలాంటి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, దుకాణాల వద్ద కొనుగోలు చేస్తే తప్పకుండా రశీదు తీసుకోవాలని, ప్యాకెట్పై కంపెనీ పేరు ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370